


www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI




ఆదివారం | 23-11-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 235 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా.7.25 తదుపరి చవితి; నక్షత్రం: మూల రా.7.28 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: సా.5.41-7.28, తె. 6.02 మొదలు; దుర్ముహూర్తం: సా.4.05-4.50; అమృతఘడియలు: మ.12.21-2.07; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.28; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## ఇది జ్యుడీషియల్ యారగన్సీ కాదా?

కొన్ని కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేస్తున్న వ్యాఖ్యలు 'జ్యుడీషియల్ యారగన్సీ'ని తలపిస్తున్నాయి.

రాజ్యాంగం ప్రకారం గవర్నర్లకు-రాష్ట్రపతికి గడువు విధించే అధికారం న్యాయ వ్యవస్థకు లేకపోవచ్చు. అలాగని ఎవరికి వారు చేతులు ముడుచుకొని ఉండిపోతే ప్రజా ప్రయోజనాలు ఏంకావాలి? రాజ్యాంగ వ్యవస్థలలో భాగమైన రాష్ట్రపతికి గడువు విధించే అధికారం న్యాయ వ్యవస్థకు లేని పక్షంలో.... అదే రాజ్యాంగంలో మరో భాగమైన లెజిస్లేచర్ విషయంలో మరోరకంగా ఉత్తర్వు ఎలా ఇవ్వగలరు? తమకు అధికారం లేదని చెప్పడం వరకు ఆక్షేపణ ఉండదు కానీ, అదే సమయంలో ప్రస్తుత సమస్యను అధిగమించడానికి పార్లమెంటులో చట్టం చేయాలని లేదా రాజ్యాంగ సవరణ చేయాలని సుప్రీంకోర్టు సూచించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

ఇదే సుప్రీంకోర్టు కొద్ది రోజుల క్రితం పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు గడువు ఎలా విధించింది? తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు గడువు విధించడంతో అయిపోలేదు. ఈ అంశంపై విచారణకు వచ్చిన కోర్టు ధిక్కరణ పిటిషన్ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు జ్యుడీషియల్ యారగన్సీని గుర్తుకుతెస్తున్నాయి. 'మా ఆదేశాలు అమలు చేస్తారా లేదా? కొత్త సంవత్సరం రోజున ఎక్కడ ఉండాలో... అంటే జైల్లో ఉంటారో బయట ఉంటారో తేల్చుకోండి' అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ఉద్దేశించి కఠినంగా వ్యాఖ్యానించింది. గవర్నర్‌కు గడువు విధించే అధికారం లేనప్పుడు లెజిస్లేచర్ అధిపతికి గడువు విధించడంతోపాటు కోర్టు ధిక్కారం కింద జైలుకు పంపే అధికారం న్యాయ వ్యవస్థకు ఉంటుందా? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.


కొత్త పలుకు!

వాస్తవానికి, ఫిరాయింపులకు పాల్పడిన వారిపై స్పీకర్లు ఫలానా గడువులోపే చర్య తీసుకోవాలని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో లేదు. అలా చట్టంలో గడువు విధించకపోతే సదరు చట్టం చేసిన లక్ష్యం ఎలా నెరవేరుతుందని ప్రశ్నించాల్సిన సుప్రీంకోర్టు... ఇప్పుడు తెలంగాణ స్పీకర్‌కు తనకు తానుగా గడువు విధించింది.

చట్టం చేసిన లక్ష్యం నెరవేరాలంటే గడువు ఉండాలి. ఆ మేరకు పార్లమెంటుకు సర్వోన్నత న్యాయస్థానం సూచించి ఉండాల్సింది. అలా కాకుండా ఒక్కో కేసు విషయంలో ఒక్కోలా తీర్పులు ఇస్తూపోతుండటం వల్ల న్యాయ వ్యవస్థపై గౌరవం తగ్గుతుంది.

రాజ్యాంగం ప్రకారం చట్టసభల ప్రిసైడింగ్ అధికారులకు కూడా రక్షణ ఉంటుంది. అయినప్పటికీ... చర్య తీసుకుంటారా? జైలుకు వెళ్లడానికి సిద్ధపడతారా? అని న్యాయస్థానం హూంకరించింది. ఇదొక రకంగా పరిధిని అతిక్రమించడమే. నిజంగా ఆ పరిస్థితే వస్తే తెలంగాణ శాసనసభ స్పీకర్‌ను జైలుకు పంపగలరా? అదే జరిగితే సదరు ఆదేశాలు ఇచ్చిన న్యాయమూర్తిపై శాసనసభ కూడా చర్యలకు ఉపక్రమిస్తే పరిస్థితి ఏమిటి?

రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థల మధ్య సున్నితమైన లక్ష్మణ రేఖ ఉంటుంది. ఇటీవలి కాలంలో కేసుల విచారణ సందర్భంగా న్యాయ వ్యవస్థలోని కొందరు తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. చివరకు అవేమీ తీర్పులో భాగంగా ఉండవు. కేసు మెరిట్స్‌తో సంబంధం లేకుండా వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించడం ఇప్పుడొక సమస్యగా మారుతోంది. దీనివల్ల న్యాయ వ్యవస్థ కొన్ని సందర్భాలలో ప్రజల మన్ననలను పొందుతుండగా, మరి కొన్ని సందర్భాలలో ఆత్మరక్షణలో పడుతోంది.

పార్టీ ఫిరాయింపుల విషయంలో కూడా ఫలానా గడువులోగా చర్యలు తీసుకునేలా చట్టాన్ని సవరించాలని సూచిస్తే ఎవరు మాత్రం అభ్యంతరం చెబుతారు? ఇలాంటి విషయాలలో తమకు అధికారం లేదని న్యాయ వ్యవస్థ అభిప్రాయపడితే చేయగలిగిందేమీ లేదు.

రాజ్యాంగాన్ని ఎడాపెడా రాజకీయ అవసరాలకోసం సవరించిన ఈ దేశంలో గవర్నర్లయినా, స్పీకర్లయినా వారందరికీ గడువు విధిస్తూ సవరణ చేయలేమా? ఈ గడువు అనేది లేకపోతే వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోతుంది. న్యాయ వ్యవస్థకు కూడా ఇదే మాట వర్తిస్తుంది. న్యాయస్థానాలలో కేసుల పరిష్కారం విషయంలో అంతులేని జాప్యం జరుగుతోంది.

సాదాసీదా నేరస్తుల విషయంలో జాప్యం జరిగినా ఫర్వాలేదుగానీ రాజకీయాలలోకి వచ్చిన నిందితులు, నేరస్థుల విషయంలో అంతులేని జాప్యం జరిగితే సమాజం నష్టపోతుంది.

ప్రజా ప్రతినిధులపై ఉన్న కేసులలో కూడా శీఘ్ర పరిష్కారం కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఎందుకు ఏర్పాటు చేయకూడదు?

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దాదాపు పదమూడేళ్లుగా బెయిల్ మీదే ఉన్నారు. గడువు లేకపోవడం వల్లనే కదా ఇలా జరుగుతోంది. విచారణ పూర్తి చేసి ఆయన నిర్దోషి అని తేల్చితే ఎవరికీ అభ్యంతరం ఉండదు కదా! పుష్కర కాలం దాటినా జగన్ రెడ్డి ఆర్థిక నేరస్థుడో కాదో తేల్చుకోలేని స్థితిలో ప్రజలు ఉండటం ఏమిటి? ఫలితంగా జగన్ వంటి వారు చట్టంతో చెలగాటమాడుతున్నారు.

- ఆర్కే, విశ్లేషణ 4లో..

# బీసీలకు పట్టం

### డీసీసీ నియామకాల్లో 14 మందికి అవకాశం

- జిల్లా కాంగ్రెస్ కమిటీలకు కొత్త అధ్యక్షులు
- 9 మంది ఓసీలు, ఎస్టీ-6, ఎస్సీ-5, ఇద్దరు మైనారిటీ నేతలకు పట్టం
- ఐదుగురు ఎమ్మెల్యేలు, శాట్ చైర్మన్ కూడా..
- సంగారెడ్డి, రంగారెడ్డి మినహా 33 జిల్లాలు, 3 కార్పొరేషన్లకు నియామకం
- 36 మందితో జాబితా ప్రకటించిన ఏఐసీసీ
- నియామకాల్లో సామాజిక సమతుల్యం
- జాబితాలో ఐదుగురు మహిళా నేతలు



న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్థానిక సంస్థల సమరానికి సిద్ధమవుతున్న వేళ.. జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ కొత్త సారథులను నియమించింది. రంగారెడ్డి, సంగారెడ్డి మినహా పార్టీ పునర్వ్యవస్థీకరించుకున్న 33 జిల్లాలు, 3 కార్పొరేషన్‌లకు డీసీసీ అధ్యక్షుల నియామకం జరిపింది. ఈ మేరకు 36 మందితో కూడిన జాబితాను ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం మేరకు ఈ నియమాకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. కాగా, డీసీసీ అధ్యక్షుల నియామకాల్లో పార్టీ సామాజిక సమతుల్యం పాటించింది. 14 డీసీసీలను బీసీలకు కట్టబెట్టింది. 9 మంది ఓసీలు, ఆరుగురు ఎస్టీలు, ఐదుగురు ఎస్సీలు, ఇద్దరు మైనారిటీలకు అవకాశం కల్పించింది. వీరిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక కార్పొరేషన్ చైర్మన్‌కు సైతం డీసీసీ అధ్యక్ష పదవులు దక్కాయి. డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్యేల్లో బీర్ల అయిలయ్య (ఆలేరు), మేడిపల్లి సత్యం (చొప్పదండి), మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ (రామగుండం), వెడ్మ బొజ్జు (ఖానాపూర్), చిక్కుడు వంశీకృష్ణ (అచ్చంపేట), తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్) చైర్మన్ కె.శివసేనారెడ్డి ఉన్నారు. కాగా, గత అసెంబ్లీ

మిగతా 12వ పేజీలో...



## నియంతలను తరిమికొట్టిన కళాకారులు

- అదే కోవకు చెందిన గొప్ప కవి అందెశ్రీ
- 'జయ జయహే' గీతంపై గత సర్కారు కుట్ర
- కళాకారుల పోరాటం వల్లే రాష్ట్రం వచ్చిందన్న భావన నెలకొంటుందనే గీతాన్ని తొక్కిపెట్టారు
- రాష్ట్రంలో దళితుల జనాభా 17% ఉంటే 27% ప్రాతినిధ్యం కల్పించిన ఘనత మా సర్కారుది
- అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాలకులు ఆధిపత్యం చెలాయించాలనుకున్నప్పుడల్లా తెలంగాణ గడ్డమీద పుట్టిన కవులు, కళాకారులు గొంగడి దులిపి, గజ్జ కట్టి గళాన్ని సవరించి పోరాటంలోకి దుమికి నియంతలను తరిమికొడతారని చరిత్ర చెబుతోందని.. అలాంటి స్ఫూర్తిదాయకమైన సాహితీవేత్తల్లో ఒకరు అందెశ్రీ అని

మిగతా 13వ పేజీలో...

నేడు పుట్టపర్తికి సీఎం.. సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొననున్న రేవంత్ 13

### బీసీ సర్పంచుల రిజర్వేషన్‌కు ఆధారం..

# 2024 కులగణనే

### ఎస్సీ, ఎస్టీ సర్పంచులకు 2011 జనాభా లెక్కలు ఆధారం

- వార్డు సభ్యులందరికీ 2024 కులగణనే లెక్క
- పంచాయతీ ఎన్నికల మార్గదర్శకాల జీవో జారీ
- మెజారిటీ జిల్లాల్లో రిజర్వేషన్ల ఖరారు
- కేటాయింపులతో నేడు జిల్లాల వారీగా గెజిట్‌లు
- ముందు ఎస్టీ, తర్వాత ఎస్సీ, బీసీ, జనరల్, మహిళ
- 50% దాటకుండా పంచాయతీ రిజర్వేషన్లు
- మహిళలకు అన్ని వర్గాల్లో సమాంతరంగా 50%
- రొటేషన్ తప్పనిసరి.. అవసరమైతే లాటరీ
- ఆర్డీవో స్థాయిలో సర్పంచుల రిజర్వేషన్ల ఖరారు
- వార్డు సభ్యుల రిజర్వేషన్లు తేల్చేది ఎంపీడీవోలు
- పంచాయతీ పోరుకు ప్రధాన పార్టీలు సై



హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు జరగబోయే ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయింది.. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు రిజర్వేషన్లు ఎలా ఖరారు చేయాలన్న దానిపై విధివిధానాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో(నెంబరు 46) జారీచేసింది. దీనిపై ఇప్పటికే ఒక దఫా కసరత్తు చేసిన జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు తక్షణమే జీవోకు అనుగుణంగా చకచకా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పూర్తి చేసేశారు. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా పెండింగ్ ఉన్నవి రేపు పూర్తి చేస్తారు. ఎక్కడైనా రిజర్వేషన్ల ఖరారులో లాటరీ పద్ధతిని

మిగతా 12వ పేజీలో...

### జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణానికి విదేశీ అతిథులు

నేపాల్, భూటాన్, శ్రీలంక, మారిషస్, కెన్యా, మలేసియా నుంచి జడ్జిలు

రేపు రాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం 14

### భారత ఉన్నత విద్యా కమిషన్!

యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈల స్థానంలో..


రానున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు 14

### కుటుంబం ఆత్మహత్య

కుమార్తెతో కలిసి తల్లిదండ్రుల బలవన్మరణం 2

ఇటీవలే పెద్దకుమార్తె ఆత్మహత్య

హైదరాబాద్ అంబర్‌పేట్‌లో..




# 37 మంది నక్సల్స్ లొంగుబాటు

### వీరిలో 25 మంది మహిళలు

- ఆజాద్ సహా ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులూ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట సరెండర్
- ఆయుధాలతో లొంగిపోయిన ఖమ్మం కమిటీ
- సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో లొంగుబాట్లు
- అందరికీ కలిపి 1.41 కోట్ల రివార్డు అందజేత
- లొంగిపోయిన వారికి పునరావాసం, భద్రత
- మిగిలిన వారూ జనజీవన స్రవంతిలో కలవాలి
- మావోయిస్టులకు డీజీపీ పిలుపు
- నేడో, రేపో అగ్రనేతల లొంగుబాటు?


లొంగిపోయిన నక్సల్స్‌తో డీజీపీ శివధర్‌రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరుస లొంగుబాట్లు, ఎన్‌కౌంటర్లతో కకావికలమవుతున్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్, అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, దండకారణ్య స్పెషల్ జోనల్ రాష్ట్ర

మిగతా 10వ పేజీలో...

### రేవంత్‌ది ల్యాండ్ లూటింగ్ పాలసీ

ఆయన ఎనుముల కాదు.. అమ్మకాల రేవంత్‌రెడ్డి



- రూ.5 లక్షల కోట్ల భూములు.. రూ.5 వేల కోట్లకు అమ్మకమా?
- ఇది మీ అయ్య జాగీర్ కాదు.. బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు
- బీఆర్ఎస్ నేత హరీశ్ హెచ్చరిక 12

### దమ్ముంటే నిరూపించు చూద్దాం

మేము ఏ ప్రభుత్వ భూమినీ అమ్మకానికి పెట్టలేదు



- 9,292 ఎకరాల్లో ప్లాట్లు వేసింది 4,740 ఎకరాల్లోనే
- అవి పూర్తిగా ప్రైవేట్ భూములే
- మీ ఫ్రీహోల్డ్ జీవోల వెనుక ఉన్న లక్షల కోట్ల మతలబేంటి?: దుద్దిళ్ల

# సింథటిక్ డ్రగ్స్ మహా ప్రమాదం

- దాంతోనే ప్రపంచ ఉగ్రవాదానికి ఊపిరి 14
- రెండింటి ఆర్థిక మూలాలను దెబ్బతీయాలి
- అందుకు ప్రపంచదేశాలు కలిసి పని చేయాలి
- జీ20 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- యుద్ధాలు, అంతర్యుద్ధాలతో పేద దేశాలకు భారం
- ఉక్రెయిన్, పాలస్తీనా పరిష్కారానికి కృషి చేద్దాం
- పర్యావరణ లక్ష్యాలను సాధిద్దాం: జీ20 తీర్మానం


జీ20 సదస్సులో ఇటలీ ప్రధాని మెలోనీతో మోదీ

### రెండేళ్ల నుంచే ఉగ్ర కుట్ర 14

- అప్పటి నుంచే పేలుడు పదార్థాల కొనుగోలు
- చాలా నగరాల్లో పేలుళ్లకు ప్లాన్ చేశాం
- విచారణలో ఉగ్రవాది ముజమ్మిల్ వాంగ్మూలం



## కండక్టర్ లేకున్నా 'ఉచిత ప్రయాణం'

» స్కానర్‌పై ఆధార్ కార్డు పెడితే టికెట్ జారీ

» సిద్దిపేట జిల్లా కొండపాక విద్యార్థిని ఆవిష్కరణ



విద్యార్థిని కీర్తన, ఉపాధ్యాయుడు రామస్వామి

కొండపాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం మరింత పకడ్బందీగా అమలు చేసేందుకుగాను సిద్దిపేట జిల్లా విద్యార్థిని కీర్తన, ఉపాధ్యాయుడు రామస్వామి మార్గదర్శకత్వంలో వినూత్న పరికరాన్ని రూపొందించింది. ఆమె కొండపాక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చదువుతోంది. మూడు రోజుల క్రితం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో కీర్తన రూపొందించిన పరికరం అందరినీ ఆకట్టుకుంది. ఆమె ఈ ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

### ఏమిటా పరికరం.. ఎలా పనిచేస్తుంది?

బస్ కండక్టర్ లేకుండా కేవలం ఆధార్ కార్డుతో మహిళలు ఉచిత ప్రయాణించే ప్రత్యేక పరికరాన్ని కీర్తన రూపొందించింది. బస్సులో ప్రయాణించే మహిళలు తమ ఆధార్ కార్డును స్కానర్‌పై ఉంచితే, డిస్‌ప్లేలో బస్సు ప్రయాణించే మార్గంలోని స్టేజ్‌ల పేర్లు నంబర్లతో సహా కనిపిస్తాయి. ప్రయాణికురాలు తాను ప్రయాణించదల్చుకున్న నంబరును ఎంటర్ చేస్తే, ఉచిత టికెట్ తాలూకు ప్రింట్ టికెట్ రూపంలో బయటకు వస్తుంది. ఒకసారి టికెట్ తీసుకున్నాక మూడు గంటల వరకు అదే ఆధార్‌కార్డుపై మరో బస్సులో టికెట్ రాకుండా నిరోధించే వ్యవస్థ కూడా ఈ పరికరంలో ఉందని విద్యార్థిని కీర్తన చెబుతోంది. కండక్టర్ లేని వన్ మ్యాన్ సర్వీసు బస్సుల్లో డ్రైవర్లు ఇబ్బంది పడకుండా, టికెట్ల జారీలో జాప్యం నిరోధించేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.



అక్కన్నపేట మండలం ధర్మారం పంచాయతీ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న మహిళలు

## బెల్టు షాపులు బంద్ చేస్తారా.. పురుగుల మందు తాగమంటారా..?

» మావాళ్లు మద్యానికి బానిసలవుతున్నారు

» అధికారులపై ధర్మారం మహిళల ఆగ్రహం

» పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన

అక్కన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'సార్.. నా భర్త తప్ప తాగొచ్చి ఇష్టమొచ్చినట్లు కొడుతున్నాడు.. వెంటనే బెల్ట్ షాపులు మూయించి, మద్యపాన నిషేధం అమలు చేయండి.. లేకుంటే పురుగుల మందు తాగి చస్తాం'.. అంటూ మహిళలంతా ముక్తకంఠంతో అధికారులను హెచ్చరించారు. ఈ ఘటన శనివారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం ధర్మారం పంచాయతీ కార్యాలయం ఎదుట జరిగింది. గ్రామంలో రెండురోజుల క్రితం ఓ పార్టీ నాయకుడు మద్యం తాగి తన భార్యను దుర్భాషలాడుతూ కొట్టడంతో ఆమె గాయపడింది. దీంతో ఆగ్రహించిన మహిళలందరూ శనివారం బెల్ట్‌షాపులను మూసివేయించారు. మరోసారి వీటిని నిర్వహిస్తే మద్యంసీసాలను పగలకొడతామని హెచ్చరించారు. పంచాయతీ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. తమవాళ్లు కూలిచేసి సంపాదించినదంతా తాగుడుకు ఖర్చుచేస్తూ కుటుంబాలను అప్పులపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్‌షాపులను మూయించాలని డిమాండ్ చేశారు.

# కేటీఆర్ సొంత నిర్ణయం

## నిధుల చెల్లింపులో క్విడ్ ప్రోకో జరిగింది

» బీఆర్ఎస్ పార్టీకి రూ.44 కోట్లు.. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో అందాయి

» రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించారు

» అధికారాన్ని దుర్వినియోగం చేశారు

» గవర్నర్ బదులు అర్వింద్‌కుమార్ సంతకం

» ప్రజాధనాన్ని దారి మళ్లించారు

» నేరపూరిత కుట్రలో భాగస్వాములయ్యారు

» ఫార్ములా-ఈ రేసు కేసులో చార్జిషీట్ రెడీ!

» నివేదికలో సవివరంగా పేర్కొన్న ఏసీబీ

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో నిందితుల ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో.. వారి పాత్రకు సంబంధించిన నివేదికను ఏసీబీ రూపొందించింది. ఇందులో పలు అంశాలను సవివరంగా పేర్కొంది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఏసీబీ చార్జీషీట్‌లో.. హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ కారు రేస్ నిర్వహించాలనేది కేటీఆర్ తీసుకున్న సొంత నిర్ణయమని, ప్రభుత్వ అనుమతి లేకుండానే ప్రైవేట్ సంభాషణలతో రేస్ నిర్వహించారని పేర్కొంది. ఇందులో క్విడ్ ప్రోకో జరిగిందని, బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.44 కోట్లు అందాయని తెలిపింది. ఫార్ములా-ఈ కారు రేసు కంపెనీ, ఏస్ నెక్ట్స్‌జెన్, హెచ్ఎండీఏకు మధ్య జరిగిన త్రిపక్ష ఒప్పందానికి ముందే ఎలక్టోరల్ బాండ్లను 2022 ఏప్రిల్, అక్టోబరు నెలల్లో చెల్లించారని తెలిపింది. బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చినందుకే ఏస్ నెక్ట్స్‌జెన్‌కు ప్రమోటర్‌గా అవకాశం కల్పించారని ఏసీబీ పేర్కొంది. ఈ విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 166(1), 299 నిబంధనల ఉల్లంఘన జరిగిందని, గవర్నర్ సంతకంతో చేయాల్సిన కాంట్రాక్టులను కాంపిటెంట్ అథారిటీ అనుమతి లేకుండా ఐఏఎస్ అర్వింద్‌కుమార్ చేశారని వివరించింది. రెండు అగ్రిమెంట్లు గవర్నర్ నోటీసులో లేవని, పురపాలక శాఖ అనుమతులు పొందలేదని స్పష్టం చేసింది. హెచ్ఎండీఏ ప్రమోటర్‌గా ఉండేందుకుగాను నిధులు ఉపయోగించారని, కానీ.. దీనిపై రాష్ట్ర ఆర్థిక శాఖకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని నివేదికలో ఏసీబీ పేర్కొంది. బిజినెస్ రూల్స్ ప్రకారం అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ మంత్రి, నాటి ముఖ్యమంత్రికి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలిపింది. రూ.10 కోట్ల కంటే ఎక్కువ నిధులు చెల్లించాల్సి వస్తే తప్పనిసరిగా ఆర్థికశాఖ అనుమతి తీసుకోవాలని గుర్తు చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడే నేరానికి పాల్పడ్డారని పేర్కొంది. త్రిపక్ష ఒప్పందంలో లేకపోయినా సీజన్-9 నిర్వహణకు సంబంధించి రూ.20 కోట్లు ఖర్చు పెట్టారని, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి కలిసి ఎఫ్ఈవోకు రూ.46 కోట్లు చెల్లించారని, ఆర్బీఐ నిబంధనల ఉల్లంఘన కింద మరో రూ.8 కోట్లు అదనంగా చెల్లించారని వివరించింది. 2023 అక్టోబరు 30న చేసుకున్న రెండో ఒప్పందం ప్రకారం సీజన్ 10, 11, 12లను నిర్వహిస్తే ప్రభుత్వంపై రూ.600 కోట్ల భారం పడుతుందని అంచనా వేసింది. హెచ్ఎండీఏ ఇందులోకి రాకుండా ఉంటే బాధ్యత అంతా ఏస్ నెక్ట్స్‌జెన్ మీదే ఉండేదని, పథకం ప్రకారమే నేరానికి పాల్పడ్డారని ఏసీబీ స్పష్టం చేసింది. నీల్సన్ నివేదిక అంటూ కేటీఆర్ రాష్ట్రానికి రూ.700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారని, కానీ.. వాటి వివరాలు కోరితే ఆ కంపెనీ ఇవ్వలేదని తెలిపింది.

### నిందితుల పాత్ర ఇలా..

- అనాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ సొంత నిర్ణయాలు తీసుకున్నారు. అక్రమ పద్ధతిలో అనుమతులు మంజూరు చేశారు. అధికారాన్ని సొంత లాభం కోసం, రాజకీయ లబ్ధి కోసం వాడుకున్నారు.
- ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్.. హెచ్ఎండీఏ మునిసిపల్ కమిషనర్‌తోపాటు, పురపాలక శాఖ చీఫ్ సెక్రటరీగా ఉంటూ రెండు చోట్ల అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. శాఖాపరమైన విచారణ జరగకుండా అంతా తానై నడిపించి అక్రమాలకు పాల్పడ్డారు.
- బీఎల్ఎన్ రెడ్డి.. తప్పు అని తెలిసినా బిల్లులను హెచ్ఎండీఏ నుంచి మంజూరు చేయించారు. కింది స్థాయి సిబ్బందిని బలవంతంగా ఒప్పించారు.
- మల్లేశ్వరరావు.. ఫార్ములా-ఈ కారు రేసు డీల్ ప్రారంభమైనప్పటి నుంచి ఎలక్టోరల్ బాండ్ల చెల్లింపుల వరకు అన్నింట్లో ఫెసిలిటేటర్ ఆర్కిటెక్ట్‌గా అక్రమాలకు పాల్పడ్డారు.
- ఎఫ్ఈవో సీఈవో.. చేసుకున్న ఒప్పందం ప్రకారం వ్యవహరించకుండా అగ్రిమెంట్‌తో సంబంధం లేని హెచ్ఎండీఏ నుంచి నిధులు పొందారు. మరో ఒప్పందాన్ని అక్రమంగా రద్దు చేశారు. అక్రమ పద్ధతిలో పొందిన డబ్బును తిరిగి ఇవ్వడానికి నిరాకరించారు.

నిందితుల్లో కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(ఏ)(1) రెడ్‌విత్ 13(2) కింద నేరానికి పాల్పడ్డారు. ప్రభుత్వ అధికారులుగా, ప్రజా ప్రతినిధిగా ఉంటూ హెచ్ఎండీఏకు నష్టం కలిగించి.. ఎఫ్ఈవో సీఈవోకు భారీ లాభం చేకూర్చారు. ఐపీసీ 409 సెక్షన్ ప్రకారం అధికార దుర్వినియోగానికి పాల్పడి.. ప్రజాధనాన్ని దారి మళ్లించారు. ఐపీసీ 120 ప్రకారం వీరంతా నేరపూరిత కుట్రలో భాగస్వామ్యులయ్యారు.

# స్కాంగ్రెస్ ఏటీఎంగా తెలంగాణ

» అప్పులపై కాంగ్రెస్ కాకిలెక్కలు :కేటీఆర్


హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు పదేపదే చెబుతున్న కాకి లెక్కల డొల్లతనం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అక్టోబరు నెల నివేదికతో బట్టబయలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గతంలో తమ బీఆర్ఎస్ సర్కారు అప్పులతో ఆస్తులు సృష్టిస్తే.. కాంగ్రెస్ సర్కారు అప్పుల సునామీతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నడిపిస్తోందని పేర్కొన్నారు. పార్లమెంటు వెల్లడించిన లెక్కల ప్రకారం పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు రూ.2.80 లక్షల కోట్లు అప్పులతో కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి ఉత్పాదక ఆస్తులు సృష్టించిందన్నారు. కానీ, ఒక్క ప్రాజెక్టు నిర్మించకుండా, మౌలిక వసతులకు ఒక ఇటుక పేర్చకుండానే 23 నెలల్లోనే కాంగ్రెస్ సర్కారు తెచ్చిన రూ.2.30 లక్షల కోట్ల అప్పులేం చేశారని ప్రశ్నించారు. అప్పులపై వడ్డీ చెల్లింపులపై తప్పుడు లెక్కలు చెప్పినందుకు సీఎం రేవంత్.. ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి మూటలు మోయడానికే వీటిని ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని 'స్కాంగ్రెస్ ఏటీఎం'గా మార్చారని మండిపడ్డారు. 'ప్రతి నెలా రూ.6000-7000 కోట్లను అప్పులపై వడ్డీల చెల్లింపునకు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ పదే పదే చెబుతున్నారు. కాగ్ నివేదిక ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్-అక్టోబరు మధ్య అప్పులపై 16,529.88 కోట్లు వడ్డీ చెల్లించిందన్న కేటీఆర్.. నెలకు సగటున రూ.2,361.41 కోట్లు మాత్రమే వడ్డీ చెల్లింపులకు వినియోగిస్తున్నారని అర్థమవుతోందన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా 7 నెలల్లో తెచ్చిన అప్పుల వివరాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు.

### ఒకే వేదికపై జగన్, కేటీఆర్!

బెంగళూరు/అమరావతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బెంగళూరులో భేటీ అయ్యారు. ఒక క్రీడా కార్యక్రమంలో ఇద్దరూ వేదిక పంచుకున్నారు. శనివారం బెంగళూరులో జరిగిన 'సర్ట్ ఈక్వెస్ట్రియల్ లీగ్' (అశ్వక్రీడ) ఫైనల్ పోటీలకు వీరిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుమారు గంటపాటు సాగిన ఫైనల్స్‌ను ఆసక్తిగా తిలకించారు. విజేతగా నిలిచిన మ్యాగ్నిలెటో బృందానికి జగన్, కేటీఆర్ కలిసి ట్రోఫీ అందించారు. ఈ సందర్భంగా వారు తాజా రాజకీయ పరిణామాలపైనా చర్చించుకున్నట్లు తెలుస్తోంది.



బెంగళూరులో జరిగిన అశ్వక్రీడా పోటీలను తిలకిస్తున్న జగన్, కేటీఆర్




## కుటుంబం ఆత్మహత్య

» కుమార్తెతో కలిసి తల్లిదండ్రుల బలవన్మరణం

» ఆరునెలల క్రితం ఆత్మహత్య చేసుకున్న ఆ దంపతుల పెద్ద కుమార్తె



శ్రీనివాస్, విజయలక్ష్మి, శ్రావ్య (ఫైల్)

అంబర్‌పేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల క్రితం ఆ ఇంటి ఆడపిల్ల బలవన్మరణానికి పాల్పడింది. ఆమె మరణంతో మనస్తాపం చెందారో ? ఆర్థిక ఇబ్బందుల వల్లనో స్పష్టత లేదు కానీ.. ఆ కుటుంబంలో మిగిలిన ముగ్గురు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరు బిడ్డల్లో తమకు మిగిలిన ఒక్క కుమార్తెతో కలిసి భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసిన ఘటనలో.. శ్రీనివాస్(45), ఆయన భార్య విజయలక్ష్మి(42), వారి కుమార్తె శ్రావ్య(16) బలవన్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన శ్రీనివాస్, విజయలక్ష్మి దంపతులకు కావ్య, శ్రావ్య అనే కుమార్తెలు ఉన్నారు. దంపతులిద్దరూ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తుంటారు. వీరి పెద్ద కుమార్తె కావ్య ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. శ్రీనివాస్ కుటుంబం నెల రోజుల క్రితం అంబర్‌పేట్‌లోని రామకృష్ణానగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు చేరింది. శ్రావ్య ఇంటర్ విద్యార్థిని, కాగా, శ్రీనివాస్ నివాసముంటున్న ఇంటి నుంచి శనివారం దుర్వాసన వెలువడుతుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ఇంటి తలుపులు తెరిచి చూడగా శ్రీనివాస్, విజయలక్ష్మి, శ్రావ్య.. ఉరి వేసుకొని ప్రాణాలు కోల్పోయి కనిపించారు. పెద్ద కుమార్తె ఆత్మహత్యతో మానసిక ఆందోళనకు గురైన దంపతులు, ఆర్థిక ఇబ్బందుల్లో కూడా ఉన్నట్టు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ప్రసాదాన్ని అడుక్కుంటున్నాం.. రిచెస్ట్ బిచ్చగాళ్లం

» తిరుమలలో యాంకర్ శివజ్యోతి వ్యాఖ్యలు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ప్రసాదంపై యాంకర్ శివజ్యోతి చేసిన వ్యాఖ్యల పట్ల భక్తులు భగ్గుమంటున్నారు. ఇటీవల శ్రీవారి దర్శనానికి వచ్చిన ఆమె తన భర్త, స్నేహితుడితో కలిసిచేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్యూలైన్‌లో వెళ్తున్న సమయంలో టీటీడీ అందజేస్తున్న ప్రసాదాలపై..' ప్రసాదాన్ని అడుక్కుంటున్నామని, ఇలా ఎప్పుడూ అడుక్కోలేదని, ది రిచెస్ట్ బిచ్చగాళ్లమని' ఆమె నవ్వుతూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. పవిత్రమైన తిరుమల ప్రసాదం స్వీకరించడం అడుక్కోవడమా అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పొరపాటున ఆ మాటలొచ్చాయి.. సారీ: శివజ్యోతి

తిరుమలలో అన్నప్రసాదాలపై తాను చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన క్రమంలో శివజ్యోతి శనివారం రాత్రి స్పందిస్తూ ఓ వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. 'నా మాటలు తప్పుగా ఉన్నాయి కానీ, నా ఉద్దేశం అది కాదు. రూ.10వేల టికెట్ కోసం కాస్ట్లీ లైన్‌లో నిలబడ్డామనే ఉద్దేశంతో అన్నాను. నా తరపున, నా తమ్ముడు సోను తరపున సారీ చెబుతున్నా. నా జీవితాన్ని మార్చిన స్వామి గురించి తప్పుగా మాట్లాడను. ఆయన దయ లేకుంటే నా జీవితంలో ఏదీ జరిగేది కాదు. నా కడుపులోని బిడ్డ కూడా స్వామి ప్రసాదించిందే. తెలిసో తెలియకో పొరపాటున నా నుంచి, నా తమ్ముడు నోటి నుంచి ఆ మాటలు వచ్చాయి. భక్తులకు, టీటీడీ బోర్డు సభ్యులందరికీ సారీ చెబుతున్నా. మరోసారి ఇలా జరగదు' అంటూ వీడియో ద్వారా వివరణ ఇస్తూ క్షమాపణలు కోరారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

## దక్షిణ తెలంగాణలో వర్షాలు

హైదరాబాద్/ఆదిలాబాద్/ఆసిఫాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, రాగల 48 గంటల్లో అది మరింత బలపడి ఈనెల 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ తదుపరి 48 గంటల్లో అది పశ్చిమ వాయువ్య దిశలో కదిలి నైరుతి బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు రాగల 2, 3 రోజుల్లో రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో కొనసాగుతాయని, రాత్రి పూట ఉష్ణోగ్రతలు 17-19 డిగ్రీల మధ్య నమోదు అవుతాయని పేర్కొంది. శుక్రవారం రాత్రి కుమరంభీం జిల్లా లింగాపూర్ మండలంలో అత్యల్పంగా 10.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపింది.

### తగ్గుముఖం పడుతున్న చలి తీవ్రత

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చలితీవ్రత కొంత తగ్గుముఖం పడుతోంది. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో కొనసాగుతున్నాయి. కుమరంభీం జిల్లా సిర్పూర్(యు)లో 10.7, తిర్యాణిలో 12.7, కెరమెరిలో 12.9 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి)లో 12.1, బజార్‌హత్నూర్‌లో 12.4, సాత్నాలలో 12.9, తాంసిలో 13.0, ఇచ్చోడలో 13.4, సోనాలలో 13.7, తలమడుగులో 14.0, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 14.0, గంభీరావుపేటలో 15.0, చందుర్తిలో 15.7, వేములవాడ రూరల్‌లో 15.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటిపూట పెద్దగా చలిప్రభావం లేకపోయినప్పటికీ రాత్రిళ్లు, ఉదయం మాత్రం శీతలగాలులతో చలితీవ్రత కనిపిస్తుంది. జిల్లాల్లో ఉదయం పూట దట్టమైన పొగమంచు కప్పేస్తోంది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలు చలిమంట వేసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు.


ఉదయం పూట ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కమ్ముకున్న దట్టమైన పొగమంచు

# ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు అడిగితే రోకలితో కొట్టండి: ఎమ్మెల్యే సంజయ్



మెట్‌పల్లి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని మాయ మాటలు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే వారిని రోకలిబండతో కొట్టాలని కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లబ్ధిదారులకు సూచించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని 63 మంది లబ్ధిదారులకు శనివారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే వారి కోసం తాను జైలుకు పోతానని తెలిపారు. ఇళ్లులేని పేదల వద్ద డబ్బులు వసూలు చేయడం సిగ్గుచేటని, ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా తనకు ఫోన్ చేయాలని సూచించారు.



# జగన్ హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూలు

» సిట్ దర్యాప్తులో గుర్తింపు

తిరుమల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కల్తీ నెయ్యితో చేసిన కోట్లాది లడ్డూలను వైసీపీ హయాంలో భక్తులకు విక్రయించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిం ది. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో తిరుమలలో భక్తులు కొనుగోలు చేసిన లడ్డూల్లో 20.1 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితోనే తయారైనట్టు సిట్ గుర్తించింది. వైసీపీ హయాంలో కల్తీ నెయ్యితో తయా రు చేసిన 41 శాతం లడ్డూలు భక్తులకు అందాయని అంచనా వేసింది.

# వరికొయ్యలకు పెట్టిన నిప్పు అంటుకుని రైతు సజీవదహనం


నర్సింహులు (ఫైల్)

పాపన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరికొయ్యలకు పెట్టిన నిప్పు ప్రమాదవశాత్తు అంటుకుని ఓ రైతు సజీవదహనం అయ్యాడు. ఈ ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని పొడిచినపల్లి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు బగుడం నర్సింహులు ఇటీవల ఖరీఫ్ పంటను కోశాడు. తిరిగి యాసంగి పంట వేసేందుకు భార్య సులోచనతో కలిసి పొలంలోని వరికొయ్యలను కాల్చి వేసేందుకు వెళ్లాడు. భార్య సులోచన ఒకపక్క, నర్సింహులు మరోపక్క ఇతరుల పొలాల్లోకి మంటలు వెళ్లకుండా చూస్తున్న క్రమంలో మంటలు పక్క పొలంలోకి వ్యాపించడంతో వాటిని ఆర్పేందుకు నర్సింహులు ప్రయత్నించాడు. మొదటి నుంచి కాలు సరిగా పనిచేయని నర్సింహులు ప్రమాదవశాత్తు పొలంలో పడిపోగా, మంటలు అంటుకోని అక్కడే సజీవదహనం అయ్యాడు. కొంత దూరంలో ఉన్న భార్య కొద్దిసేపటి తర్వాత భర్త కనిపించపోవడంతో వెతకగా, కాలిపోతున్న భర్తను చూసి బోరుమంది. పరుగున వెళ్లి గ్రామస్థులకు విషయం చెప్పినా.. వారు వచ్చేసరికే నర్సింహులు చనిపోయాడు. సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

# దేశంలో 2 కోట్లకు పైగా ఆటిజం బాధితులు!

## ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరికి ఇదే సమస్య.. బాధితుల్లో అబ్బాయిలు ఎక్కువ

» ఆటిజంపై 'లిమిట్ లెస్' అవగాహన సదస్సు

» త్వరలో.. పిల్లల మూడ్‌ను గుర్తించేందుకు ఏఐ యాప్


సదస్సులో వక్తలతో 'బిల్డింగ్ బ్యాలెన్స్ అడ్వైజరీ' వ్యవస్థాపకురాలు అర్నాజ్ సప్నా అష్రఫ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆటిజం కేసులు క్రమేణా పెరుగుతున్నాయని, నివేదికల ప్రకారం.. ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్డీ) ఉన్నట్టు వెల్లడవుతోందని 'బిల్డింగ్ బ్యాలెన్స్ అడ్వైజరీ' వ్యవస్థాపకురాలు అర్నాజ్ సప్నా అష్రఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో.. ప్రజల్లో ఆటిజంపై అవగాహన పెరగాల్సిన అవసరముందని ఆమె పేర్కొన్నారు. ఆటిజంపై అవగాహన కల్పించేందుకు.. బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం 'లిమిట్ లెస్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ఆటిజం బాధితులు రెండు కోట్లపైగానే ఉన్నారని.. వారిలో బాలికలతో పోలిస్తే బాలురు మూడు రెట్లు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. వారి కోసం ప్రభుత్వం, మార్గదర్శకాలు తీసుకురావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఆటిజంతో బాధపడే చిన్నారులకు.. బిహేవియర్ థెరపీ, శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో మార్పు తీసుకురావచ్చని ఆమె తెలిపారు. ఆటిజంపై అవగాహన లేకపోవడం, నిర్ధారణ పరీక్షలు అందుబాటులో లేకపోవడం కారణంగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య బారినపడిన వారిని గుర్తించే అవకాశం లేకుండా పోయిందన్నారు. వీరికి చేసే చికిత్సలు, కౌన్సెలింగ్‌కు అయ్యే ఖర్చులను బీమా పరిధిలోకి తేవాలని.. ప్యానెల్ డిస్కషన్‌లో పాల్గొన్న డాక్టర్ పూజా ఝానాయర్, డాక్టర్ సౌమ్యకంఠసాహు ఆరోగ్య బీమా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. 'సితారే జమీన్ పర్' సినిమాలో నటించిన నమన్ మిశ్రా తల్లి మనీషా మిశ్రా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆటిజం సమస్య ఉన్న పిల్లలకు ఏ విషయాన్ని అయినా ఓపికగా చెప్పాల్సిన అవసరముందని ఆమె పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఆటిజం పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు అందుబాటులో ఉన్నాయి కానీ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పాఠశాలలు లేవని ఆవేదన వెలిబుచ్చారు. ఆటిజం బారినపడ్డ పిల్లల తల్లిదండ్రులు, సైకాలజిస్టులు, పలు పాఠశాలల నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఆటిజం చిన్నారులకు ప్రత్యేక కరికులం



ఆటిజం అనేది వ్యాధి కాదు, దీనిని మందులతో నివారించలేము. ఆటిజం బారినపడ్డ పిల్లలకు సాధారణ పిల్లలతో పోల్చితే జ్ఞాపక శక్తి, చురుకుదనం తక్కువగా ఉంటుంది. వీరు సాటి పిల్లలతో చదువులో పోటీ పడలేరు. కాబట్టి ప్రతి స్కూల్‌లో విద్యార్థులకు ఆటిజం గురించి అవగాహన కల్పించాలి. మేం ఆటిజం పిల్లల కోసం ప్రత్యేక కరికులం రూపొందించాం. ఇది సాధారణ విద్యార్థులకూ ఉపయోగపడుతుంది.

\- శంకర్ ఫౌండేషన్ ఫౌండర్ సెక్రటరీ శ్రీదేవి ప్రసాద్

### త్వరలో పిల్లల మూడ్‌ను గుర్తించే ఏఐ యాప్



నా కుమారుడు ఆటిజంతో బాధపడుతున్నాడు. అతి కోపం, జుట్టుపట్టుకొని లాగడం, తనను తాను గాయపరుచుకోవడం వంటి లక్షణాలు ఉండేవి. తలుపు తెరిస్తే చాలు బయటకు పారిపోయేవాడు. అతడి సమస్యను మేం గుర్తించేందుకు ఐదేళ్లు పట్టింది. కౌన్సెలింగ్ సెషన్‌లకు తీసుకువెళుతున్న సమయంలో... ఏ సమయంలో కోపం వస్తోంది, ఏ సమయంలో దాడి చేస్తున్నాడు. ఏ విధంగా ప్రవర్తిస్తున్నాడనే ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేక పోయేదాన్ని. ఐటీ ఉద్యోగినిగా 15 ఏళ్ల అనుభవం ఉన్న నేను ఇతర మిత్రులతో కలిసి ఈ సమస్యను పరిష్కరించేందుకు ఏథాన్ ఏఐ పేరుతో యాప్‌ను అభివృద్ధి చేస్తున్నా. త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాము. - శిల్ప పక్కి



# 3డీ ఇంప్లాంట్ దవడ కీలు మార్పిడి

» హైదరాబాద్ మెడికవర్‌లో సూడాన్ యువకుడికి శస్త్ర చికిత్స

» నాలుగేళ్లుగా నోరు తెరవలేక అవస్థ పడుతున్న రోగికి విముక్తి


శస్త్రచికిత్సకు ముందు, తర్వాత రోగి పరిస్థితి

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా నోరు తెరవలేక, ఆహారం తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సూడాన్‌కు చెందిన యువకుడికి హైదరాబాద్‌లోని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఉపశమనం కల్పించారు. కస్టమ్-మేడ్ 3డీ ఇంప్లాంట్‌తో అతని దవడ పని తీరును పునరుద్ధరించారు. సూడాన్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్ అలీ(23) నాలుగేళ్లక్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దవడకు తీవ్ర గాయమై.. దవడ ఎముక, తల ఎముకతో అతుక్కుపోయింది. ఫలితంగా దవడ కీలు చలనం పూర్తిగా ఆగిపోయింది. దీంతో అలీ నోరు తెరవలేక, మాట్లాడలేక, ఆహారం తీసుకోలేక ఇబ్బంది పడ్డాడు. ఈ నేపథ్యంలో అలీని పరీక్షించిన హైటెక్ సిటీలోని మెడికవర్ ఆస్ప త్రి డెంటిస్ట్రీ, మెక్సిలోఫేషియల్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ శరత్‌బాబు వైద్య బృందం.. రోగికి సరిపోయేలా ప్రత్యేకంగా డిజైన్ చేసిన (కస్టమ్-మేడ్) 3డీ ప్రింటెడ్ దవడ కీలును మార్పిడి చేశారు. క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో రోగి కోలుకున్నాడని, నోరు తెరవగలుగుతున్నాడని తెలిపారు.

# 45 మంది హైదరాబాదీలకు.. మదీనలో అంత్యక్రియలు పూర్తి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): సౌదీ అరేబియాలో తీర్థ యాత్రకు వచ్చి ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన 45 మంది హైదరాబాదీలతో పాటు మరొకరికి మదీనలో సామూహిక అంత్యక్రియలు నిర్వహించారు. మృతుల గుర్తింపునకు రెండు విడుతల్లో డీఎన్ఏ ఫలితాలు అందిన అనంతరం పోలీసులు శనివారం మృతదేహాలను అప్పగించారు. దీంతో మధ్యాహ్నం జన్నతుల్ బఖీ శ్మశాన వాటికలో మృతదేహాలను ఖననం చేశారు. 45 మంది హైదరాబాద్ నుండి సౌదీకి రాగా, మరొకరు దుబాయ్ నుండి వచ్చి ప్రమాదంలో చనిపోయారు. హైదరాబాద్ యాత్రికులతో మక్కా నుంచి మదీన వెళ్తున్న బస్సు ఈ నెల 16న అర్ధరాత్రి డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో బస్సుకు మంటలంటుకున్నాయి. కాగా, కేంద్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం నేత, ఏపీ గవర్నర్ షేక్ అబ్దుల్ నజీర్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్, భారత రాయబారి డాక్టర్ సుహేల్, భారత కాన్సుల్ జనరల్ ఫహాద్, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ ఖాన్‌లు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



# కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

## యూజీసీ పేస్కేల్ అమలు చేయాలి.. సర్కారుపై వీసీలు ఒత్తిడి తేవాలి

» త్వరలో సీఎంకు విన్నవిస్తాం

» రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ జీ హరగోపాల్

» కాంట్రాక్టు అధ్యాపకులపై సర్కారు సానుకూలం: పీఎల్


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్

బర్కత్‌పుర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసులను క్రమబద్ధీకరించి యూజీసీ పేస్కేల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రొఫెసర్ జి.హరగోపాల్ విజ్ఞప్తి చేశారు. వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్ని విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లను కోరారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవిస్తామని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చెప్పారు. విద్యా రంగాన్ని గత బీఆర్ఎస్ సర్కారు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే.. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొంత ప్రాముఖ్యతనిస్తోందన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాత యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ విషయమై ఉన్నత విద్యాశాఖకు తమ కమిషన్ నివేదిక కూడా సమర్పించిందని చెప్పారు. కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ ఎ.పరుశు రాం మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 12 నెలల జీతం చెల్లించాలని, మహిళా అధ్యాపకులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్, జేఏసీ నాయకులు డాక్టర్ పాండయ్య, రాందాస్ నాయక్, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కవితాషిండే, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ఓ.కృష్ణయ్య, డాక్టర్ సురేశ్, డాక్టర్ ఖాజామోహీనుద్దీన్, డాక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# విషాదం మిగిల్చిన విహార యాత్ర

» రావిర్యాల వండర్‌లాలో ఈత కొడుతూ విద్యార్థి అస్వస్థత

» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


శివకుమార్ (ఫైల్)

ఆదిభట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా రావిర్యాలలోని వండర్‌లాకు విహార యాత్రకు వచ్చిన విద్యార్థులకు విషాదం మిగిలింది. ఈ ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని అమీర్‌పేటలోని సిస్టర్ నివేదిత స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులు శుక్రవారం విహార యాత్రకోసం వండర్‌లాకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు భోజనం చేశాక స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న విద్యార్థుల్లో వేళంగి శివకుమార్ (13) తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పాఠశాల యాజమాన్యం వెంటనే ఎల్బీనగర్‌లోని గ్లీన్ గిల్స్ అవేర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శివ కుమార్ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిభట్ల సీఐ రవి కుమార్ తెలిపారు.

# టీశాక్ కలెక్షన్ కింగ్‌పై విచారణ

## వైద్యారోగ్య శాఖలో 'ఆంధ్రజ్యోతి' కథనం కలకలం

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రోగులకు సేవలందించే ఎన్‌జీవోల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు లు వసూలు చేసిన తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(టీశాక్) కలెక్షన్ కింగ్‌పై సర్కారు ఆరా తీసింది. 'టీశాక్‌లో కలెక్షన్ కింగ్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనం వైద్య ఆరోగ్య శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ కథనంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కూడా ఆరా తీశారు. తదుపరి చర్యలపై ఉన్నతాధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు విచారణకు ఆదేశించినట్లు సమాచారం. నేడో, రేపో విచారణాధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది. మరోవైపు కలెక్షన్ కింగ్ కథనంపై టీశాక్ ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు. నిధులు దుర్వినియోగం కాలేదని, అంతర్గత సర్దుబాటులో భాగంగానే బదిలీలు చేశామని వెల్లడించారు. కాగా, 'ఆంధ్రజ్యోతి' కథనంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని ఎన్‌జీవోలు, టీశాక్ కార్యాలయ వర్గాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం వంద శాతం నిజమని, ఇప్పటికే రూ.3 కోట్ల నుంచి 3.5 కోట్ల దాకా ఎన్‌జీవోల నుంచి వసూళ్లు చేశారని ఆ వర్గాలు వెల్లడించాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

# ఇది 'జ్యూడీషియల్ యారగన్సీ' కాదా?

**కేసుల పరిష్కారంలో ఏళ్లూ పూళ్లూ పట్టడం వల్ల నిందితులు అధికారంలోకి కూడా వస్తున్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు తీసుకొనే చర్యలకు ఎవరు బాధ్యత వహిస్తారు? బహుశా ఈ కారణంగానే కాబోలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన కొందరు ఆర్థిక నేరాలు, క్రిమినల్ నేరాలతో సంబంధం ఉన్న ప్రజాప్రతినిధులపై కేసుల విచారణను ఏడాదిలోగా పూర్తి చేయాలని తీర్పు ఇచ్చారు. ప్రజాప్రతినిధులపై ఉన్న కేసుల విచారణకు గడువు ఉండాలనే కదా ఇటువంటి ఉత్తర్వులు ఇచ్చింది! అయితే, దురదృష్టవశాత్తు ఈ ఆదేశాలు ఏవీ అమలుకావడం లేదు. చట్టంలోని లొసుగులే అందుకు కారణమైతే వాటిని సవరించాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించలేదా? కాలానుగుణంగా ఎన్నో చట్టాలను సవరించుకున్నాం. కొత్త చట్టాలను చేసుకుంటున్నాం. ప్రజాప్రతినిధులపై విచారణ త్వరతగతిన పూర్తి కావాలన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన వారి ఆదేశాలకే దిక్కు లేకపోతే ఎలా? ఈ కారణంగా న్యాయ వ్యవస్థ విశ్వసనీయత దెబ్బతినదా?**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపించే బిల్లులను ఆమోదించడానికి గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు ఉండాలా? వద్దా? అన్న విషయంలో గత కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తాజా తీర్పుతో తాత్కాలికంగా తెరపడింది. గవర్నర్లు, రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించజాలదని చెబుతూనే... బిల్లుల ఆమోదంలో అసాధారణ జాప్యం జరిగినప్పుడు పరిమిత స్థాయిలో న్యాయస్థానం జోక్యం చేసుకోవచ్చునని తాజా తీర్పులో పేర్కొన్నారు. దీంతో కర్ర విరగలేదు– పాము చావలేదు అన్నట్టుగా వ్యవహారం తయారైంది. బిల్లుల ఆమోదంలో కొంత మంది గవర్నర్లు రాజ్యాంగ స్ఫూర్తితో వ్యవహరించడం లేదన్న కారణంగా ఈ అంశంపై చాలాకాలంగా వివాదం నెలకొంది. రాష్ట్రాలలో స్వపక్షం అధికారంలో ఉన్నప్పుడు ఒకలా – ప్రతిపక్షం అధికారంలో ఉన్నప్పుడు మరోలా గవర్నర్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శ ఎప్పటి నుంచో ఉంది. గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగమవుతోందని, ఆ వ్యవస్థను రద్దు చేయాలని కూడా ప్రతిపక్షాలు చాలా సందర్భాలలో డిమాండ్‌ను లేవనెత్తాయి. ఈ నేపథ్యంలోనే తమిళనాడు ప్రభుత్వం ఆ రాష్ట్ర గవర్నర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దానిపై గవర్నర్లతోపాటు రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దీనిపై అభ్యంతరం తెలుపుతూ రాష్ట్రపతి కార్యాలయం 14 ప్రశ్నలను సుప్రీంకోర్టుకు సంధించింది. కేంద్రం కూడా గొంతు కలిపింది. ఫలితమే రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తాజా తీర్పు! మన న్యాయ వ్యవస్థ కొన్ని సందర్భాలలో పరిణతి ప్రదర్శిస్తుండగా, మరి కొన్ని సందర్భాలలో దూకుడుగా వ్యవహరిస్తోంది. కొన్ని కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేస్తున్న వ్యాఖ్యలు 'జ్యూడీషియల్ యారగన్సీ'ని తలపిస్తున్నాయి. తాజా తీర్పుతో గవర్నర్లు–రాష్ట్రాలకు మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉంటాయి.

## అంతులేని కథలేనా...?

ఏ విషయంలోనైనా 'గడువు' అనేది ఉండాలన్నది జనాభిప్రాయం. మనం రోగాలకు వాడే మందులకు కూడా గడువు ఉంటుంది కదా! కాలమాన పరిస్థితులను బట్టి ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయి. అలాంటప్పుడు వాటిని నిరవధికంగా పెండింగ్‌లో పెడితే ప్రజలకు ప్రయోజనం ఉండదు కదా! సరైన సమయంలో సరైన మందు వాడినప్పుడే రోగం నయమవుతుంది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్లకు–రాష్ట్రపతికి గడువు విధించే అధికారం న్యాయ వ్యవస్థకు లేకపోవచ్చు. అలాగని ఎవరికి వారు చేతులు ముడుచుకొని ఉండిపోతే ప్రజా ప్రయోజనాలు ఏంకావాలి? రాజ్యాంగ వ్యవస్థలలో భాగమైన రాష్ట్రపతికి గడువు విధించే అధికారం న్యాయ వ్యవస్థకు లేని పక్షంలో... అదే రాజ్యాంగంలో మరో భాగమైన లెజిస్లేచర్ విషయంలో మరోరకంగా ఉత్తర్వు ఎలా ఇవ్వగలరు? తమకు అధికారం లేదని చెప్పడం వరకు ఆక్షేపణ ఉండదు కానీ, అదే సమయంలో ప్రస్తుత సమస్యను అధిగమించడానికి పార్లమెంటులో చట్టం చేయాలని లేదా రాజ్యాంగ సవరణ చేయాలని సుప్రీంకోర్టు సూచించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. దీనివల్ల బాధిత పక్షానికి ఎంతో కొంత ఉపశమనం లభించి ఉండేది. 'గడువు' అనేది ఒక అనివార్యంగా ఉండాలా? లేదా? అన్నది ఎప్పుడు తేలాలి? వాహనాల వినియోగానికి కూడా గడువు విధిస్తున్నాము కదా! కాలం చెల్లిన ఎన్నో చట్టాలను ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం రద్దు చేసింది కదా! అదే విధంగా గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు విధిస్తూ చట్టం చేయవచ్చు కదా! ఈ విషయంలో సుప్రీంకోర్టు మౌనంగా ఉన్నందునే రాజకీయ పార్టీలు సహజంగానే ఆ అంశం జోలికి వెళ్లవు. ఇదే సుప్రీంకోర్టు కొద్ది రోజుల క్రితం పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు గడువు ఎలా విధించింది? స్పీకర్లు రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన వ్యవస్థలకు అధిపతులే కదా? గవర్నర్లు, ఆ మాటకొస్తే న్యాయమూర్తులకు జీతభత్యాలు చెల్లించాలన్నా అవే చట్టసభలు ఆమోదించాలి కదా! తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు గడువు విధించడంతో అయిపోలేదు. ఈ అంశంపై విచారణకు వచ్చిన కోర్టు ధిక్కరణ పిటిషన్ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు జ్యూడీషియల్ యారగన్సీని గుర్తుకు తెస్తున్నాయి. 'మా ఆదేశాలు అమలు చేస్తారా లేదా? కొత్త సంవత్సరం రోజున ఎక్కడ ఉండాలో... అంటే జైల్లో ఉంటారో బయట ఉంటారో తేల్చుకోండి' అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ఉద్దేశించి కఠినంగా వ్యాఖ్యానించింది. గవర్నర్‌కు గడువు విధించే అధికారం లేనప్పుడు లెజిస్లేచర్ అధిపతికి గడువు విధించడంతోపాటు కోర్టు ధిక్కారం కింద జైలుకు పంపే అధికారం న్యాయ వ్యవస్థకు ఉంటుందా? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

## స్పీకర్‌ను జైలుకు పంపగలరా?

వాస్తవానికి, ఫిరాయింపులకు పాల్పడిన వారిపై స్పీకర్లు ఫలానా గడువులోపే చర్య తీసుకోవాలని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో లేదు. అలా చట్టంలో గడువు విధించకపోతే సదరు చట్టం చేసిన లక్ష్యం ఎలా నెరవేరుతుందని ప్రశ్నించాల్సిన సుప్రీంకోర్టు... ఇప్పుడు తెలంగాణ స్పీకర్‌కు తనకు తానుగా గడువు విధించింది. ఫిరాయింపులు, సభ్యుల రాజీనామాల విషయంలో సభాపతులు ఎడతెరిపిలేకుండా తాత్సారం చేస్తున్నారు. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుంటున్నారు. సదరు లొసుగులను అధిగమించే చర్యలకు ఉపక్రమించాల్సిన సుప్రీంకోర్టు మౌనంగా ఎందుకు ఉంటోందో తెలియదు. ఫిరాయింపుల వ్యవహారం ప్రహసనంలా మారిందన్నది ప్రజాభిప్రాయం. చట్టం చేసిన లక్ష్యం నెరవేరాలంటే గడువు ఉండాలి. ఆ మేరకు పార్లమెంటుకు సర్వోన్నత న్యాయస్థానం సూచించి ఉండాల్సింది. అలా కాకుండా ఒక్కో కేసు విషయంలో ఒక్కోలా తీర్పులు ఇస్తూ పోతుండటం వల్ల న్యాయ వ్యవస్థపై గౌరవం తగ్గుతుంది. రాజ్యాంగం ప్రకారం చట్టసభల ప్రిసైడింగ్ అధికారులకు కూడా రక్షణ ఉంటుంది. అయినప్పటికీ... చర్య తీసుకుంటారా? జైలుకు వెళ్లడానికి సిద్ధపడతారా? అని న్యాయస్థానం హూంకరించింది. ఇదొక రకంగా పరిధిని అతిక్రమించడమే. నిజంగా ఆ పరిస్థితే వస్తే తెలంగాణ శాసనసభ స్పీకర్‌ను జైలుకు పంపగలరా? అదే జరిగితే సదరు ఆదేశాలు ఇచ్చిన న్యాయమూర్తిపై శాసనసభ కూడా చర్యలకు ఉపక్రమిస్తే పరిస్థితి ఏమిటి? అందుకే రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన వ్యవస్థలు తమ పరిధులకు లోబడి హుందాగా వ్యవహరించాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. ఎవరికి వారు తామే గొప్ప అనుకుంటే రాజ్యాంగపరమైన ప్రతిష్టంభన ఏర్పడదా? నాలుగు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి ప్రతిష్టంభనే ఏర్పడింది.

## హద్దుల్లో... హుందాగా...

రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థల మధ్య సున్నితమైన లక్ష్మణ రేఖ ఉంటుంది. రాజ్యాంగ నిర్మాతల అభిమతం అదే. అయితే, ఇటీవలి కాలంలో కేసుల విచారణ సందర్భంగా న్యాయ వ్యవస్థలోని కొందరు తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. చివరకు అవేమీ తీర్పులో భాగంగా ఉండవు. అయితే.. అలాంటి వ్యాఖ్యలు, అభిప్రాయాలు వెలువడినప్పుడు అవన్నీ న్యాయస్థానాల తీర్పులు, ఆదేశాలుగానే ప్రజలు పరిగణిస్తున్నారు. కోర్టు ధిక్కార కేసులలో కూడా అరుదైన సందర్భాలలో మాత్రమే సంబంధిత అధికారులను పిలిపించాలి కానీ, చీటికీ మాటికీ కాదని సుప్రీంకోర్టు చెప్పింది. కానీ, ఆచరణలో మరోలా జరుగుతోంది. మిగతా వ్యవస్థలతో పోల్చితే సామాన్య ప్రజలు ఇప్పటికీ న్యాయస్థానాల మీదనే నమ్మకం ఎక్కువ పెట్టుకుంటున్నారు. అయితే, కొంతమంది న్యాయమూర్తులు కేసు మెరిట్స్‌తో సంబంధం లేకుండా వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించడం ఇప్పుడొక సమస్యగా మారుతోంది. దీనివల్ల న్యాయ వ్యవస్థ కొన్ని సందర్భాలలో ప్రజల మన్ననలను పొందుతుండగా, మరికొన్ని సందర్భాలలో ఆత్మరక్షణలో పడుతోంది. ఇప్పుడు మళ్లీ గడువు విషయానికి వద్దాం! ఏ విషయంలో అయినా గడువు అనేది అవసరమని అందరూ అంగీకరిస్తున్నారు. 'గవర్నర్‌కు గడువు విధిస్తూ చట్టం చేయండి లేదా రాజ్యాంగాన్ని సవరించండి' అని పార్లమెంటును సర్వోన్నత న్యాయస్థానం చొరవ తీసుకుని కోరితే ప్రజలు కూడా హర్షిస్తారు కదా? పార్టీ ఫిరాయింపుల విషయంలో కూడా ఫలానా గడువులోగా చర్యలు తీసుకునేలా చట్టాన్ని సవరించాలని సూచిస్తే ఎవరు మాత్రం అభ్యంతరం చెబుతారు? ఇలాంటి విషయాలలో తమకు అధికారం లేదని న్యాయ వ్యవస్థ అభిప్రాయపడితే చేయగలిగిందేమీ లేదు. అలా అయితే కేసుల విచారణ సందర్భంగా చట్టం, రాజ్యాంగం సమ్మతించని వ్యాఖ్యలు, అభిప్రాయాలు ఎలా వెలిబుచ్చుతారు? అన్న ప్రశ్న వస్తోంది. దిక్కులేని వాడికి దేవుడే దిక్కు అంటారు. మిగతా వ్యవస్థల వద్ద న్యాయం జరగనప్పుడు ప్రజలు అంతిమంగా న్యాయ వ్యవస్థ తలుపునే తడతారు కదా! అధికారం ఉన్నా లేకపోయినా న్యాయ వ్యవస్థకు బాధ్యత ఉండకపోతుందా? ఫలానా సమస్యను అధిగమించడానికి చట్టాన్ని చేయవచ్చునని గతంలో కొన్ని సందర్భాలలో సూచించారు కదా? రాజకీయ పార్టీలు బడ్జెట్‌లో సింహభాగాన్ని ఓట్ల కొనుగోలు కోసం తాయిలాల కింద పంచిపెడుతున్న విషయంలో కూడా ఈ దేశ ప్రజలు న్యాయ వ్యవస్థపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. గడువు ఉన్నప్పుడే ఎవరైనా బాధ్యతగా వ్యవహరిస్తారు. రాజ్యాంగాన్ని ఎడాపెడా రాజకీయ అవసరాలకోసం సవరించిన ఈ దేశంలో గవర్నర్లయినా, స్పీకర్లయినా వారందరికీ గడువు విధిస్తూ సవరణ చేయలేమా? ఈ గడువు అనేది లేకపోతే వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోతుంది. న్యాయ వ్యవస్థకు కూడా ఇదే మాట వర్తిస్తుంది.

**మిగతా వ్యవస్థల వద్ద న్యాయం జరగనప్పుడు ప్రజలు అంతిమంగా న్యాయ వ్యవస్థ తలుపునే తడతారు. అధికారం ఉన్నా లేకపోయినా న్యాయ వ్యవస్థకు బాధ్యత ఉండకపోతుందా? ఫలానా సమస్యను అధిగమించడానికి చట్టాన్ని చేయవచ్చునని గతంలో కొన్ని సందర్భాలలో సూచించారు. రాజకీయ పార్టీలు బడ్జెట్‌లో సింహభాగాన్ని ఓట్ల కొనుగోలు కోసం తాయిలాల కింద పంచిపెడుతున్న విషయంలో కూడా ఈ దేశ ప్రజలు న్యాయ వ్యవస్థపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు.**

## కోర్టుల్లోనే అంతులేని జాప్యం

న్యాయ స్థానాలలో కేసుల పరిష్కారం విషయంలో అంతులేని జాప్యం జరుగుతోంది. ఇందులో కొన్నింటి విషయంలో సహేతుక కారణాలు ఉండగా, చాలా సందర్భాలలో చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకొని నేరస్థులు చట్టంతో, న్యాయ స్థానాలతో చెలగాటం ఆడుతున్నారు. వంద మంది నేరస్థులు తప్పించుకున్నా పర్వాలేదుగానీ ఒక్క అమాయకుడు శిక్షకు గురి కాకూడదన్న సూక్తి వినడానికి బాగానే ఉంటుంది. ఆచరణలోనే ఇది నవ్వులపాలవుతోంది. సాదాసీదా నేరస్థుల విషయంలో జాప్యం జరిగినా పర్వాలేదుగానీ రాజకీయాలలోకి వచ్చిన నిందితులు, నేరస్థుల విషయంలో అంతులేని జాప్యం జరిగితే సమాజం నష్టపోతుంది. కేసుల పరిష్కారంలో ఏళ్లూ పూళ్లూ పట్టడం వల్ల నిందితులు అధికారంలోకి కూడా వస్తున్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు తీసుకొనే చర్యలకు ఎవరు బాధ్యత వహిస్తారు? బహుశా ఈ కారణంగానే కాబోలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన కొందరు ఆర్థిక నేరాలు, క్రిమినల్ నేరాలతో సంబంధం ఉన్న ప్రజాప్రతినిధులపై కేసుల విచారణను ఏడాదిలోగా పూర్తి చేయాలని తీర్పు ఇచ్చారు. ప్రజాప్రతినిధులపై ఉన్న కేసుల విచారణకు గడువు ఉండాలనే కదా ఇటువంటి ఉత్తర్వులు ఇచ్చింది! అయితే, దురదృష్టవశాత్తు ఈ ఆదేశాలు ఏవీ అమలు కావడం లేదు. చట్టంలోని లొసుగులే అందుకు కారణమైతే వాటిని సవరించాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించలేదా? కాలానుగుణంగా ఎన్నో చట్టాలను సవరించుకున్నాం. కొత్త చట్టాలను చేసుకుంటున్నాం. ప్రజాప్రతినిధులపై విచారణ త్వరితగతిన పూర్తి కావాలన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తులుగా పనిచేసిన వారి ఆదేశాలకే దిక్కు లేకపోతే ఎలా? ఈ కారణంగా న్యాయ వ్యవస్థ విశ్వసనీయత దెబ్బతినదా? తీవ్రమైన నేరాలు జరిగినప్పుడు ప్రజల్లో కలిగే ఆగ్రహావేశాలను చల్లార్చడం కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి సత్వరమే శిక్షలు పడేలా చేస్తున్నారు కదా? ప్రజాప్రతినిధులపై ఉన్న కేసులలో కూడా శీఘ్ర పరిష్కారం కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఎందుకు ఏర్పాటు చేయకూడదు? ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విషయమే తీసుకుందాం. ఆయన దాదాపు పదమూడేళ్లుగా బెయిల్ మీదే ఉన్నారు. మధ్యలో ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన నిర్ణయాల వల్ల రాష్ట్రం నష్టపోయిందని భావించడం వల్లనే గత ఎన్నికల్లో ఆయనను ప్రజలు పదకొండు సీట్లకే పరిమితం చేశారు. ఆయనపై నమోదైన అవినీతి కేసులలో కనీసం విచారణ కూడా ప్రారంభం కాలేదు. గడువు లేకపోవడం వల్లనే కదా ఇలా జరుగుతోంది. విచారణ పూర్తి చేసి ఆయన నిర్దోషి అని తేల్చితే ఎవరికీ అభ్యంతరం ఉండదు కదా! పుష్కర కాలం దాటినా జగన్‌రెడ్డి ఆర్థిక నేరస్థుడో కాడో తేల్చుకోలేని స్థితిలో ప్రజలు ఉండటం ఏమిటి? ఆయన దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్లకు కూడా అతీగతీ లేదు. ఫలితంగా జగన్ వంటి వారు చట్టంతో చెలగాటమాడుతున్నారు.

## కోర్టులో జగన్ తీరు...

ఎట్టకేలకు ఆరేళ్ల తర్వాత జగన్‌రెడ్డి సీబీఐ కోర్టు ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న హైడ్రామా విషయం తర్వాత చర్చించుకుందాం! కోర్టు అనుమతితో విదేశాలకు వెళ్లిన జగన్‌రెడ్డి కోర్టుకు తెలిపిన ఫోన్ నంబర్లలో అందుబాటులో లేరని సీబీఐ న్యాయస్థానానికి ఫిర్యాదు చేసింది. దీనిపై ఆయనను ఈ నెల 20న కోర్టుకు హాజరు కావలసిందిగా సీబీఐ కోర్టు ఆదేశించింది. విధిలేని పరిస్థితిలో ఆయన కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్టులో జరిగింది తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. నిందితులు ఎవరైనా వారికోసం కేటాయించిన స్థానంలో న్యాయమూర్తి ఎదుట నిలబడి ఉండాలి. జగన్‌రెడ్డి మాత్రం సాక్షులకు కేటాయించిన చోట కూర్చున్నారు. కేసు విచారణకు వచ్చినప్పుడు విదేశీ పర్యటన నుంచి మీరు ఎప్పుడు తిరిగి వచ్చారు? అని న్యాయమూర్తి ప్రశ్నించగా, 20వ తేదీన అని జగన్ చెప్పారు. దీంతో పక్కన ఉన్న న్యాయవాది కల్పించుకొని అక్టోబరు 20వ తేదీన అని న్యాయమూర్తికి తెలిపారు. తర్వాత మీరు చెప్పుకొనేందుకు ఏమైనా ఉందా? అని న్యాయమూర్తి ప్రశ్నించగా, ఏమీ లేదని జగన్‌రెడ్డి చెప్పారు.

**రాష్ట్రాలలో స్వపక్షం అధికారంలో ఉన్నప్పుడు ఒకలా – ప్రతిపక్షం అధికారంలో ఉన్నప్పుడు మరోలా గవర్నర్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శ ఎప్పటి నుంచో ఉంది. గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగమవుతోందని, ఆ వ్యవస్థను రద్దు చేయాలని కూడా ప్రతిపక్షాలు చాలా సందర్భాలలో డిమాండ్‌ను లేవనెత్తాయి. ఈ నేపథ్యంలోనే తమిళనాడు ప్రభుత్వం ఆ రాష్ట్ర గవర్నర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దానిపై గవర్నర్లతోపాటు రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దీనిపై అభ్యంతరం తెలుపుతూ రాష్ట్రపతి కార్యాలయం 14 ప్రశ్నలను సుప్రీంకోర్టుకు సంధించింది. కేంద్రం కూడా గొంతు కలిపింది. ఫలితమే రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తాజా తీర్పు! ఈ తీర్పుతో గవర్నర్లు–రాష్ట్రాలకు మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉంటాయి. ఫిరాయింపులు, సభ్యుల రాజీనామాల విషయంలో సభాపతులు ఎడతెరిపిలేకుండా తాత్సారం చేస్తున్నారు. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుంటున్నారు. సదరు లొసుగులను అధిగమించే చర్యలకు ఉపక్రమించాల్సిన సుప్రీంకోర్టు మౌనంగా ఎందుకు ఉంటోందో తెలియదు. ఫిరాయింపుల వ్యవహారం ప్రహసనంలా మారిందన్నది ప్రజాభిప్రాయం.**

అంతే, విచారణ పూర్తయిపోయింది. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత అదే కోర్టు హాలులో ఉన్న కొంతమంది న్యాయవాదులు జగన్‌రెడ్డితో సెల్ఫీలు దిగారు. ఇది కోర్టు నియమాలకు విరుద్ధం. కోర్టు హాలులో ఫోన్ల వినియోగం నిషిద్ధం. నిందితులు, సాక్షులు నిశ్శబ్దంగా ఉండాలి. వారి జేబులలో ఫోన్లు ఉండకూడదు. జగన్‌రెడ్డికి స్పెషల్ ప్రివిలేజెస్ ఉన్నాయేమో తెలియదు. ఆయన నిందితులకు కేటాయించిన స్థానంలో కూడా కూర్చోలేదు. కుశల ప్రశ్నల వంటి ప్రశ్నలు అడగడానికి జగన్‌రెడ్డిని కోర్టు ఎందుకు పిలిపించిందో తెలియదు. జగన్‌రెడ్డి కోర్టు హాలులోకి ఆలస్యంగా రావడం వల్ల ఇతర కేసుల విచారణలో జాప్యం జరిగి సాక్షులు ఇబ్బందిపడ్డారు. ఆయనకు మాత్రం ప్రాధాన్యం ఇచ్చారు. న్యాయ వ్యవస్థలో ఎంతటివాడైనా కోర్టు హాలులో ఒదిగి ఉండాల్సిందే. పీవీ నరసింహారావు అంతటివాడే జేఎంఎం ముడుపుల కేసులో న్యాయ స్థానానికి వెళ్లి న్యాయాధికారి ఎదుట నిలబడ్డారు. అప్పటికే ప్రధానమంత్రిగా వ్యవహరించిన ఆయనకోసం కోర్టు కార్యకలాపాలు స్తంభించలేదు. 'నేనేమిటి? కోర్టుకు హాజరు కావడం ఏమిటి?' అని పీవీ నరసింహారావు భావించలేదు. జగన్‌రెడ్డి మాత్రం అలా భావిస్తున్నారు. అందుకే కోర్టు విచారణకు హాజరు కావడానికి ఆయన మొరాయిస్తున్నారు. ఈ క్రమంలో న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తేవడం కోసం ఆయన ఎంచుకున్న మార్గం కూడా అనితర సాధ్యం. జగన్ కంటే ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కూడా స్కిల్ కేసులో తనను అరెస్టు చేసినప్పుడు జనాల్ని పోగేసి హడావిడి చేయకుండా... న్యాయాధికారి వద్ద వినయంగా నిలబడ్డారు. జగన్‌రెడ్డి ఆకాశం నుంచి ఊడిపడలేదు. నిందితుడిగా కోర్టుకు హాజరు కావాల్సిన పరిస్థితికి ఒక రకంగా సిగ్గుపడాలి. జగన్‌రెడ్డి అలా కూడా భావించడం లేదు. తనను మళ్లీ మళ్లీ కోర్టుకు పిలవకుండా ఉండటం కోసం స్వరాష్ట్రం నుంచి జనాన్ని పోగేసి హైదరాబాద్‌లో హడావిడి సృష్టించారు. ఆయన ఏదో సాధించడానికి వస్తున్నాడు అన్నట్టు సోషల్ మీడియాలో బిల్డప్ ఇచ్చుకున్నారు. హైదరాబాద్‌లో కూడా ఆయనపై ప్రజాభిమానం ఉప్పొంగిందని ప్రజలను నమ్మించే స్కెచ్ వేశారు. అదంతా స్టేజ్ మేనేజ్డ్ డ్రామా అని ఆయనకు తెలుసు. అయితే, కొంత మంది తమను తాము మోసగించుకుంటూ జనాన్ని మోసగించాలని ప్రయత్నిస్తారు. జగన్‌రెడ్డి ఈ కోవకు చెందినవాడే. ఆయన బేగంపేట ఎయిర్ పోర్టులో దిగి, నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు వెళ్లి, అక్కడ నుంచి లోటస్ పాండ్‌కు చేరుకునే వరకు కనిపించిన హడావిడి... బేగంపేట నుంచి తిరిగి బెంగళూరుకు వెళ్లేటప్పుడు కనిపించలేదంటే ఈ డ్రామా వెనుక ఉద్దేశ్యం తెలియడం లేదా? జగన్‌రెడ్డికి, తెలంగాణ రాష్ట్రానికి రాజకీయంగా ఏ సంబంధం లేదు. తెలంగాణలో ఆయన పార్టీని ఎప్పుడో మూసేసుకున్నారు. హైదరాబాదీలకు జగన్ కొత్త కాదు. ఆయనను చూడ్డం కోసం ఎగబడేంత ఎమోషనల్ అనుబంధం ఆయనతో వారికి లేదు. ఆంధ్రా మూలాలు ఉన్న వారు ఉంటేగింటే కొద్ది మంది ఉండవచ్చు.






## ఇదే జగన్ వ్యూహం...

ఎంపిక చేసిన సందర్భాలలో మాత్రమే జగన్‌రెడ్డి బల ప్రదర్శన ఎందుకు చేస్తున్నారన్నదే కీలకం! తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆయన తరచూ విజయవాడ ఎయిర్ పోర్టుకు వెళతారు. అప్పుడేమీ జనం పోటెత్తరు. బెంగళూరు ఎయిర్ పోర్టులో సాదాసీదాగా దిగి యలహంక ప్యాలెస్‌కు వెళతారు. అక్కడ ఎయిర్ పోర్టులో ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదు. నిజంగా ఆయనపై ప్రజాభిమానం ఉప్పొంగిపోతుంటే కాలు బయటపెట్టిన ప్రతిసారీ జనం పోటెత్తాలి కదా? కేవలం పరామర్శలకు బయలుదేరినప్పుడు, ఇప్పుడు ఇలా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకొనే ఎత్తుగడలు వేసినప్పుడు మాత్రమే జనం పోటెత్తడం ఏమిటి? అది కూడా ఎంపిక చేసిన మూకకు మాత్రమే ఆదేశాలు వెళతాయి. అంటే, జగన్ కావాలనుకున్నప్పుడు మాత్రమే జనం పోటెత్తుతారు ప్రజాభిమానం ఉప్పొంగడం పచ్చి అబద్ధమని జగన్‌తో పాటు ఆయన అనుచరులందరికీ తెలుసు. అయినా వారు భ్రమల్లో ఉంటూ ప్రజలను కూడా భ్రమల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమాషా ఏమిటంటే, దీనికంతటికీ కర్త, కర్మ, క్రియ అయిన జగన్‌రెడ్డి... తామే తోలుకొచ్చిన వాళ్లను చూసి నిజంగానే మురిసిపోవడం! 'సీఎం సీఎం' అని చేసే అర్థరహిత నినాదాలకు ఉప్పొంగిపోవడం వింతల్లోకెల్లా వింత. ఎన్నికలు జరిగి ఏడాదిన్నర కూడా కాలేదు. ఇంతలోనే ఎన్నికల్లో ఓడిపోయిన వారికోసం ప్రజలు అల్లాడిపోవడం అసంభవం. ఒకప్పుడు కమ్యూనిస్టులు నిర్వహించిన మహాసభలకు లక్షల సంఖ్యలో కార్యకర్తలు వచ్చేవారు. ఆ ప్రాంతమంతా ఎరుపు రంగు అలముకొనేది. ఆ వాతావరణం చూసిన వారికి కమ్యూనిస్టులు చాలా బలంగా ఉన్నారన్న అభిప్రాయం కలిగేది. నిజమేమిటంటే, కమ్యూనిస్టులు అప్పట్లో ఎక్కడ సభలు పెట్టినా అదే మనుషులు వెళ్లేవారు. అది ప్రజాబలం కాదు, ప్రదర్శన మాత్రమే అని తెలియడానికి ఎంతో కాలం పట్టలేదు. జగన్‌రెడ్డి స్వీయ దర్శకత్వంలో ప్రస్తుతం జరుగుతున్న ఈ జన సమీకరణ అనే డ్రామా కూడా ఇదే కోవలోకి వస్తుంది. అంతిమంగా జగన్‌రెడ్డి తనను తాను వంచించుకుంటున్నారు. అందులో రాజకీయ ఎత్తుగడ ఉంటే ఉండవచ్చు. 'రప్పా రప్పా–గంగమ్మ జాతర' వంటి ప్లకార్డులు ప్రదర్శిస్తూ జనాన్ని భయపెట్టే ఏ నాయకుడైనా అధికారానికి చేరువ కాగలడా? అయినా అదే మార్గాన్ని ఎంచుకున్నారంటే సొంత కేడర్‌లో ఆత్మవిశ్వాసం నింపి ప్రత్యర్థి కేడర్‌లో భయం నింపడమే ఇందులోని ఆంతర్యం కావొచ్చు. 2024 ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు వెళ్లినప్పుడు జనం ఇలా వెర్రెక్కినట్టు వ్యవహరించలేదే? చేయాల్సిందేదో పోలింగ్ రోజు చేసి చూపించారు. తాను ఆడుతున్న నాటకాలను ప్రజలు తెలుసుకోలేరని జగన్‌రెడ్డి భావించడం ఆయన చేస్తున్న తప్పు. ఎంపిక చేసుకున్న సందర్భాలలోనే బలప్రదర్శన చేస్తున్నారన్న విషయం ప్రజల్లోకి వెళ్లిపోయింది. ప్రజాప్రతినిధుల కేసుల విచారణలో జరుగుతున్న అంతులేని జాప్యం వల్లనే కాదా జగన్‌రెడ్డి వంటివారు ఇలాంటి ఆటలు ఆడుతున్నారు. మిగతా విషయాలలో వలె ప్రజాప్రతినిధులపై దాఖలైన కేసులు, ముఖ్యంగా ఆర్థిక నేరాలతో సంబంధం ఉన్న వారిపై నిర్దిష్ట కాల పరిమితిలో విచారణ పూర్తి చేయడానికి సర్వోన్నత న్యాయస్థానం చర్యలు తీసుకుంటే ఈ దేశానికి ఎంతో మేలు చేసినట్టవుతుంది. జగన్‌రెడ్డి వంటి వారి కేసుల విచారణకైనా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడంలో సుప్రీంకోర్టు చొరవ తీసుకుంటుందని ఆశిద్దాం! లేని పక్షంలో ఎవరి మీద ఎవరికీ నమ్మకం ఉండదు. వ్యవస్థలపై ప్రజలలో నమ్మకాన్ని పాదుగొల్పాల్సిన బాధ్యత ప్రధానంగా న్యాయ వ్యవస్థపైనే ఉంటుందని నమ్ముదాం! ఆశిద్దాం!

---

# 'క్రీమీలేయర్'కు రిజర్వేషన్లా!?

సంపన్న శ్రేణి (క్రీమీలేయర్) విధానం ఎస్సీలలో ప్రవేశపెట్టాలా, వద్దా? అనే చర్చ చాలాకాలంగా ఉంది. విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల ద్వారా అత్యధికంగా లబ్ధిపొందిన ఎస్సీలు దీనికి వ్యతిరేకంగా మాట్లాడతారు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఎస్సీ మేధావులు కూడా ఈ సంపన్నశ్రేణి విధానం దగ్గరికి వచ్చేసరికి, ప్రగతి నిరోధకంగా వ్యవహరించడం ఆశ్చర్యకరం.

వీరి వాదనలు ఇలా ఉంటాయి. (1) ఆధిపత్య కులాల వారి సంపదలకు ఏ విధమైన పరిమితులూ విధించనప్పుడు, తమకు మాత్రం ఈ సంపన్న శ్రేణి విధానం వర్తింపజేయాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆలోచిస్తూ వుండటం అన్యాయం (2) ఎస్సీల సమస్య ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య, కొందరు ఆర్థికంగా బాగుపడినప్పటికీ, కులపరంగా వేదనకు గురయ్యే పరిస్థితులే ఉన్నాయి (3) కంప్యూటరైజేషన్, మెకనైజేషన్, కృత్రిమ మేధ, ప్రైవేటైజేషన్ వలన ప్రభుత్వ అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఈ వర్గాల్లో అభివృద్ధి చెందిన వారు సైతం ఇప్పటికీ ఆధిపత్య కులాల సంపన్నులతో పోటీపడలేకపోతున్నారు. పోటీపడాలంటే, రిజర్వేషన్ల ద్వారా లబ్ధిపొందినవారే మళ్లీ మళ్లీ అవకాశాలు అందుకుంటూ ఇంకా బలపడాలి కనుక 'సంపన్నశ్రేణి' సరికాదు.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నవంబర్ పదహారో తేదీన, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 'భారతదేశం–డెబ్బై అయిదేళ్ల సజీవ భారత రాజ్యాంగం' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఉపన్యసిస్తూ 'రిజర్వేషన్ల దగ్గరికి వచ్చినపుడు ఒక ఐఏఎస్ అధికారి సంతతిని, ఒక పేద వ్యవసాయ కూలీ సంతతిని సమానంగా చూడరాదు' అన్నారు. ఇది వాస్తవం.

మండల్ జడ్జిమెంట్‌గా ప్రసిద్ధికెక్కిన ఇందిరా సహాని కేసులో 1992 నవంబర్ పదహారున సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తుది తీర్పునిచ్చింది. అందులో వెనుకబడిన తరగతులలోని సంపన్నశ్రేణికి రిజర్వేషన్లు ఇవ్వవద్దని స్పష్టం చేసింది. ఈ తీర్పు వచ్చిన ముప్పై రెండేళ్ల తర్వాత, ఎస్సీ, ఎస్టీల ఉపవర్గీకరణ కేసుగా ప్రముఖమైన దావీందర్ సింగ్ కేసులో 2024 ఆగస్టు ఒకటో తేదీన ఏడుగురు న్యాయమూర్తుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పులో, వెనుకబడిన తరగతులలో మాదిరిగా ఎస్సీల లోనూ సంపన్న శ్రేణి విధానం అమలు చేస్తే బాగుంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు రాసింది డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సామాజిక న్యాయ తాత్వికతకు దగ్గరివాడైన జస్టిస్ గవాయ్. శుక్రవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన తన తీర్పును ప్రస్తావిస్తూ, ఈ అంశంపై మరింత లోతుగా వ్యాఖ్యానించారు.




వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, తెగల వారి మధ్యలో రాజ్యం ద్వారా ఈ రిజర్వేషన్ల విధానం సమానత్వం, ఏకరూప అభివృద్ధి సాధించవలసి వుండింది. ఇందుకు బదులుగా, రిజర్వేషన్లు పొందిన కొన్ని కులాలు, కుటుంబాలే మళ్లీ మళ్లీ పొందుతూ, అసమానుల మధ్య అసమానతలను, వెనకబడిన వారి మధ్య మరింత వెనకబడిన పరిస్థితులను సృష్టించాయి. రిజర్వేషన్ల అమలు విధానాల ప్రభావాలను సమీక్ష చెయ్యడంలో ఆయా ప్రభుత్వాలు అనుసరించిన అలక్ష్యం, అలసత్వాలు ఈ అంతరిక వ్యత్యాసాల పెరుగుదలకు ఉపకరించాయి.

హోదాలు, జీతభత్యాలతో సహా, అన్ని రకాల సంపద అవకాశాలూ ప్రతి ఒక్కరికీ పంచాలని రాజ్యాంగం నిర్దేశించిన సంగతిని ఈ విద్యావంతులైన సంపన్నశ్రేణి మరువరాదు. సాంకేతిక అంశాలను, సమాజాన్ని గందరగోళంలోకి నెట్టే తప్పుడు వాదనలను, భయాలను, స్వార్థపూరిత దుష్ప్రచారాలను కొనసాగించవద్దు. ప్రతి కులానికీ, జాతికీ, తెగకూ రిజర్వేషన్లలో పంపిణీ న్యాయం జరగటానికి వీలుగా, ఉపవర్గీకరణ చేసి, హేతుబద్ధీకరించాలని నలభైఏళ్లపాటు దండోరా ఉద్యమం జరిగింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఆటంకాలు కల్పించి, చివరకు ఓడిపోయారు. ఇలా జరక్కుండా, అత్యంత వెనకబడిన అణగారిన కుటుంబాలకు, సమూహాలకు ప్రాధాన్యతలతో కూడిన ప్రాతినిధ్య న్యాయం కల్పించడానికి ఇప్పుడు సంపన్న శ్రేణిలో చేరినవారు ప్రగతిశీల దృక్పథంతో క్రీమీలేయర్ అమలును స్వాగతించాలి.

ఒకప్పుడు ఎస్సీ వాడల్లో అన్నీ పూరిళ్ళే ఉండేవి. గత అరవై ఏళ్లలో చదువు, ఉద్యోగాల రిజర్వేషన్లు అనుభవించిన ఒక ధనిక తరగతి ఎస్సీల్లో, ఎస్టీల్లో అదీ కొన్ని కులాల్లో, తెగల్లో, కుటుంబాల్లో ఎదిగింది. పెంకుటిళ్లు, భవంతులు, ప్రహరీ గోడలు కట్టుకుని భద్రజీవితాలకు ఇది అలవాటుపడింది. ఇలా అభివృద్ధి చెందిన తరగతి, వారి కమ్యూనిటీలకు ఎటువంటి బాధ్యతాయుత పరిహారాలనూ తిరిగి ఇవ్వలేదు. పైగా పరిమిత కులాలలోని, అవకాశాలు పొందిన కుటుంబాలలోని వారే, మళ్లీ మళ్లీ రిజర్వేషన్లను పొంది, సంతోషపడటానికి అలవాటుపడ్డారు. తమ కమ్యూనిటీలలో తమకంటే బలహీనమైనవారు ముందు అవకాశాలు పొందగలిగేలా రిజర్వేషన్ల విధానం నుంచి ఈ సంపన్నశ్రేణి వైదొలగి (సోషల్ కేటగిరీ నుంచి కాదు), అభివృద్ధి చెందిన ఆధిపత్య సమూహాలతో పోటీపడాల్సిన సమయం ఆసన్నమైంది.

▪ కృపాకర్ మాదిగ

## బీసీల ఆశలు గల్లంతు

- 42 శాతం అమలు లేక సగం తగ్గిన సీట్లు
- పాత రిజర్వేషన్ల విధానంతో నిరాశ
- నిరుత్సాహంలో ఆశావహులు




7

# పంచాయతీ రిజర్వేషన్లపై కసరత్తు

- నేడు అధికారికంగా వెల్లడి కానున్న రిజర్వేషన్లు
- సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేయనున్న ఆర్‌డీవోలు
- వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయనున్న ఎంపీడీవోలు
- మారనున్న గత బీసీ రిజర్వేషన్లు
- ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు



హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో శరవేగంగా జరుగుతోంది. రిజర్వేషన్లను ఖరారు చేయడంలో అధికారులంతా బిజీబిజీగా ఉన్నారు. రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దీనితో అప్రమత్తమైన అధికారులు.. శుక్రవారం నుంచే తమ పని మొదలు పెట్టారు. రోజంతా ఆయా గ్రామ పంచాయతీల జనాభా, ఓటర్ల సంఖ్య తదితర సంబంధిత వివరాలను సేకరించారు. శనివారం ఉదయం నుంచి రిజర్వేషన్ల ఖరారు పనిలో మునిగిపోయారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధికార యంత్రాంగతాలు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఇందులో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరారుకు శనివారం ఉదయం 9 గంటలనుంచి రాత్రి పొద్దుపోయే వరకు కుస్తీ పట్టారు. సర్పంచుల రిజర్వేషన్లను ఆర్డీవో, వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేస్తున్నారు.

**50 శాతం మించకుండా..**

ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గతంలో మాదిరిగా 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో ఆ దిశగా అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేస్తున్నారు. ఈ లెక్కన 50 శాతం స్థానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పోను మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరి స్థానాలుంటాయి. అన్నిట్లో సగం స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా ప్రాతిపదికన ఖరారు చేయాల్సి ఉంటుంది. గత నెల అక్టోబరులో నోటిఫికేషన్ ఇవ్వడానికి సన్నద్ధమైన తరుణంలోనే అంతకన్నా ముందు సెప్టెంబరు నెలాఖరులో ఈ రిజర్వేషన్లను ఖరారు చేశారు. గిరిజన గ్రామాలను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. వాటిలో ఇప్పుడు కూడా ఎలాంటి మార్పులు లేనట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం ఆదేశాలు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వే (ఎస్ఈఈఈపీసీ)-2024 ప్రకారం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బీసీ, జనరల్ రిజర్వేషన్లపై శనివారం కసరత్తు జరిగింది.

**బిజీ బిజీగా అధికార యంత్రాంగాలు**

### సర్పంచ్, వార్డు స్థానాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 మండలాలు, 1708 గ్రామ పంచాయతీలు, 15006 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. వీటిలో వరంగల్ జిల్లాలో 11 మండలాలు, 317 గ్రామ పంచాయతీలు, 2754 వార్డులు, హనుమకొండ జిల్లాలో 12 మండలాలు, 210 గ్రామ పంచాయతీలు, 1986 వార్డులు, జనగామ జిల్లాలో 12 మండలాలు, 210 గ్రామ పంచాయతీలు, 1986 వార్డులు8, మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలు, 482 గ్రామ పంచాయతీలు, 4110 వార్డులు, ములుగు జిల్లాలో 10 మండలాలు, 171 గ్రామ పంచాయతీలు, 1520 వార్డులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు, 248 గ్రామ పంచాయతీలు, 2101 వార్డులకు ఎన్నికలు జరపాల్సి ఉంది. ఉన్నాయి. పోలింగ్ నిర్వహణకు 15006 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**పర్యవేక్షణ**

రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిధిలోని సర్పంచ్ స్థానాలకు ఆయా ఆర్‌డీవోలు రిజర్వేషన్లను కేటాయిస్తుండగా, వీటిని డీఆర్‌డీవో, అదనపు ఆర్డీవోలు, డీఎల్‌పీవోలు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. వార్డు స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లను నిర్ణయిస్తున్నారు. జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు, డీఎల్పీవోలు పర్యవేక్షిస్తున్నారు. కాగా, మహిళలకు ఆయా స్థానాల్లో రిజర్వేషన్లను ఆదివారం కలెక్టర్ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఖరారు చేస్తారు. ఆదే రోజు (మిగతా 7వ పేజీలో)


# డీసీసీ పీఠంపై 'ఇనుగాల'

- ఊహించినట్టుగానే పదవి దక్కించుకున్న నేత
- ఇప్పటికే 'కుడా' చైర్మన్‌గా బాధ్యతలు
- అదనంగా మరో పదవి కట్టబెట్టిన అధిష్ఠానం
- తీవ్రపోటీలో రెడ్డి సామాజిక వర్గానికే దక్కిన పగ్గాలు
- ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి

హనుమకొండ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవి నియామక ఉత్కంఠకు తెరపడింది. క్షేత్రస్థాయి నుంచి నేతల పేర్ల పరిశీలన.. ఢిల్లీ నుంచి అబ్జర్వర్ల రాక.. దరఖాస్తుల స్వీకరణ.. కొత్త పంథాల్లో ఈ సారి అధ్యక్ష ఎంపిక వంటి అంశాలతో టెన్షన్ పెట్టిన కాంగ్రెస్ ఢిల్లీ అధిష్ఠానం.. చివరకు అంచనాలకు తగ్గట్లుగానే కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిని డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జిల్లా అధ్యక్షుల నియామక ఉత్తర్వులను శనివారం రాత్రి అధికారికంగా విడుదల చేశారు. కుడా చైర్మన్ పదవితో పాటు జిల్లా అధ్యక్ష కుర్చీని కూడా వెంకట్రాంరెడ్డి సొంతం చేసుకున్నారు. మరోవైపు అధ్యక్ష స్థానం కోసం పోటీపడ్డ వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పదవి ఉన్న వారికే మరో పదవి కల్పించారంటూ మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పదవితో పాటు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన నాయిని రాజేందర్‌రెడ్డి మరోసారి అధ్యక్షుడిగా ఉంటారనే బలమైన ప్రచారం నెలకొంది. కానీ వీటన్నింటికీ తెర దించుతూ అధిష్ఠానం వెంకట్రాంరెడ్డిని అధ్యక్షుడిగా నియమించింది.

**పోటా పోటీ**

డీసీసీ అధ్యక్ష పదవికి పలువురు నాయకులు పోటీపడ్డారు. పీసీసీ పదవుల్లో ఉన్న వారు సైతం జిల్లా అధ్యక్ష స్థానాన్ని కాంక్షించారు. ఈ మేరకు పోటాపోటీగా లాబీయింగ్ సైతం జరిపారు. టీపీసీసీ నుంచి ఏఐసీసీ వరకు తమదైన పద్ధతిలో యత్నాలు చేశారు. ఎవరికి వారు పదవి ఈసారి తమకే అనే ప్రచారం చేసుకున్నారు. కానీ వారి ఆశలు అడియాశలే అయ్యాయి. అధ్యక్ష పదవి కోసం దొమ్మాటి సాంబయ్య, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, బీసీ సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్, టీపీసీసీ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, ఆనంద్ మోజెస్, రమాకాంత్‌రెడ్డి, ఆనంద్ మోజెస్, డాక్టర్ రామక్రిష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పోటీ పడ్డారు. ఎస్సీ, బీసీ, మహిళా కోటాలో సమీకరణలు, అంచనాల్లో తమకే దక్కుతుందని ఆశించారు. కానీ అధిష్ఠానం మాత్రం చివరకు మళ్లీ రెడ్డి



సామాజికవర్గానికే అధ్యక్ష పదవిని కట్టబెట్టింది. దీంతో సీనియర్లతో పాటు యువతరం నాయకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండేసి పదవులు కల్పించడమేమిటనే వాదనలు వినిస్తున్నారు. వెంకట్రాంరెడ్డికి అధ్యక్ష పదవి దక్కడం మరో కొత్త అంచనాలకు కూడా దారి తీసింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి మంత్రి పదవి లేదా చీఫ్‌విప్ దక్కడానికి లైన్ క్లియర్ అయినట్లేననే అంచనాలు ఆయన వర్గీయుల్లో నెలకొన్నాయి.

**సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తా**

జిల్లా అధ్యక్ష పదవి దక్కడం ఆనందంగా ఉంది. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తల సహకారంతో అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తా. పదవి కల్పించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, (మిగతా 6వ పేజీలో)

## వరంగల్ డీసీసీ అధ్యక్షుడిగా మహ్మద్ అయూబ్



వరంగల్ సిటీ, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా మహ్మద్ అయూబ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత అక్టోబరు నెలలో హనుమకొండలోని డీసీసీభవన్‌లో, అదే విధంగా వరంగల్‌లోని ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో ఏజీసీసీ అబ్జర్వర్ నవ్‌జ్యోతి పట్నాయక్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుల ఎన్నిక కోసం కసరత్తు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి సైతం వివరాలు తెలుసుకుని అధిష్ఠానానికి నివేదిక పంపారు. కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు విధేయుడిగా ఉండడం, మైనారిటీ కావడం, ఎమ్మెల్యేలు సైతం రెండో పేరుగా అయూబ్‌ను సూచించడం కలిసి వచ్చింది. దానికి తోడు టీపీసీసీలోని కొందరు ముఖ్య నాయకులు, ఏఐసీసీలోని ముఖ్య నాయకులు మైనారిటీ కోటా కింద అయూబ్ పేరును సూచించడంతో అధిష్ఠానం ఆయనకు ఈ అవకాశం కల్పించింది. అదే విధంగా ఆదినుంచీ కాంగ్రెస్‌లో ఉన్న బస్వరాజు సారయ్యకు అనుచరుడిగా ఉండగా, సారయ్య బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లినా.. అయూబ్ మాత్రం కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఆ తరువాత వచ్చిన కొండా దంపతులకు అనుచరుడిగా కొనసాగారు. ఎట్టకేలకు అన్ని విషయాలను ఏఐసీసీ పెద్దలు కూలంకశంగా చర్చించిన తరువాత అయూబ్ పేరును డీసీసీ అధక్షుడిగా ప్రకటించినట్లు తెలుస్తోంది.

# మహిళా సంక్షేమానికి పెద్దపీట

**ఇందిరమ్మ చీరల పంపిణీలో ఎంపీ కడియం కావ్య**

బాలసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం 'మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని హసన్‌పర్తి, ఐనవోలు మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కలెక్టర్ స్నేహాశబరీష్‌ల చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనతో ముందుకెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీఎస్ కోఆపరేటివ్ బ్యాంకు రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, హసన్‌పర్తి, ఐనవోలు మండలాల ఎంపీడీవోలు సుమనవాణి, నర్మద, అధికారులు, హసన్‌పర్తి, ఐనవోలు మండలాల మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్

# మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ఎంతో ఉపయోగం

**సీపీ సన్‌ప్రీత్ సింగ్**

వరంగల్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్యాధునిక పరికరాలతో రూపొందించబడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనం వరంగల్ కమిషనరేట్ పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనున్న దని సీపీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం రెండో మొబైల్ ఫోరెన్సిక్ వాహనం వచ్చింది. ఈ మేరకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పచ్చజెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఏదైనా నేరం జరిగితే ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో సంఘటనా స్థలానికి చేరు కుని రక్తమరకలు, వేలి ముద్రలతో ఇతర సాక్ష్యాధారాలను సేకరించి ఈ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేస్తారన్నారు. ఈ మొబైల్ వాహనంలో విధులు నిర్వహించేందుకు ఆరుగురు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని సీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, క్రైం డీసీపీ గుణ శేఖర్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్, శ్రీనివాస్‌తో పాటు ఏసీపీలు సదయ్య, జాన్ నర్సింహులు, నాగయ్య, ఆర్ఐలు ఫింగర్ ప్రింట్ ఇన్స్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్



# కసాయి కొడుకు

**మద్యం మత్తులో తల్లి హత్య**



మృతి చెందిన వెంకటమ్మ

వరంగల్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనిపెంచిన తల్లినే హతమార్చాడు ఓ కసాయి కొడుకు. మద్యం మత్తులో ఉండి వృద్ధురాలైన తల్లిని అకారణంగా బండరాయితో దారుణంగా కొట్టి చంపాడు. వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని రాముల వారి వీధిలో నివాసం ఉంటున్న వెంకటమ్మ(65)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరికీ వివాహాలు అయి ఎవరికి వారు బతుకుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం వెంకటమ్మ భర్త నరహరి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా వెంకటమ్మ పెద్ద కుమారుడు కూరపాటి రాజు ఆటో నడుపుతూ జీవించేవాడు. తను మద్యానికి బానిస కావడంతో 15 సంవత్సరాల క్రితమే ఆయన భార్య నెక్కొండలోని రెడ్లవాడలో గల తన పుట్టింటికి వెళ్లిపోయి అక్కడే ఉంటోంది. అప్పటి నుంచి రాజు తన తల్లి వద్దనే ఉంటున్నాడు.

నిత్యం మద్యం సేవిస్తూ తల్లి వెంకటమ్మను అకారణంగా దూషించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి మద్యం సేవించి వచ్చి వృద్ధురాలైన తల్లితో అకారణంగా గొడవపడ్డాడు. రాయి తీసుకొని ఇష్టం వచ్చినట్లు కొట్టగా వెంకటమ్మ అపస్మారక స్థితిలో పడిపోయింది. దీంతో రాజు పారిపోయాడు. శనివారం ఉదయం పక్కింటివారు గమనించి కాశిబుగ్గలో నివసించే వెంకటమ్మ చిన్న కుమారుడు కూరపాటి కుమారస్వామికి సమాచారం ఇచ్చారు.

తను వచ్చి వెంటనే తల్లిని 108లో ఆసుపత్రికి తరలిస్తుండగానే చనిపోయింది. సంఘటన స్థలాన్ని వరంగల్ ఏసీపీ శుభం, సీఐ షూకూర్, సిబ్బంది పరిశీలించి విచారణ చేపట్టారు. సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రైల్వే స్టేషన్‌లో మరమ్మతు పనులు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**



నాలుగో ప్లాట్‌ఫామ్‌పై విరిగిన గ్రానైట్ రాళ్లను తొలగిస్తున్న కూలీలు

గిర్మాజీపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట్ల రుపాయలతో తీర్చి దిద్దిన వరంగల్ రైల్వేస్టేషన్‌లో అధికారులు మరమ్మతు పనులు చేప ట్టారు. ప్లాట్‌ఫారాలపై పగుళ్లు, లిఫ్టులు పనిచేయక ప్రయాణికుల ఇబ్బందులపై 'అంతా డొల్ల' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శనివారం నాడు ప్రచురించిన కథనానికి రైల్వే ఉన్నతాధికారులు స్పందించారు. ఐవోడబ్ల్యూ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రైల్వేస్టేషన్ ప్రారంభించిన 5 నెలల్లోనే ప్లాట్‌ఫారాలకు పగుళ్లు ఎందుకు వచ్చాయి.. లిఫ్ట్ ఎందుకు పనిచేయడం లేదు.... ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే నీ దృష్టికి ఎందుకు రాలేదు..' అంటూ మందలించారని తెలిసింది. తక్షణం మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో సదరు అధికారి కాంట్రాక్టర్‌ను రప్పించి నాలుగో ప్లాట్‌ఫారంపై లిఫ్ట్ ముందు విరిగిన గ్రానైట్‌లను తొలగించి కొత్తవి వేశారు. లిఫ్ట్ పక్కన శివనగర్ వైపు గతంలో వదిలేసిన అసంపూర్తి గ్రానైట్ పనులను పూర్తి చేశారు. అదేవిధంగా మొదటి ప్లాట్‌ఫాంపై ఉన్న ఫ్లోరింగ్ గుంతలను సిమెంట్‌తో పూర్తి చేశారు. అయితే ఇక్కడ గ్రానైట్ రాయి విరిగి ఫ్లోరింగ్ కుంగినప్పటికీ దానిని అలాగే వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి.

## సెంట్రల్ జోన్ డీసీపీగా దార కవిత



వరంగల్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీగా హైదరాబాద్ సైబర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న దార కవితను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, కవిత కంటే ముందు సీఐడీ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను సెంట్రల్ జోన్‌కు అటాచ్ చేయగా బాధ్యతలు తీసుకోవడానికి వరంగల్‌కు వచ్చిన ఆయన రాజకీయ జోక్యంతో బాధ్యతలు తీసుకోకుండానే వెళ్లిపోయారు. ఆ స్థానంలో తాజాగా కవితను నియమించారు. ఈ పోస్టింగ్‌పై సర్వత్రా చర్చ జరుగుతోంది. శ్రీనివాస్‌ను అడ్డుకున్న నాయకుడి ఆశీస్సులతోనే కవితకు పోస్టింగ్ దక్కిందా...? అని చర్చ సాగుతోంది.

## నిరాశ్రయుల సమాచారాన్ని నమోదు చేయాలి



ప్రతాప్‌నగర్‌లో నిరాశ్రయుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఉన్న నిరాశ్రయుల సమాచారం పక్కాగా సేకరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని నిరాశ్రయులను గుర్తించడానికి రోడ్లు, నిరాశ్రయుల కేంద్రాలను సంబంధిత సిబ్బందితో కలిసి సందర్శించారు. హనుమకొండ చౌరస్తా, వరంగల్ రైల్వేస్టేషన్, ప్రతాప్‌నగర్, కాజీపేట బస్‌షెల్టర్లతో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో రోడ్లు, బస్‌షెల్టర్లు, మురుగుకాల్వల వెంట నిరాశ్రయులుగా నివసిస్తున్న వారిని గుర్తించి జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షెల్టర్ హోంలకు తరలించాలన్నారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయం సమీపంలోని స్వీపింగ్ మిషన్‌లను పరిశీలించి మాట్లాడారు. ఆరు మాసాలుగా స్వీపింగ్ మిషన్లు పని చేయడం లేదని, ఇంజనీరింగ్ విభాగం అధికారులు వాటిని త్వరితగతిన మరమ్మతు చేయించి ఉపయోగంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, డీసీ సమ్మయ్య, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీనివాస్, టీఎంసీ రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

## ఆదర్శ లా కాలేజీలో ఎల్‌ఎల్‌ఎంలో సీట్లు

### స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

హనుమకొండ, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆదర్శ లా కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటాలో ఎల్‌ఎల్‌ఎం-ఐపీఆర్‌లో 2 సీట్లు, సీపీఆర్‌లో 2 సీట్లు ఉన్నాయని, సీట్లను పొందగోరేవారు నేరుగా సంప్రదించవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ప్రతిభ తెలిపారు. ఈ ఎల్‌ఎల్‌ఎం సీట్లలో ప్రవేశాలు ఎవరు ముందు వస్తే వారికే కేటాయించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

## 24 నుంచి ఆర్ట్స్ కళాశాల సెమిస్టర్ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిగ్రీ మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలను ఈనెల 24 నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 10 వరకు నిర్వహించే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

# మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణమెప్పుడో?

● అధ్వానంగా హనుమకొండ బస్టాండ్ ● ప్రతిపాదనలకే పరిమితం ● వర్షం వస్తే చెరువే.. ● ఇరుకుగా ప్రయాణ ప్రాంగణం ● ఇబ్బందుల్లో ప్రయాణికులు

హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో అన్ని హంగులతో కూడిన మల్టీపర్పస్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణం కలగానే మిగిలింది. ఈ బస్‌స్టేషన్ నిర్మాణానికి అడుగులు ముందుకు పడడం లేదు. తమకు సకల సౌకర్యాలతో కూడిన బస్‌స్టేషన్ల నిర్మాణం జరగాలని కొన్ని దశాబ్దాలుగా వరంగల్, కాజీపేట పట్టణవాసులు కంటున్న కలలు ఎట్టకేలకు సాకారం కాబోతున్నాయి. మరి హనుమకొండ పట్టణ వాసుల సంగతేమిటి? మల్టీపర్పస్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మించాలని హనుమకొండ వాసులు కూడా ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. వీరి కల సాకారమయ్యేది ఎప్పుడన్నదే అంతు చిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది.

**చాలా కాలం నుంచి..**

ఇప్పుడున్న హనుమకొండ బస్‌స్టేషన్ నిర్మాణం జరిగి 40 ఏళ్లకు పైగా అవుతోంది. మాజీ కేంద్ర మంత్రి దివంగత కమాలొద్దీన్ అహ్మద్ ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు 13 ఎకరాల విస్తీర్ణంలో బస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించారు. ఆ తర్వాత కాలంలో ప్రయాణికుల సంఖ్య కూడా బాగా పెరిగి బస్సుల సంఖ్య కూడా గతంలో కన్నా ఎన్నోరెట్లు పెరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న 9 బస్సు డిపోలతో పాటు, వివిధ జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచే బస్సులు నడుస్తున్నాయి. ప్రతీరోజు వేలాదిమంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రస్తుత హనుమకొండ బస్‌స్టేషన్ సరిపోవడం లేదు.

**ఇరుకుగా.. ఇబ్బందిగా...**

భవనం కూడా పాతబడి పోయింది. బస్‌స్టేషన్ లోతట్టున ఉండడం తో చిన్న వాన పడినా చుట్టు పక్కల ప్రాంతాల వర్షపు నీరంతా బస్‌స్టేషన్‌లోనే నిలిచి చిన్నపాటి చెరువుగా మారుతోంది. బస్సుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. బస్సులు ఆగడానికి చాలినన్ని ప్లాట్‌ఫారాలు లేవు. కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైగా ఈ ప్రయాణ ప్రాంగణంలోనే ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం, వరంగల్ 1, వరంగల్ 2 డిపోలు, పెట్రోల్‌బంక్, కార్గో సర్వీస్ కేంద్రం, ఆర్టీసీ కార్మికుల ఆస్పత్రి మొదలైనవి ఉన్నాయి.

**నిత్యం రద్దీ ..**

హనుమకొండ బస్‌స్టేషన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. చారిత్రక నగరం, పర్యాటక ప్రదేశం కావడంతో ఎక్కువ మంది ఇక్కడకు వస్తుంటారు. 900లకుపైగా ఆర్టీసీ బస్సు సర్వీసులు తిరుగుతుంటాయి. బస్‌స్టేషన్ ప్రధాన ద్వారం ఇరుగ్గా ఉండడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రయాణికులు ప్రమాదానికి గురవుతున్నారు. కొద్ది రోజుల కిందట ఒక మహిళా ప్రయాణికురాలు బస్సు ఎక్కబోయి టైర్ల కింద పడి చనిపోయింది. ఈ పరిస్థితుల్లో బస్‌స్టేషన్‌ను కూలగొట్టి దాని స్థానంలో అన్ని హంగులతో కూడిన అత్యాధునిక మోడల్ బస్‌స్టేషన్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు.



ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన బస్‌స్టేషన్, వరద నీటిలో ఉన్న బస్సులు



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్‌స్టేషన్

**రూ.80కోట్ల వ్యయంతో..**

ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులు రూ.80కోట్ల వ్యయంతో బస్‌స్టేషన్‌ను నిర్మించేందుకు మూడు నాలుగు నమూనాలను తయారు చేయవలసిందిగా కుడా అధికారులను కోరారు. నమూనా ఖరారైన తర్వాత డిటెయిల్స్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను తయారు చేయవలసిందిగా కోరారు. ఆ మేరకు కుడా అధికారులు 13 ఎకరాల స్థలంలో 5 అంతస్థులతో సువిశాలమైన భవన సముదాయంలో ఆర్‌ఎం కార్యాలయం, ఇతర అధికారుల చాంబర్లు, సినిమా హాల్, షాపింగ్ కాంప్లెక్స్, హోటల్స్, డార్మెటరీతో పాటు వెయిటింగ్ హాల్, వీఐపీ లాంజ్ తదితర వాటిని నిర్మించేలా ప్లాన్‌ను తయారు చేశారు. కలెక్టర్ దీనిని ఆమోదించారు. నిధుల మంజూరుకి ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు.

కాగా, బస్‌స్టేషన్ నిర్మాణం జరుగుతుందనుకుంటున్న తరుణంలో ఆర్టీసీ అధికారులు మెలిక పెట్టినట్టు తెలిసింది. బస్‌స్టేషన్ నిర్మాణంపై చర్చల సందర్భంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు భవనాన్ని తామే నిర్మించుకుంటామని చెప్పటంతో కుడా అధికారులు వెనక్కి తగ్గారు. నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకున్నట్టు సమాచారం.



# అండర్‌గ్రౌండ్‌లోని చెత్తను తొలగించాలి

### నగర మేయర్ గుండు సుధారాణి



పోచమ్మమైదాన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలిస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అండర్ గ్రౌండ్‌లలోని పైపులలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్, డీమార్ట్ ప్రాంతంలోని పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పైపులలో చెత్త చిక్కుకుని నీరు బయటకు రాకపోవడం వల్ల ముందుకు నుంచి వచ్చే కాల్వలు జామ్ అవుతాయన్నారు. తద్వారా డ్రైనేజీ నీరు రోడ్లపైకి వస్తుందన్నారు. భూమిలోపల ఉన్న పైప్‌లైన్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక పరికరాలు తెప్పించి పెద్దగా సమస్య ఏర్పడిన ప్రాంతాలను గుర్తించి సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ వద్దకు వెళ్లి పరిశీలించారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ సత్యనారాయణ, డీఈ సతీష్, ఏఈలు హబీబ్, సంతోష్‌లు పాల్గొన్నారు.

**ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించాలి**

ప్రతీ ఇంటి నుంచి చెత్తను అందించేలా చూడాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం వరంగల్ నగరంలోని 24, 25, 28 డివిజన్‌లలోని పలు కాలనీలలో శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రతీ ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేరుగా అందించేలా సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. ప్రతీ ఇంటికి చెత్త డబ్బాలను అందించాలన్నారు. ఏ ఇంటి నుంచి చెత్త సేకరణ జరగదో ఆ ఇంటి యజమానులకు జరిమానా విధించాలన్నారు. చెత్త ఇవ్వని ఇంటిని గుర్తించి సంబంధిత డివిజన్ జవాన్‌లకు సమాచారం అందించాలన్నారు. ప్లాస్టిక్ వాడకుండా చూడాలని, ఎక్కడైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించి అక్కడి వాహనాల పనితీరును పరిశీలించారు. ఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, కార్పొరేటర్ తేజస్వి, ఎంహెచ్‌వో రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్లు శ్రీను, భాస్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

**పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలి**

వరంగల్ నగరంలో పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శనివారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఆస్తి, నల్లా పన్నుల వసూళ్లతో పాటు కమర్షియల్ వసూళ్లను క్రమం తప్పకుండా వసూలు చేయాలన్నారు. రెసిడెన్షియల్ అనుమతులు పొంది కమర్షియల్ షాపులు నిర్వహిస్తే వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ పొందిన వారు అందరూ ఆస్తి పన్నులో ట్రేడ్‌గా ఫీజులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్‌వోలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

## నాలుగు జిల్లాల అధ్యక్షులు వీరే..

### ఎట్టకేలకు ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం



లకావత్ ధన్వంతి (జనగామ)



భూక్య ఉమ (మహబూబాబాద్)



పైడాకుల అశోక్ (ములుగు)



బట్టు కరుణాకర్ (భూపాలపల్లి)

జనగామ/మహబూబాబాద్ టౌన్/ములుగు/భూపాలపల్లిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం శనివారం రాత్రి జరిగింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జిల్లా అధ్యక్షుల జాబితాను ప్రకటించారు. జనగామ జిల్లా డీసీసీ పీఠం మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతిని వరించింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలానికి ధన్వంతి.. 2006లో కాంగ్రెస్ నుంచి దేవరుప్పుల మండల జడ్పీటీసీగా గెలుపొంది 2006 నుంచి 2011 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ పనిచేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ భూక్య ఉమ నియామకమయ్యారు. ఉమ మహబూబాబాద్ మునిసిపాలిటీ తొలి చైర్‌పర్సన్‌గా ఎన్నికై 2014 నుంచి 2019 వరకు కొనసాగారు. కాగా, ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పైడాకుల అశోక్ రెండోసారి నియామకమయ్యారు. భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బట్టు కరుణాకర్ ఎంపికయ్యారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆయనను పార్టీ అధిష్ఠానం డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేసింది.

## సోడాష్‌పల్లిలో హిడ్మా ఫ్లెక్సీ కలకలం

### పెట్టిన ఇద్దరిపై కేసు నమోదు




గ్రామంలో వెలిసిన హిడ్మా ఫ్లెక్సీ

వేలేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేలేరు మండలం సోడాష్‌పల్లి గ్రామ ప్రధాన కూడలిలో శుక్రవారం అర్ధరాత్రి మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా ఫ్లెక్సీ వెలువడం గ్రామస్తుల్లో కలకలం రేపింది. ఇందుకు కారణమైన ఇద్దరు యువకులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీర సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన కొయ్యడ సురేష్, మ్యాక బుచ్చయ్యలు స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా సంతాపకంగా ఆయన ఫొటోతో కూడిన ఫ్లెక్సీని గ్రామంలోని సెయింట్ క్యాథలిక్ చర్చి గోడకు అర్ధరాత్రి ఏర్పాటు చేశారు. అదే రోజు రాత్రి పోలీసులు గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా డ్యూటీ కానిస్టేబుల్ ఏకరాజు, హోంగార్డు తిరుపతిలకు ఫ్లెక్సీ కనబడింది. ఈ విషయం శనివారం ఉదయం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన సురేష్, బుచ్చయ్యను అదుపులోకి తీసుకుని సుమోటగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అక్రమార్కుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాఠశాలల్లో వివిధ హోదాల్లో పనిచేసిన సమయాల్లో వివిధ అక్రమాలకు పాల్పడిన కరణ్ అనే ఉపాధ్యాయుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.ఉప్పలయ్య, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు ఇంక్రిమెంట్లు కోత విధిస్తూ కరణ్‌పై అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ ఆయన అక్రమాలకు క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు పేర్కొన్నారు. అలాగే ఆయనకు సహకారం అందించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్



టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాంకిషన్

హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీవో భవనంలో వరంగల్ జిల్లా టీఎన్జీవో యూనియన్ సర్వ సభ్యసమావేశం జరిగింది. యూనియన్ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ గజ్జెల రాంకిషన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అన్ని శాఖల ఉద్యోగులు, తాలూకా యూనిట్ల బాధ్యులు, వివిధ శాఖల ఫోరం బాధ్యులు, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్ల గురించి చర్చించారు. రాష్ట్రంలో, జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని, నగదు రహిత చికిత్సలను అందించాలని తీర్మానించారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ టీఎన్జీవోస్ సభ్యత్వం తీసుకోవాలని, తద్వారా సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవ చేసేవారని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈనెల 28న టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఆధ్వర్యంలో జరిగే ఉద్యోగుల సాధన సభను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

ఈ సమావేశంలో టీఎన్జీవోస్ కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, సహ అధ్యక్షుడు హేమానాయక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాంబయ్య, కార్యదర్శి భాను, పెన్షనర్ల సంఘం బాధ్యులు ధర్మరాజు, జోగిరెడ్డి, అంగన్వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మేక అనిత కుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గారావు, రాజు, వంశీధర్ బాబు, సంయుక్త కార్యదర్శి నాగేశ్వరరావు, సతీష్, రజనీకాంత్, గంగాధర్, చిరంజీవి, గణేష్, మెడికల్ ఫోరం అధ్యక్షుడు నాగిరెడ్డి, వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్ కుమార్, సురేష్ రెడ్డి, దేవేందర్, శ్రీనివాస్, శరత్, వివిధ ఫోరమ్‌ల బాధ్యులు అనిల్, జోసఫ్, వినోద్, పృథ్వీ, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మనీలా, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# బీసీల ఆశలు గల్లంతు




- 42 శాతం అమలు లేక సగం తగ్గిన సీట్లు
- పాత రిజర్వేషన్ల విధానంతో నిరాశ
- నిరుత్సాహంలో ఆశావహులు

హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 50 శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గతంలో ప్రకటించినట్లు 42 శాతం రిజర్వేషన్లు అమలైతే అదనంగా లభించే సీట్లను బీసీలు గణనీయంగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో బీసీ స్థానాల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల్లో తీవ్ర నిరాశ నెలకొన్నది. అక్టోబరులో ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు రిజర్వు అయిన స్థానాల్లో పోటీకి నేతలు అప్పటి నుంచే సిద్ధమయ్యారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం, మద్దతుదారులను కూడగట్టుకోవడంలో బిజీ అయిపోయారు. కానీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో బీసీల ఆశలు గల్లంతయ్యాయి. గతంలో మాదిరిగానే 50శాతం మించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు అమలు చేయాల్సి రావడంతో బీసీ ఆశావహులు పోటీ చేయడానికి సిద్ధపడుతున్న స్థానాల రిజర్వేషన్ మారే పరిస్థితి ఏర్పడింది.

ఉదాహరణకు హనుమకొండ జిల్లాలో 205 గ్రామ పంచాయతీల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలైతే 86 స్థానాల్లో వారు పోటీ చేసే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు పాత రిజర్వేషన్ ప్రకారం అయితే 45 నుంచి 47 స్థానాలకు మించి పోటీ అవకాశం లేదు. దీని వల్ల బీసీలు సుమారు 41 సీట్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. డెడికేటెడ్ కమిటీ సర్వే నివేదిక ప్రకారం జిల్లాలో తాజాగా ఎస్సీ జనాభా దామాషా ప్రకారం 50 నుంచి 52 స్థానాల్లో పోటీకి అవకాశం ఉండగా ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం 3 స్థానాలకు మించి దక్కేట్టు లేదు. బీసీల విషయానికి వస్తే జనాభా దామాషా ప్రకారం కాకుండా పాత రిజర్వేషన్ ప్రకారం 45 నుంచి 47 స్థానాల్లో మాత్రమే పోటీకి అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మిగిలిన 105 అన్‌రిజర్వేడ్ స్థానాల్లో 50 శాతం మహిళలకు రిజర్వుకాగా మిగతా 50 శాతం సీట్లలో ఉవరైనా పోటీ చేయవచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 1,708 గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇంతకు ముందు ప్రకటించినట్లు 42 శాతం రిజర్వేషన్ ప్రకారం అయితే బీసీలు 717 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ చేసే అవకాశం ఉండేది. కానీ పాత రిజర్వేషన్ ప్రకారం ప్రస్తుతం సుమారుగా 393 స్థానాల్లో పోటీకి అవకాశం ఉంది. అంటే 324 స్థానాల్లో పోటీ చేసే అవకాశం జారీ పోయినట్టు భావించాల్సి వస్తోంది. పార్టీ గుర్తులు లేకుండా జరిగే పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ మద్దతుతో బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో పోటీ చేయగలిగితే వారి సంఖ్య పెరగవచ్చు.

### నేతల్లో ఉత్కంఠ

తమ ఊరి సర్పంచ్ రిజర్వేషన్ దేనికి ఖరారవుతుం దనే ఉత్కంఠ గ్రామాల్లో నెలకొన్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పుల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో పాత రిజర్వేషన్ల విధానానికి జిల్లా యంత్రాంగాలు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రకటనపై నేతలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ నెలాఖరులోపు షెడ్యూల్ వెలువడుం తుందనే ప్రచారం జోరందుకున్న తరుణంలో అధికారు లు కూడా 2019 పంచాయతీ ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్ల ప్రకారమే 50 శాతాన్ని మించకుండా ప్రక్రియను కొనసాగిస్తున్న నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయడానికి సన్నద్ధమవు తున్న ఆశావహుల్లో ఆందోళన నెలకొన్నది. బీసీ డెడికే టెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్ల ఖరారు చేయాలని చెప్పడంతో ఈసారి ఆరు జిల్లాల్లో మార్పులు చేర్పులు ఉండవచ్చునని భావిస్తున్నారు. పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులంతా అధికారిక ప్రకటన కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత నెలలో ప్రకటించిన రిజర్వేషన్లలో బీసీ స్థానాల్లో చాలా వరకు అన్ రిజర్వుడ్ కానున్నాయి.

# శిలాఫలకాల ధ్వంసం

- అర్ధరాత్రి కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు
- ఇది బీఆర్ఎస్ పనేనని కాంగ్రెస్ ఆరోపణ
- తాము కాదంటున్న బీఆర్ఎస్ నాయకులు
- కొడకండ్లలో రెండు చెక్‌డ్యామ్‌ల శిలా ఫలకాల ధ్వంసంపై రచ్చ


కూల్చివేసిన శిలా ఫలకాన్ని చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

కొడకండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కొడకండ్ల మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శంకుస్థాపన చేసిన రెండు చెక్‌డ్యామ్‌ల శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి ధ్వసం చేయడం స్థానికంగా రాజకీయ వేడిని రాజేసింది. ఇది బీఆర్ఎస్ పనేనని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తుండగా, నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఒకరిపైఒకరు ఆరోపణ, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఈ ఘటనపై మండలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, శిలా ఫలకాలను బీఆర్ఎస్ నాయకులే కూల్చారని నేరుగా ఆరోపించారు. సురేష్ నాయక్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము స్పందించారు. శిలాఫలకం ఎవరు కూల్చారో తెలుసుకోకుండా బీఆర్ఎస్‌పై బురదజల్లడం సరి కాదన్నారు. కూల్చేంత కర్మ బీఆర్ఎస్‌కు లేదన్నారు. కాంగ్రెస్‌లోనే రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకుంటున్న వాళ్లే కూల్చేసి ఉంటారని పేర్కొన్నారు. సురేష్ నాయక్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు అని ఎద్దేవా చేశారు.

● పాలకుర్తి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెక్‌డ్యాంల నిర్మాణానికి మంజూరైన నిధులను తాము మంజూరి చేసినట్లు కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని ఆ పార్టీ మండల కమిటీ విమర్శించింది. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషితో వల్మిడి, ముత్తారం గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి 2023లోనే నిధులు మంజూరు చేశారన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వమే మంజూరి చేసిందని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి గతంలో మంజూరైన ప్రొసీడింగ్‌ను మార్చి ఈ ప్రభుత్వంలోనే మంజూరైనట్లు కొత్త ప్రొసీడింగ్ ద్వారా నిధులు మంజూరి చేయించినట్లు శంకుస్థాపన చేశారని అన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, పుస్కూరి కళింగరావు, వీరమనేని సోమేశ్వర్‌రావు, గూడ దామోదర్, మహేందర్ నాయక్, గణేష్, కత్తి సైదులు, సోమయ్య, పంగ సైదులు, కర్ణాకర్‌రెడ్డి, పాము శ్రీనివాస్, కొంరెల్లి ఉన్నారు.


పాలకుర్తిలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


కేసముద్రం రైల్వేస్టేషన్ వద్ద వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన అయ్యప్ప మాలధారులు

# ప్రత్యేక రైళ్లు ఏవి 'స్వామి'?!

- శబరిమలకు వెళ్లేందుకు అందుబాటులో లేని స్పెషల్ ట్రైన్లు
- ఉమ్మడి జిల్లా నుంచి ఒకే ఒక్కరైలు
- మాలధారుల ఎదురుచూపులు

కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పమాల ధరించిన ప్రతిఒక్కరూ శబరిమలలోని స్వామివారిని దర్శించుకోవడం ప్రధానమైన అంశంగా భావిస్తారు. ఈ ప్రాంతం నుంచి శబరిమలకు వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది అయ్యప్ప మాలధారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కాలం (41 రోజులు) అయ్యప్ప దీక్షాపరులు శబరిమలకు వెళ్లి స్వామి దర్శనం చేసుకోవడమే దీక్షకు ముగింపని మాలధారుల నమ్మకం. శబరిమల యాత్రలో భక్తులకు సహనం, నియమాలు, కష్టపడడం, భక్తి, ఇతరుల పట్ల వినయం ఏర్పడి ఆధ్యాత్మిక అనుభవం వస్తుంది.

'స్వామియే శరణం అయ్యప్పా' అంటూ లక్షలాది మంది భక్తుల సమూహం వెళ్లడం కూడా ప్రత్యేక శక్తిని ఇస్తుందని భక్తులు నమ్ముతుంటారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఏటా మాలధారణ చేసిన వారు నవంబర్ 16 నుంచి డిసెంబర్ 27 వరకు నిర్వహించే మండల పూజా మహోత్సవం, డిసెంబర్ 30 నుంచి జనవరి 20 వరకు మకరవిళక్కు ఉత్సవం సందర్భంగా ఈ దర్శనాలు చేసుకునేందుకు ప్రధానంగా భావిస్తూ దీక్షాపరులు లక్షల మంది పోటెత్తుతారు. అత్యంత పవిత్రంగా భావిస్తూ ప్రత్యేకంగా మకర సంక్రాంతిన మకర జ్యోతి దర్శనం కోసం అయ్యప్పస్వాములతో శబరిమల కిక్కిరిసిపోతుంది.

ఈ ప్రాంతం నుంచి ఒకేఒక ప్రత్యేక రైలు

మహబూబాబాద్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది అయ్యప్ప మాలధారులు శబరిమలకు వెళ్లేందుకు ఈ ప్రాంతం మీదుగా రైల్వేశాఖ ఒకే ఒక్క రైలును నడుపుతోంది. చెర్లపల్లి నుంచి వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తిరుపతి మీదుగా కేరళకు సోమ, శుక్రవారాల్లో నడిచే చెర్లపల్లి-కొట్టాయం (07115/07116) ప్రత్యేక రైలు ఒక్కటే ఈ ప్రాంత భక్తులకు అందుబాటులో ఉంది. మిగతా రైళ్లన్నీ చెర్లపల్లి నుంచి నడికుడి జంక్షన్, గుంటూరు, తిరుపతి మీదుగా కేరళ వెళ్తున్నాయి.

వరంగల్, మహబూబాబాద్ నుంచి శబరిమలకు వెళ్లేందుకు కేరళలోని కొట్టాయం, చెంగనూరు రైల్వేస్టేషన్లకు భక్తులు చేరుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ అవుతుండగా ప్రత్యేక రైళ్లలో 15 నుంచి నెల రోజుల ముందు నుంచే రిజర్వేషన్ చేసుకునే అవకాశాన్ని ఇస్తున్నారు. ఈ నెల 16 నుంచి మండల పూజా మహోత్సవాలు ప్రారంభం కావడంతో భక్తులు శబరిమలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక రైళ్లు అందుబాటులో లేకపోవడంతో అయ్యప్ప మాలధారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖ మహబూబాబాద్ ప్రాంతం నుంచి ప్రత్యేక రైళ్లను నడపాలని అయ్యప్ప దీక్షాపరులు కోరుతున్నారు.

# వరంగల్ నగరాభివృద్ధికి కృషి

- ఎంపీ కడియం కావ్య
- ఉనికిచర్లలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం :
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధి కోసం అందరి సహకారంతో కృషి చేస్తున్నట్లు ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల నగర పంచాయతీలో కుడా యూనిసిటీ వెంచర్ అభివృద్ధి, రూ.10 కోట్లతో చేపడుతున్న డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ ఇప్పటికే నగరానికి ఎయిర్‌పోర్టు, కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్‌టైల్ పార్కు, స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు నగర ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అండర్ డ్రైయినేజీ నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.


ఉనికిచర్ల నగర పంచాయతీలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి తదితరులు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ వెంచర్ వరకు నిర్మించే నాలుగు లైన్ల బీటీ రోడ్డును ఉనికిచర్ల గ్రామం వరకు పొడిగించాలని కోరారు. ఇదే గ్రామంలో ఇంటర్ నేషనల్ క్రికెట్ స్టేడియం రాబోతుందన్నారు. భవిష్యత్‌లో ఈ రహదారిని ఉనికిచర్ల నుంచి రాపాకపల్లి, దేవునూర్ గుట్టల వరకు నిర్మించనున్నట్లు తెలిపారు. దేవునూర్ గుట్టలను ఎకో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రాంత ప్రజలు హాలీడేస్‌లలో సేద తీరేందుకు ఆక్సీజన్ పార్కు, ట్రెక్కింగ్, రాత్రి బస చేసేందుకు రిసార్ట్ వంటి సదుపాయాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, ప్రదీప్ కుమార్, రఘు, రాజు, మండల ఉపాధ్యక్షులు వక్కల రవీందర్, కందుకూరి సుధాకర్ పాల్గొన్నారు.

### స్పీకర్ నిర్ణయాకి కట్టుబడి ఉంటా..

రాజీనామా విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని బట్టి తన నిర్ణయం ఉంటుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నవంబరు 23 లోపు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చారన్నారు. దానిపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కలిసి కోరడం జరిగిందన్నారు. దీనిపై స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నట్లు వెల్లడించారు. ఉపఎన్నిక వస్తే పోటీ చేసేది కడియం శ్రీహరే.. ప్రజలు గెలిపించేది కూడా శ్రీహరినే.. అని ధీమా వ్యక్తం చేశారు.

# మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ

హసన్‌పర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన మానవ జీవితమే శ్రేష్ఠమైనదని, ప్రతీ విద్యార్థికి విలువలతో కూడిన విద్య అందించాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ అన్నారు. భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఆవరణలో 'విద్యార్థులకు చట్టాలపై అవగాహన - యువతపై ప్రభావం' అనే అంశంపై నార్కోటిక్స్, పీవోసీఎస్‌వో, యాంటీ ర్యాగింగ్, స్ట్రేస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచి భవిష్యత్తును పునర్నిర్మించుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చట్ట వ్యతిరేకమని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినమైన శిక్షలు ఉన్నందున ర్యాగింగ్‌కు పాల్పడి తమ ఉజ్వలమైన భవిష్యత్తును కోల్పోవద్దన్నారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, హనుమకొండ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.ఉషాక్రాంతి, హనుమకొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణ, ఎస్‌వీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ అజేంద్రకుమార్ రాథోడ్, కౌన్సిలర్ నీరజ, హెల్పింగ్ హ్యాండ్ ఎన్‌జీవో డి అడిక్షన్ కౌన్సిలర్ కె.రజిత మాట్లాడుతూ మానవుడు మనిషిలాగా జీవించగలిగితే ఈ సమాజంలో పోలీసు స్టేషన్లు, కోర్టులు, రాజకీయ నాయకుల అవసరం ఉండదన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె.పూజిత మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎటువంటి న్యాయ సలహాలకైనా, సమస్యలున్నవారు 15100 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు, వైస్ చైర్మన్ డాక్టర్ ఇ.సువర్ణ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

# శుభకార్యాలకు విరామం



- 3 నెలల పాటు ముహూర్తాలు నిల్
- ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యం
- 83 రోజుల తర్వాతే ఫంక్షన్లు

వెంకటాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి.. ఖర్మ కాలాలు లేదా మౌఢ్య సమయాలు లాంటివి జ్యోతిష్య శాస్త్రం ద్వారా వినిపించే మాటలు.. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభముహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల మార్గశిర శుద్ధ సప్తమి 28న ప్రారంభం కానున్న శుక్ర మౌఢ్యమి (మూఢం) మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభకార్యాలకు సెలవు ప్రకటించాల్సిందే.

### పవిత్ర తిథులు..

మార్గశిర, మాఘ, పాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ సారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు మాత్రమే ఉండగా, పుష్య మాసం శూన్యమాసం అవుతుంది. ఇక మాఘ మాసంలోనూ ఒక్క ముహూర్తం లేకపోవడం గమనార్హం. గృహప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘీగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈ సారి మూఢంలోనే కలిసిపోతున్నాయి.



### ఒక్క ముహూర్తం లేదు..

**ఎం. రఘునాథచార్యులు, పురోహితుడు**



ఈ నెల 28 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభకార్యాలకు మంచి రోజులు లేవు. శుక్ర మౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. వివాహాలతో పాటు గృహప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు, ఆఖరికి వరపూజల వంటి కార్యాలు కూడా చేసుకోకూడదు. వైదిక పురోహితులకు ఈ మూడు నెలలు గడ్డుకాలమే.

### వ్యాపారాలపై ప్రభావం

శుభకార్యాలు లేకుంటే వివాహ మండపాలు, ఫంక్షన్‌హాళ్లు, వస్త్రదుకాణాలు, నగల షాపుల యజమానులు, స్వర్ణకారులు, క్యాటరింగ్, డెకరేషన్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజే, అద్దె కార్లు, బస్సులు వంటి సంబంధిత రంగాల వ్యాపారులు నెలల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

### మూఢం అంటే..

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగై పోవడాన్ని మూఢం అంటారు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో, శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. శుక్రుడు బలహీనమైతే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వం వంటి విషయాల్లో ప్రతికూలతలు ఏర్పడుతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

# ప్రపంచంలో ప్రతి విద్యార్థి అద్భుతమైన శక్తే

- నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి
- వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హసన్‌పర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ప్రతి విద్యార్థి ఒక అద్భుతమైన శక్తేనని, తనలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకోగలిగితే గొప్ప వ్యక్తిగా రాణించగలడని వరంగల్ నిట్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. మండలంలోని ఎర్రగట్టు గుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్లే ఫీల్డ్‌లో ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన కిట్స్ 8వ అటానమస్ 2021-25 బ్యాచ్ 42వ యాన్యువల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా వరంగల్ నిట్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ది అగస్టు, గౌరవ అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, కిట్స్ గవర్నింగ్ బాడీ చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, కిట్స్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే వి.సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అకాడమిక్ అండ్ కో కరికులర్ ఆక్టివిటీలలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన 16 మంది విద్యార్థులకు బంగారు పతకాలను, 15 అకాడమిక్ మెరిట్ అవార్డులు, డిగ్రీలు, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ గ్రాండ్ ఆంట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ రిజిస్ట్రార్ ఎం.కోమల్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ వి.రాజగోపాల్, అకాడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె.వేణుమాధవ్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎస్.ఉమామహేశ్వర్, డాక్టర్ డి.రాజయ్య, యూజీ కోర్సు ల ఇన్‌చార్జి ఫ్యాకల్టీ డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, పీజీ కోర్సుల ఇన్ చార్జి ఫ్యాకల్టీ డాక్టర్ ఆర్.శ్రీకాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ డి.ప్రభాకరచారి, వి.కిషన్‌రావు, వెంకట్రాంరెడ్డి, దేవీప్రసాద్, ఎ.సత్యనారాయణరాజు, డాక్టర్ వి.పవన్, కె.ప్రతాప్‌రెడ్డి, ఎ.హరీష్, వి.శ్రీరాంరావు, వివిధ విభాగాధిపతులు, డీన్స్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పంచాయతీ రిజర్వేషన్లపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

ఎంపీడీవోలు మిగిలిన రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి ఆయా ప్రతులను సంతకాలు చేసి డీపీవోకు అందజేస్తారు. వీటిని కలెక్టర్ పునఃపరిశీలించి ఎన్నికల షెడ్యూల్‌ను బట్టి గెజిట్‌లో అధికారికంగా ప్రకటిస్తారు.

### గిరిజన గ్రామాల్లో..

మహబూబాబాద్, ములుగు జిల్లాలో గిరిజన గ్రామాలే ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి గిరిజన గ్రామాలు ఎక్కువ ఉన్న జిల్లాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేస్తారు. మిగిలిన పంచాయతీలను ఎస్టీ ఎస్సీ బీసీ, జనరల్‌కు రిజర్వు చేయాల్సి ఉంటుంది. వీటిల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించినవి పోను మిగిలిన వాటిని డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఖరారు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### ముమ్మరంగా ఏర్పాట్లు

ఒక పక్క రిజర్వేషన్ల ఖారారుకు కసరత్తు జరుగుతుండగా మరో పక్క ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు జోరందుకున్నాయి. ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడే అవకాశాలు ఉండడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. తప్పులు సరవరించిన పల్లె ఓటర్ల తుది జాబితాను ఈ నెల 23వ తేదీన విడుదల చేయనున్నారు. ఇప్పటికే అవసరమైన బ్యాలెట్ పెట్టెలను అందుబాటులోకి తెచ్చారు. ముద్రణ సామగ్రిని గతంలోనే సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించారు. అవసరమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ దాదాపు పూర్తి కావచ్చింది. తాజాగా కలెక్టర్లు నోడల్ అధికారులను కూడా నియమించారు.

## బిషప్ జాన్ మార్కండేయకు సన్మానం

కాజీపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలోని చౌరస్తా స్టేడియంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆశీర్వాద పండుగలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అల్ఫా ఓ మెగా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు, బిషప్ జి.జాన్‌మార్కండేయ మాట్లాడుతూ.. దేవుడి సేవలో 40 ఏళ్ల పూర్తి చేసుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. బైబిల్ మిషన్ వ్యవస్థాపకుడు సంజీవరావు హాజరై బిషప్ జాన్ మార్కండేయ సేవలను కొనియాడారు. ఆ తర్వాత బిషప్‌ను జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ డైరెక్టర్ నిఖిల్ జాన్, డాక్టర్ రోజ్‌మేరీ, డాక్టర్ దీనమ్మ, సంఘ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బిషప్ జాన్ మార్కండేయకు మెమెంటో ఇస్తున్న సంజీవరావు తదితరులు

# ఘనంగా వినయ్‌భాస్కర్ జన్మదిన వేడుకలు

### కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస వేడుకలు నిర్వహించారు. అనంతరం గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం వినయ్‌భాస్కర్ మొక్కలు నాటారు. ఆర్కే నరేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు వినయ్‌భాస్కర్ చేతుల మీదుగా అందజేశారు. బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ గేట్ ఎదురుగా కేట్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేసి టపాసులు కాల్చి వేడుకలు నిర్వహించారు. వేయిస్తంభాల దేవాలయంలో పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో రుద్రేశ్వరుడికి వినయ్‌భాస్కర్ గోత్రనామాలతో అర్చన, అభిషేకాలు చేశారు. 30వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు దోమకుంట్ల సంతోష్ నిరాశ్రయులైన వారికి దుప్పట్లను పంపిణీ చేశారు.



బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వినయ్‌భాస్కర్

29వ డివిజన్ అధ్యక్షుడు సదాంత్ నిత్యవసర సరుకులు పంపిణీ చేసి విజయవాడలో గుణదల చర్చి వద్ద 1000 మెట్ల మోకాళ్ల యాత్ర చేశారు. 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో కొత్తూరుజెండా ప్రాంతంలో కేక్ కట్ చేశారు. 8వ డివిజన్ నాయకుడు పానుగంటి శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. 29, 11వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు భద్రకాళి దేవాలయం ఎదుట అన్నదాన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు తాళ్లపెల్లి జనార్దన్‌గౌడ్, బుద్దె వెంకన్న, తక్కళ్లపల్లి వినీల్‌రావు, 31వ డివిజన్ మాజీ అధ్యక్షుడు వేల్పుల వేణుగోపాల్, చాగంటి రమేష్, తుపాకుల రవి, ఆరూరి రంజిత్, జి. రాజేష్‌యాదవ్, కందికొండ తిరుపతి, పస్తం అనిల్, ప్రశాంత్, రాజేష్, సోషల్ మీడియా అధ్యక్షుడు బుర్ర మహేష్, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాజీపేట:** మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, తెలంగాణ ఉద్యమకారుడు మిట్టపల్లి రవీందర్‌ల జన్మదిన వేడుకలను శనివారం కాజీపేట చౌరస్తాలో స్థానిక బీఆర్ఎస్ నేతలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేయడంతోపాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్‌రావు, 47, 61, 62 డివిజన్ల అధ్యక్షులు పాలడుగుల శివ, బెదరకోట రంజిత్‌కుమార్, దువ్వ కనుకరాజ్, నాయకులు సుంచు కృష్ణ, నార్లగిరి రమేశ్, కాటాపూర్ రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నవచేతన బుక్ హౌస్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న పాఠకులు

## ఆకట్టుకుంటున్న నవచేతన పుస్తక ప్రదర్శన

హనుమకొండ చౌరస్తా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అశోకా కాంప్లెక్స్‌లోని నవచేతన బుక్‌హౌస్ ఆధ్వర్యంలో చేపట్టిన పుస్తక ప్రదర్శన శనివారం పుస్తక ప్రియులతో కళకళలాడింది. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 5న ప్రారంభించిన పుస్తక ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకర్షించిందని బుక్‌హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శన ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని, 10నుంచి 40శాతం వరకు తగ్గింపు ధరలతో పుస్తకాలను విక్రయిస్తున్నామని నాగరాజు కోరారు.

## క్రికెట్ పోటీల్లో షైన్‌కు చాంపియన్‌షిప్



చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న షైన్ పాఠశాల జట్టు

రాంనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ క్రికెట్ కాంపిటీషన్‌లో హనుమకొండ, వరంగల్ నుంచి 24 కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా షైన్ పాఠశాల టీపీఎస్‌టీ- 10 క్రికెట్ చాంపియన్‌షిప్-2025ను కైవసం చేసుకుంది. ఐదు మ్యాచ్‌లో విజయం సాధించడంతో పాటు మ్యాన్ ఆఫ్ ద సీరిస్‌ను కైవసం చేసుకుంది. అదే విధంగా రాంనగర్‌లోని షైన్ బ్రాంచ్ హనుమకొండ రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షైన్ హంటర్‌రోడ్డు పాఠశాల ప్రిన్సిపాల్ పి.విశాల్, పీఈటీ టి. వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణంరాజు



వడ్డేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 56వ డివిజన్ గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన అలుగునూరి కృష్ణంరాజు బీసీ ఐక్య సంఘర్షణ సమితి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని ఆదేశం మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, హనుమకొండ జిల్లాలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అలుగునూరి కృష్ణంరాజు పేర్కొన్నారు.

## లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

### సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భానునాయక్



అంబేద్కర్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న భానునాయక్

వడ్డెపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ (ట్రాన్స్‌పోర్ట్ రంగం) జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ భానునాయక్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ జంక్షన్‌లో ఆటో కార్మికుల అడ్డాలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల వలన కార్మికుల హక్కులకు విఘాతం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు బానోత్ మంజీలాల్ నాయక్, గుగులోత్ హన్మంతు, మోహన్, రవీందర్ నాయక్, జాను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

వరంగల్‌సిటీ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గ పోచమ్మదేవాలయంలో శనివారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఎండోమెంట్ అధికారులు అనిల్, శేషగిరి ఆధ్వర్యంలో కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ సమక్షంలో లెక్కించగా మొత్తం రూ.8,30,052ల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో చింత కృష్ణ, కె.కుమారస్వామి, శోభ, రమాదేవి, కిషన్, జ్యోతి, కవిత, వరలక్ష్మి, సాంబలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి ఆత్మహత్య

మడికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన కాజీపేట మండలం కుమ్మరిగూడెంలో శనివారం చోటుచేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి పైడిపాల పెద్దులు భార్య పైడిపాల కమలమ్మ(65) కడుపు నొప్పితో బాధపడుతోంది. గురువారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. భర్త పెద్దులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## డీసీసీ పీఠంపై 'ఇనుగాల'

(5వ పేజీ తరువాయి)

అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులకు కృతజ్ఞతలు.

**బయోడేటా**

**పేరు** : ఇనుగాల వెంకట్రాం రెడ్డి
**తండ్రి పేరు** : అమరేందర్ రెడ్డి
**సొంత ఊరు** : ఆత్మకూరు
**పుట్టిన తేదీ** : 06-09-1968
**సామాజిక వర్గం** : రెడ్డి
**విద్యార్హతలు** : పీజీ, డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్

**రాజకీయ జీవితం**

- ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల నిర్వహణ
- 2014లో పరకాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు.
- 2019లో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నిక

## డిసెంబరు 3న రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశం డిసెంబరు 3న హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పి. విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కార్యక్రమ నిర్వహణపై చర్చించడానికి రెడ్‌క్రాస్ భవన్‌లో పాలక వర్గం సభ్యులు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు, జిల్లా పాలక వర్గ సభ్యుడు పి. వేణుగోపాల్, మాగంటి శేషు మాధవ్, పొట్లపల్లి శ్రీనివాసరావు, చెన్నమనేని జయశ్రీ, బి. రమణారెడ్డి పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలను మూసివేయాలి

### వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని హనుమకొండ జిల్లా పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థలను మూసివేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఎఫ్ఆర్‌సీతో సంబంధం లేకుండా యేటా 10 నుంచి 15 శాతం ఫీజులు పెంచుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని తెలిపారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు, రాష్ట్రప్రభుత్వం స్పందించి వసూలు చేసిన ఫీజులన్నింటిపై ఆడిట్ చేయించాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి హకీం నవీద్, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహరావు, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉన్నతి సంస్థతో ఆర్ట్స్ కళాశాల ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను చూపిస్తున్న ఉన్నతి సంస్థ బాధ్యులు, ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల ఉన్నతి సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నామని ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి తెలిపారు. శనివారం సంస్థ ప్రతినిధులతో ఎంవోయూపై సంతకాలు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెంగుళూరు ఆధారిత కంపెనీ ఉన్నతితో కళాశాల విద్యార్థులకు వివిధ రకాల సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ పొందే అవకాశం ఉందన్నారు. ఈ ఎంవోయూ ఒక సంవత్సర కాలంపాటు చెల్లుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ రఘువర్మ, కాలేజ్ ట్రైనింగ్ ఆఫీసర్ జితేందర్, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ తదితరలు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కంగన్‌హాల్ దగ్ధం

నర్సంపేట టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ సంభవించి ఓ కంగన్ హాల్ దగ్ధమైంది. బాధితుడు ముదురు కోళ్ల రాజేందర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నర్సంపేట పట్టణానికి చెందిన నిరుపేద ముదురు కోళ్ల రాజేందర్‌కు తన స్నేహితులు ఆర్థికసాయం చేసి జీవనోపాధి కోసం పోలీస్‌స్టేషన్ సమీపంలో సంవత్సరం కిందట సుధా కంగన్‌హాల్ పెట్టించారు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి కంగన్ హాల్‌ను పది గంటల ప్రాంతంలో మూసి వేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి పదకొండు గంటల సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించి కంగన్‌హాల్ పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న బాధితుడు అక్కడికి వచ్చేలోపే షాపులో రూ.5 లక్షల విలువైన దుస్తులు, గాజులు దగ్ధమయ్యాయి. అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ ఘటనతో రాజేందర్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

## ఉచిత స్పీచ్ థెరపీ సేవలు

హనుమకొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో శనివారం కేసీ ఫౌండేషన్ అండ్ ఆసమ్ డూడుల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ క్లినిక్ ఆధ్వర్యంలో మానసిక విద్యార్థులకు ఉచిత స్పీచ్ థెరపీ, అక్యూపేషనల్ థెరపీ అందించినట్లు కేసీ ఫౌండేషన్ స్థాపకురాలు డాక్టర్ లీనా తెలిపారు. ఈ సందర్భంగా లీనా మాట్లాడుతూ.. మల్లికాంబ మనోవికాస కేంద్రంలో 18 ఏళ్లలోపు చిన్నారులకు ఈ థెరపీ సేవలను అందిస్తామన్నారు. పిల్లల్లో స్పష్టమైన పురోగతి సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండ రామలీల, కోడం కల్యాణ్, ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అంకు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో స్పీచ్ థెరపీ అందిస్తున్న నిర్వాహకులు

## షైన్ స్కూల్‌లో ముగిసిన రోబోటిక్ వర్క్‌షాప్



రోబోటిక్ వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

రాంనగర్, నవంబరు 22 (ఆంధజ్యోతి): షైన్ ఉన్నత పాఠశాలలో 3 రోజులుగా నిర్వహిస్తున్న రోబోటిక్ వర్క్‌షాప్ శనివారం విజయవంతంగా ముగిసింది. మొదటిరోజు థియరీ పార్ట్‌తో 'రోబో తయారీ - దాని పనితనం'పై అవగాహన సదస్సు, రెండోరోజు పిల్లలతో స్వయంగా రోబో తయారీపై ప్రాక్టికల్స్, మూడోరోజు డోమ్ వీక్షణతో వర్క్‌షాపు ముగిసింది. ఈ సందర్భంగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మానవ సమాజం అంతా సైన్స్‌తోనే పోటీపడాల్సి ఉంటుందన్నారు. కాబట్టి అందుకు తగట్టు విద్యార్థులు తయారై ఉండాలని వివరించారు. విజ్ఞానం అంటే కేవలం పుస్తకాలు మాత్రమే కాదు, సాంకేతిక పరిజ్ఞానం కూడా అలవర్చుకోవాలని తెలియజేశారు. ఈ పోటీ ప్రపంచంలో షైన్ విద్యార్థులు మొదటి వరుసలో ఉండాలని ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. విజయవంతంగా వర్క్‌షాపును నిర్వహించిన పాఠశాల ప్రిన్సిపాల్ ప్రగతిరెడ్డిని అభినందించారు.

## మానసిక దివ్యాంగులకు వైద్య శిబిరం



దివ్యాంగ పిల్లలను పరీక్షిస్తున్న వైద్యులు

బాలసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో డాక్టర్ అనితారెడ్డి అధ్యక్షతన స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని మానసిక వైద్య నిపుణులతో నిర్వహించారు. వైద్యులు సగ్నిక్ ముఖర్జీ, పార్థిబమ్ దివ్యాంగ పిల్లలను పరీక్షించి మందులు అందించారు. పిల్లల బిహేవియర్ థెరపీకి సంబంధించిన సూచనలు, సలహాలు ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు మానసిక దివ్యాంగుల కోసం శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అనితారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగ ఆశ్రమాల్లో ఉంటున్న పేద అనాథ పిల్లలకు మానసిక వైద్యులతో చికిత్స అందిస్తే మార్పును తీసుకురావచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు సుచరిత, వసుధ, హరిత, భార్గవి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పక్షపాతి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

### టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ



వడ్డెపల్లిలో మాట్లాడుతున్న పెరుమాండ్ల రామకృష్ణ

వడ్డెపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దళితుల పక్షపాతి అని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం హనుమకొండ వడ్డెపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రతినిధి తాళ్లపెల్లి విజయ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులకు శ్మశానవాటికకు భూమి లేకపోవడంతో మూడెకరాలు కేటాయించిన ఘనత ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికే దక్కిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, తాటికొండ రాజయ్య, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యే నాయినిపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తాళ్లపెల్లి విజయ్, దుప్పటి కోటి, ప్రసన్నకుమార్, భాస్కర్, రాజేందర్, పోచయ్య, కృష్ణ, వెంకట్, రమేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే నాయినిపై దుష్ప్రచారం మానుకోవాలి

**- మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా**

హనుమకొండ సిటీ (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు బోడ డిన్నా హితవు పలికారు. శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయిని రాజేందర్‌రెడ్డికి దళితులపట్ల ఎంతో గౌరవం ఉందన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురించి నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వినయ్‌భాస్కర్ వక్రీకరించి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నాడని ఆరోపించారు. దళితులను అణచివేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి టి.రాజయ్యను తొలగిస్తే వినయ్‌భాస్కర్ ఎందుకు నోరు తెరువలేదని ప్రశ్నించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వినయ్ భాస్కర్ డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, డాక్టర్ సెల్ చైర్మన్ శ్రీవణ్‌కుమార్‌తో పాటు ఎంవీ రాజు, తాళ్లపల్లి రవీందర్, మేరీ, తాళ్లపల్లి సుధాకర్, సంగీత్, సుకన్య, శ్వేత తదితర కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



డీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న బోడ డిన్నా

సండే సెలబ్రిటీ



హిందీ సినిమాలు.. ఓటీటీలపై ఆసక్తి ఉన్నవారికి పరిచయం అవసరం లేని నటుడు మనోజ్ బాజ్‌పేయ్. సినీ రంగంలో విభిన్నమైన నటుడిగా విమర్శకుల ప్రశంసలు అందుకున్న మనోజ్ నటించిన 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ మూడో సీజన్ అమెజాన్ ప్రైమ్‌లో విడుదలయింది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ.

# ఫ్యామిలీ మ్యాన్ జీవితాల్లో భాగమైపోయింది

**'ఫ్యామిలీ మ్యాన్' కొత్త సీజన్‌కు రెస్పాన్స్ ఎలా ఉంది?**

చాలా బావుంది. శుక్రవారం విడుదలయిన దగ్గర నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన అనూహ్యం. గత మూడు రోజులుగా ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో ఉన్నాం. ఇంకా చూడనివారు అనేక ఉంది ఉన్నారు. వారి స్పందన కూడా త్వరలో తెలుస్తుంది.

**'ఫ్యామిలీ మ్యాన్ తొలి సీజన్ విడుదలయినప్పుడు- ఆ సిరీస్ అంత హిట్ అవుతుందని అనుకున్నారా?**

అనుకోలేదు. అయితే ఇక్కడ ఒక విషయం మీకు చెబుతాను. నేను ఒక సినిమా లేదా వెబ్ సిరీస్‌లలో నటించినప్పుడు అది హిట్ అవుతుందా లేదా అనే విషయాన్ని ఆలోచించను. ఆ పాత్ర నాకు నచ్చిందా లేదా అనే విషయాన్నే పరిగణనలోకి తీసుకుంటా. 'ఫ్యామిలీ మ్యాన్'లో నా పాత్ర నాకు చాలా నచ్చింది. అయితే ఈ సిరీస్ ఇంత విజయం సాధిస్తుందనే విషయం మాకు తెలియదు. చాలా మంది ప్రేక్షకులు- దీనిని ఒక సిరీస్‌గా చూడటంలేదు. వారి జీవితాల్లో ఒక భాగంగా చూస్తున్నారు. వారి జీవితాల్లో జరిగిన సంఘటనలుగా భావిస్తున్నారు. ప్రేక్షకుల నుంచి ఈ తరహా స్పందన రావటం చాలా అరుదు. ఏదో ఒక శక్తి మాకు సాయం చేయకపోతే ఇలాంటి విజయం లభించదు.

**ఈ మధ్యనే 'సత్య' సినిమా రీరిలీజ్ కూడా అయింది. వెనక్కి తిరిగి చూస్తే ఎలా అనిపిస్తోంది?**

'సత్య' నా నట జీవితాన్ని మలుపు తిప్పిందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఇక రాము విషయానికి వస్తే- ఆయన నాకు మార్గదర్శిలాంటివాడు. నాకు వృత్తిజీవితాన్ని ప్రసాదించిన వ్యక్తి. ఒక నటుడిగా నన్ను ఎలా ఉపయోగించుకోవాలో రాముకు తెలిసినంతగా ఇంకెవ్వరికీ తెలియదు. ఇప్పుడు మళ్లీ రాముతో కలిపి ఒక కొత్త సినిమా చేస్తున్నాను. ఇక్కడ ఇంకో విషయాన్ని పంచుకోవాలి. ఒకప్పటికి ఇప్పటికీ రాములో ఒక పరివర్తన వచ్చింది. రాము 2.0 కొత్త మ్యాజిక్ క్రియేట్ చేస్తాడనుకుంటున్నా. బహుశా అలాంటి మ్యాజిక్ మన భారతీయ సినీ రంగంలో జరిగి ఉండదు.

**మీరు ఇప్పటిదాకా చేసిన పాత్రల్లో అత్యంత క్లిష్టమైనది ఏది?**

ప్రతి పాత్రా కష్టమైనదే! ఎందుకంటే సాధారణమైన పాత్రలు చేయటానికి నేను ఇష్టపడను. నాకు సవాల్ విసిరే పాత్రల్లో నటించినటానికే ప్రాధాన్యత ఇస్తాను. నా నట జీవితం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి దాకా నేను ఇలాగే ఉన్నా! ఈ క్రమంలో అనేక సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయి. వాటిని ఎదుర్కోవటం నాకొక సరదా! అదే నా జీవన విధానం.



**మీ స్క్రిప్ట్స్‌ను ఎలా ఎంపిక చేసుకుంటారు?**

నిజం చెప్పనా! నేను పెద్దగా ఆలోచించి పాత్రలను ఎంపిక చేసుకోను. నా దగ్గరకు వచ్చిన స్క్రిప్ట్‌లు వింటూ ఉంటా. హఠాత్తుగా ఒక స్క్రిప్ట్ నచ్చుతుంది. అది మిగిలిన వాటికన్నా భిన్నంగా ఉంటుంది. అలాంటి సినిమాలు చేస్తా!

**ఒక నటుడిగా మీకు సమాజంలో వస్తున్న మార్పులు ఎలా తెలుస్తూ ఉంటాయి?**

నేను విపరీతంగా పుస్తకాలు.. పేపర్లు.. మ్యాగిజైన్లు చదువుతాను. నా చుట్టూ ఉన్న సమాజంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటా. అంటే నేను ఏదో పనిగట్టుకొని ఈ పని చేస్తానని కాదు. ఇదంతా నా జీవితంలో ఒక భాగం.

**ప్రస్తుతం మన సమాజంలో వస్తున్న మార్పులపై మీ అభిప్రాయం?**

ప్రస్తుతం యువతీయువకుల సంఖ్య ఎక్కువగా ఉంది. వారి అభిప్రాయాలు.. అభిరుచులు.. భావోద్వేగాలు ఎప్పటికప్పుడు వేగంగా మారిపోతున్నాయి. ఈ క్రమంలో అనేక సంఘర్షణలు ఏర్పడుతున్నాయి. వాస్తవానికి వీటిని ఒడిసిపట్టుకోవటం చాలా కష్టం. అయితే ఒక నటుడికి వీటన్నింటి గురించి తెలియాల్సిన అవసరం ఉంది. అందువల్ల ఈ మార్పులను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి.

**మీరు బాలీవుడ్ సినిమాల్లోనే ఎక్కువగా కనిపిస్తారు. ప్రాంతీయ భాషా సినిమాలు ఎందుకు చేయటం లేదు?**

గతంలో చేశాను. నాలుగు తెలుగు సినిమాలు.. రెండు తమిళ సినిమాలు చేశాను. అయితే నాకు ఈ భాషలు రావు. భాష తెలియనప్పుడు భావోద్వేగాలు సరిగ్గా పలకవు. అందువల్లే నేను ప్రాంతీయ భాషల్లో ఎక్కువగా నటించటం లేదు. ఇక మీరు 'బాలీవుడ్' అన్నారు. నా ఉద్దేశంలో బాలీవుడ్ వేరు. హిందీ సినిమాలు వేరు. నేను హిందీ సినిమాల్లో నటిస్తాను. కమర్షియల్ సినిమాల్లో తక్కువ నటిస్తాను. అందువల్ల నేను బాలీవుడ్ నటుడిని కూడా కాదు.

**ఓటీటీలపై మీ అభిప్రాయమేమిటి? వీటి వల్ల ప్రేక్షకుల్లో మార్పు వచ్చిందా?**

గత నాలుగైదు ఏళ్లగా ఓటీటీ ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు సినిమా నిర్మాణంపై కూడా దీని ప్రభావం పడుతోంది. ప్రేక్షకులు కొత్తదనం కోరుకుంటున్నారు. దీనికి తగ్గట్టుగా సినిమాలు తీయాల్సిన బాధ్యత డైరెక్టర్లపై పడుతోంది. అంతే కాకుండా- దేనిని ఓటీటీలలో చూడాలి.. దేనిని థియేటర్లలో చూడాలనే విషయంలో ప్రేక్షకులు స్పష్టమైన అంచనాలకు వస్తున్నారు. ఈ కోణం నుంచి చూస్తే- నిర్మాతలకు ఓటీటీలు సవాల్ విసురుతున్నట్లే!

• సీవీఎల్ఎన్ ప్రసాద్

## ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|
| నెట్‌ఫ్లిక్స్ | | |
| జింగిల్ బెల్ హైస్ట్ | హాలీవుడ్ మూవీ | నవంబర్ 26 |
| స్ట్రేంజర్ థింగ్స్ 5 | వెబ్‌సిరీస్ | నవంబర్ 26 |
| అమెజాన్ ప్రైమ్ | | |
| గుడ్ స్పోర్ట్స్ | వెబ్‌సిరీస్ | నవంబర్ 25 |
| జియో హాట్‌స్టార్ | | |
| బోర్న్ హంగ్రీ | హాలీవుడ్ మూవీ | నవంబర్ 28 |










# పులుగుర్తకు పూర్వ వైభవం


నూలు నుంచి రంగురంగుల వస్త్రాలను తయారుచేసే ఘనత మన చేనేత కార్మికులకే దక్కుతుంది. అలాంటి ఒక కళ- తూర్పుగోదావరి జిల్లాలోని పులుగుర్తలో ఇప్పటికీ పరిఢవిల్లుతోంది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి లోకేష్ పులుగుర్త జాకెట్ వేసుకొని అందరినీ ఆకర్షించారు. ఈ జాకెట్ గురించి ఆయన చేసిన ట్వీట్‌తో పులుగుర్త చేనేతల గురించి ఆసక్తి నెలకొంది.

మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందే పులుగుర్త చేనేత సహకార సొసైటీ ఏర్పడింది. అప్పటి నుంచి అనేక ఉత్థానపతనాలు చూసిన ఈ సొసైటీ ఇప్పుడు లాభాల బాటలో పయనిస్తోంది. ప్రస్తుతం ఈ సొసైటీలో 450 కుటుంబాలు భాగస్వాములుగా ఉన్నాయి. పులుగుర్తకు మరొక ప్రత్యేకత కూడా ఉంది. సాధారణంగా ఒక ప్రాంతంలో ఒక రకమైన చేనేతలే ప్రసిద్ధి పొందుతాయి. ఉదాహరణకు ఉప్పాడ, మంగళగిరి, గద్వాల్ లాంటి ప్రాంతాలు కేవలం చీరలకే ప్రసిద్ధి. ఇతర రకాలమీద వారు పెద్దగా శ్రద్ధ పెట్టరు. కానీ ఇక్కడ చీరల నుంచి హ్యాండ్ కర్చీఫ్‌ల వరకు ఎన్నో రకాలు తయారుచేస్తూ ఉంటారు. మల్కా, జకార్డు, కుప్పటం, బుటా లాంటి చీరల రకాలు ఇక్కడ లభిస్తాయి. కేవలం చీరలు మాత్రమే కాకుండా పురుషులు ధరించే జాకెట్ కోట్‌లు, పంచెలు, కండువాలు, అంగవస్త్రాలు లాంటివి కూడా తయారవుతూ ఉంటాయి.

### జాతీయ స్థాయి గుర్తింపు

పులగుర్త సొసైటీ - తమ సభ్యులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ ఉంటుంది. చాలామంది సభ్యులు సొసైటీ నుంచి నూలు తెచ్చుకొని వస్త్రాలు నేసి తిరిగి సొసైటీకి అప్పగిస్తూ ఉంటారు. చీరల డిజైన్ల ఆధారంగా వీరికి వేతనాన్ని నిర్ణయిస్తారు. ఈ వృత్తిలోకి రావాలనుకొనే యువతీ యువకులకు సొసైటీ శిక్షణ అందిస్తోంది. వీరికి ఉపకారవేతనం కూడా ఇస్తారు. ఐఏఎస్ ట్రైనీలు తూర్పుగోదావరి జిల్లాకు వచ్చినప్పుడు ఈ సొసైటీని సందర్శించటం ఒక ఆనవాయితీగా వస్తోంది. దీనితో జాతీయ స్థాయిలో కూడా పులుగుర్త చేనేతల గురించి తెలుసు. ఈ మధ్య కాలంలో తూర్పుగోదావరి జిల్లాను సందర్శించే వీఐపీలకు పులుగుర్త జాకెట్ కోట్‌లను బహుమతిగా ఇస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రి లోకేష్ సీఐఐ సమ్మిట్‌లో ఈ కోట్‌ను ధరించారు. దీనితో దేశవ్యాప్తంగా పులుగుర్త చేనేతలపై ఆసక్తి పెరిగింది.

• కర్రి శ్రీనివాసరెడ్డి, అనపర్తి



రాజసాన్ని ఒలికిస్తూ విక్టోరియన్ హారాలు, నెక్లెస్‌లు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. భారీ పెండెంట్లు వీటి ప్రత్యేకత. విభిన్నమైన డిజైన్లతో రూపొందించిన సింగిల్, డబుల్, మల్టీ లేయర్డ్ హారాలను అమ్మాయిలు పోటీపడి మరీ కొనుక్కుంటున్నారు. ఫంక్షన్లు, పార్టీలు లాంటి ప్రత్యేక సందర్భాల్లో.. బాలికలు, యువతులే కాదు మధ్య వయసు మహిళలు కూడా విక్టోరియన్ నెక్లెస్‌లు ధరించి సందడి చేస్తున్నారు. అంతలా అన్ని వర్గాలవారినీ ఆకర్షిస్తున్న ఈ విక్టోరియన్ హారాలు, నెక్లెస్‌లపై ఓ లుక్కేద్దామా!

# వయ్యారాల 'విక్టోరియా'



పందొమ్మిదో శతాబ్దంలో బ్రిటిష్ జ్యువెలరీ డిజైనర్లకు భారతీయ సంప్రదాయ హస్తకళలను జోడించి సరికొత్త శైలిలో ఆభరణాలను రూపొందించారు. వీటిలో పలు వరుసలతో కూడి హారాన్ని తలపించే నెక్లెస్‌లు బాగా ప్రాచుర్యం పొందాయి. పెద్ద లాకెట్‌తో గ్రాండ్‌గా కనిపించే నెక్లెస్‌ను విక్టోరియా రాణి ఇష్టంగా ధరించేవారు. అప్పటి నుంచి దీనికి విక్టోరియన్ నెక్లెస్, విక్టోరియన్ హారం అనే పేర్లు స్థిరపడ్డాయి. క్రమంగా దీనికి మ్యాచ్ అయ్యేలా చెవి దిద్దులు లేదా జుంకాలు, పాపిడి బిళ్ల, వడ్డాణం, గాజులు వాడుకలోకి వచ్చేశాయి. పేరులోనే దర్పాన్ని నింపుకున్న ఈ ఆభరణాలను బంగారం, వెండి, బేస్ మెటల్స్‌తో తయారుచేస్తారు. మారుతున్న పోకడలను దృష్టిలో ఉంచుకుని వినూత్నమైన డిజైన్లకు శ్రీకారం చుట్టారు డిజైనర్లు. అరుదైన రత్నాలు, వజ్రాలు, ముత్యాలు, రంగురంగుల బీడ్స్, కుందనాలు, అమెరికన్ డైమండ్స్ ఉపయోగిస్తూ ఆకర్షణీయమైన పెండెంట్లతో విక్టోరియన్ హారాలను రూపొందిస్తున్నారు. ఏదైనా పెద్ద సైజు రత్నం (కెంపు, పచ్చ, నీలం, వజ్రం), ఏనుగు, నెమలి, హంస, వినాయకుడు, అష్టలక్ష్ములు, రాధా కృష్ణులు, రామ పరివారం లాంటి పెండెంట్లు ఉన్న నెక్లెస్‌లు, హారాలను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అలాగే పూల డిజైన్లు, జ్యామితి నమూనాలను కూడా ఆదరిస్తున్నారు.



మల్టీ లేయర్డ్ విక్టోరియన్ హారాలు.. వరుసకో పెండెంట్‌తో చాలా గ్రాండ్‌గా కనిపిస్తాయి. మెడలో ఈ హారం ఒక్కటి వేసుకుంటే చాలు మరే ఇతర నెక్లెస్, చోకర్, పొడవాటి గొలుసుల అవసరం ఉండదు. పెళ్లి కూతురి అలంకరణలో ఈ విక్టోరియన్ హారం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సింగిల్, డబుల్ లేయర్డ్ హారాలు డిజైన్‌ను అనుసరించి సింపుల్ లేదా రిచ్ లుక్ నిస్తుంటాయి. లెహంగాలు, పట్టుచీరలు, లంగా-ఓణీ లాంటి సంప్రదాయ దుస్తులమీద విక్టోరియన్ నెక్లెస్‌లు, హారాలు అందంగా అమరుతాయి.



ఎంతో ఇష్టంగా కొనుక్కున్న విక్టోరియన్ హారాలు, నెక్లెస్‌లు ఎప్పటికీ వన్నె తగ్గకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ సంరక్షించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వీటికి పెర్ఫ్యూమ్‌లు, మేకప్ లోషన్లు, మేకప్‌ను తొలగించే క్లీనర్స్ తగలకుండా చూసుకోవాలి. ముఖాన్ని నీటితో కడుక్కోవాలి అనుకున్నపుడు, అధికంగా చెమట పడుతుందని పించినప్పుడు మెడలోనుంచి నెక్లెస్ లేదా హారం తీయడం మంచిది. ఒకసారి ధరించి తీసిన తరువాత వాటిని మెత్తటి గుడ్డతో నెమ్మదిగా తుడవాలి. తేమ లేదని నిర్ధారించుకున్న తరువాతనే వాటిని ప్లాస్టిక్ లేదా క్లాత్ లైన్డ్ బాక్స్‌ల్లో భద్రపరచుకోవాలి. విక్టోరియన్ ఆభరణాలను వెల్వెట్ బాక్స్‌ల్లో పెట్టకూడదు.

# 'నేత్ర' పర్వం..!

ఉదయపూర్... డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు పెట్టింది పేరు. పీవీ సింధు, హార్దిక్ పాండ్యా, ఇషా అంబానీ, నీల్ నితిన్ ముఖేష్, సంజయ్ హిందూజ... ఇలా ఎందరో ఇక్కడ వివాహ వేడుకలు జరుపుకున్నారు. తాజాగా ఈ కోవలోకే చేరనున్నారు... నేత్ర మంతెన, వంశీ గాదిరాజు. వీరి పెళ్లి సంరంభం ఇప్పటికే ప్రారంభమైంది. అందులో పాల్గొనడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ సహా పలువురు విదేశీ ప్రముఖులు కూడా భారత దేశానికి విచ్చేశారు. దీంతో నేత్ర, వంశీల వివాహం నెట్టింట చర్చనీయాంశమైంది.





### ఎవరీ పెళ్లి కూతురు..?

అమెరికన్ బిలియనీర్ రామరాజు మంతెన కూతురే నేత్ర మంతెన. వీరిది తెలుగు మూలాలు ఉన్న కుటుంబం. రామరాజు.. జేఎన్‌టీయూ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ, మేరీల్యాండ్ విశ్వవిద్యాలయం నుంచి క్లినికల్ ఫార్మసీలో డిగ్రీని పూర్తి చేశారు. ప్రస్తుతం అమెరికాలోని ఇంజెనస్ ఫార్మాస్యూటికల్స్‌కు ఛైర్మన్, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. అంతేకాదు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొదిన ఐకోర్ హెల్త్ కేర్, ఇంటర్నేషనల్ అంకాలజీ నెట్‌వర్క్, ఆంకో స్క్రిప్ట్ లాంటి గ్లోబల్ వెంచర్లను నిర్వహిస్తున్నారు. అమెరికా, స్విట్జర్లాండ్, ఇండియాల్లో ఫార్మా రంగానికి సంబంధించిన ప్రముఖ వ్యాపారవేత్తగా పేరు పొందారు. ఎనిమిదేళ్ల క్రితం 28 కిలోల బంగారు సహస్ర నామ కాసుల హారాన్ని తిరుమల వేంకటేశ్వరునికి బహూకరించి వార్తల్లో నిలిచారు. నేత్ర తల్లి పద్మజ. ఈమె ఎవరో కాదు.. ఒకప్పటి బీజేపీ ఎంపీ, ప్రముఖ వ్యాపారవేత్త అయిన గోకరాజు గంగరాజు కుమార్తె. ఆమె తండ్రిలాగే దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సేవ చేస్తుంటార్షు.

### పెళ్లికొడుకు ఎవరు..?

నేత్రను పరిణయం చేసుకోబోయేది అమెరికాకు చెందిన వంశీ గాదిరాజు. ఈయన ప్రముఖ టెక్ ఇన్నోవేటర్. కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పట్టా పొందారు. సూపర్ ఆర్డర్ అనే ఫుడ్ యాప్‌కు సహ వ్యవస్థాపకుడు. అంతేకాదు దానికి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. గతేడాది ఫోర్బ్స్ 30 అండర్ 30 జాబితాలో ఫుడ్ అండ్ డ్రింక్ కేటగిరీ కింద చోటు సంపాదించారు.

### అతిథులు

ఇప్పటికే దేశ విదేశాల నుంచి ప్రముఖ సెలబ్రిటీలు ఉదయ్‌పూర్ చేరుకున్నారు. మేవారీ సంప్రదాయాన్ని అనుసరిస్తూ జానపద నృత్యాలు, ఘూమర్ డ్యాన్స్‌లతో అతిథులను ఆహ్వానిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ జూనియర్, అతని స్నేహితురాలు ఈ వేడుకలకు హాజరవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇతని కోసం సుమారు 40 దేశాల నుంచి 126 మంది అతిథులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. జస్టిన్ బీబర్, జెన్నిఫర్ లోపెజ్, టియెస్టో, బ్లాక్ కాఫీ, సిర్క్యు డు సోలైల్, డీజే అమన్ నాగ్‌పాల్ తదితర అంతర్జాతీయ ప్రదర్శనకారులు ముందుగానే వచ్చి నిర్వహిస్తున్న కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకుంటున్నాయి. హృతిక్ రోషన్, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్, జాన్వీ కపూర్, కరణ్ జోహార్, కృతి సనన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, మాధురీ దీక్షిత్, దియా మిర్జా తదితర బాలీవుడ్ స్టార్లు కూడా పెళ్లి వేడుకల్లో సందడి చేస్తున్నారు.

### వేదికలు

అరుదైన ఈ డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం పిచోలా సరస్సుపై ఉన్న జగ్ మందిర్ ఐలాండ్ ప్యాలెస్‌ను సిద్ధం చేశారు. రాజసం ఉట్టిపడే ఈ భవనాన్ని లేక్ గార్డెన్ ప్యాలెస్ అని కూడా పిలుస్తుంటారు. లీలా ప్యాలెస్, జెనానా మహల్‌లలో కూడా వేడుకలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాడు తాజ్ లేక్ ప్యాలెస్‌లో హల్దీ, సంగీత్ కార్యక్రమాలు జరిగాయి. వీటిని కరణ్ జోహార్, సోఫీ చౌదరీలు హోస్ట్ చేశారు. సంగీత్ వేడుకల్లో రణ్‌వీర్ సింగ్ ఆడుతూ పాడుతూ డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌ను అతని స్నేహితురాలిని డ్యాన్స్ ఫ్లోర్‌కు తీసుకెళ్లడంతో హాలంతా కేరింతలతో నిండిపోయింది. శనివారం.. మానెక్ చౌక్‌లో మెహందీ వేడుకలు గ్రాండ్‌గా జరిగాయి. ఆదివారం.. ప్రధాన వివాహ ఘట్టం, రిసెప్షన్ తదితరాలు ఉంటాయి.

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## మంచు మనోజ్ కొత్త ప్రయాణం



ఇటీవలె విడుదలైన 'మిరాయ్', 'భైరవం' చిత్రాలతో ప్రేక్షకులను పలకరించారు మంచు మనోజ్. తాజాగా ఆయన సంగీత ప్రపంచంలోకి అడుగుపెడుతూ తన కొత్త ప్రయాణాన్ని ఆరంభించారు. 'మోహన రాగ మ్యూజిక్' పేరుతో సంగీత సంస్థను ప్రారంభించనున్నట్లు సోషల్‌మీడియా ద్వారా ప్రకటించారు. 'లోకల్ హార్ట్స్. గ్లోబల్ బీట్స్' అనేది ఉపశీర్షిక. 'సంగీతం అంటే నాకెంతో ఇష్టం. ఇందులో కొత్త వారికి ప్రోత్సాహం ఉంటుంది' అని పేర్కొన్నారు. కాగా, 'పోటుగాడు' సినిమాలో 'ప్యార్ మే పడిపోయానే', 'మిస్టర్ నూకయ్య'లో 'పిస్తా పిస్తా' పాటలను ఆలపించి అభిమానుల్ని అలరించారు. అలాగే, 'నేను మీకు తెలుసా'లో 'ఎన్నో ఎన్నో', మిస్టర్ నూకయ్యలో 'ప్రాణం పోయే బాధ' సాంగ్స్‌కు సాహిత్యాన్ని అందించి ఆయన తన ప్రతిభను చాటుకున్నారు.


## 'వెంకన్న'తో మంచి గుర్తింపు

\- చైతన్య జొన్నలగడ్డ



'నేను గతంలో 'బబుల్ గమ్', 'హిట్ 3' సినిమాలు చేశాను. ఆ సినిమాల్లో నేను ఉన్నానని ఎవరికీ తెలియదు. 'రాజు వెడ్స్ రాంబాయి'లో వెంకన్న పాత్ర నాకు మంచి గుర్తింపునిచ్చింది' అని అన్నారు నటుడు చైతన్య జొన్నలగడ్డ. అఖిల్‌రాజ్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవీ నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలై పాజిటివ్ టాక్‌తో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చైతన్య జొన్నలగడ్డ విలేకరులతో మాట్లాడుతూ 'మేము ఊహించినట్లే ఈ సినిమాకు మంచి స్పందన వస్తోంది. నేను నటించిన వెంకన్న పాత్రకు అందరూ కనెక్ట్ అవుతున్నారు. ఈ క్యారెక్టర్ కోసం మేకోవర్ పరంగా ప్రత్యేకంగా సిద్ధమయ్యాను. ఈ సినిమాకు నిజమైన హీరో సురేశ్ బొబ్బిలి. థియేటర్లలో ఆయన బీజీఎం విని ప్రేక్షకులు కంటతడిపెట్టారు. నా సోదరుడు సిద్ధు పేరును వాడుకోవడం నాకు ఇష్టం లేదు. చిత్ర పరిశ్రమలో నాకు నేనుగా నిరూపించుకోవాలని అనుకుంటున్నా' అని అన్నారు.

## పోరాటాలే ప్రత్యేకాకర్షణగా



హరీశ్‌కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాషమకాన్'. వినీత్ ప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. సత్యరాజ్, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ ప్రోమోను చిత్రబృందం శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా హరీశ్ కల్యాణ్ మాట్లాడుతూ 'ఇదొక పక్కా మాస్ యాక్షన్ మూవీ. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది' అని చెప్పారు. 'భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మిస్తున్నాం. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: బ్రిట్టో మైఖేల్, సినిమాటోగ్రఫీ: కార్తీక్ అశోకన్.

# 37 మంది నక్సల్స్ లొంగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ సభ్యుడు ముచ్చకి సోమడా అలియాస్ ఎర్రా సహా 37 మంది శనివారం డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. వీరిలో 25 మంది మహిళలు ఉన్నారు. వారు పెద్దసంఖ్యలో ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇందులో ఒక ఏకే 47, రెండు ఎస్ఎల్ఆర్ లు, నాలుగు పాయింట్ 303 తుపాకులు, ఒక జీ3 తుపాకీతోపాటు 346 తూటాలను పోలీసులకు స్వాధీనం చేశారు. కాగా, లొంగిపోయిన వారిలో ఏడుగురు ఖమ్మం డివిజనల్ కమిటీ సభ్యులు ఉన్నారు. ఖమ్మం డివిజనల్ ఏరియా కమిటీ సభ్యుడు నూపో గంగా అలియాస్ నీలేశ్, మడవి సుక్కా, కర్దం మోటు, ఉయికే బిచ్చే, పూనెం ఉంగి, అబ్కా రైమోతి, కుడియం దేవే పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరితోపాటు భద్రాద్రి కొత్తగూడెం డివిజనల్ కమిటీ సభ్యుడు సోడి సుక్కి, సోడి పైకీ, సోడి హిడ్మా కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు. ఇక ఇటీవల ఏపీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మాడ్వి హిడ్మా ఆధ్వర్యంలో పనిచేసిన పీఎల్‌జీఏ బెటాలియన్-1 ప్లాటూన్-బి కమాండర్ మాడ్వి కోసా, సెక్షన్-బి కమాండర్ నుపో సుక్కి కూడా లొంగిపోయారు. సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీకి నాయకత్వం వహిస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమడా తన దళంలోని ఇద్దరు డివిజనల్ కమాండర్లు, ఏడుగురు ఏరియా కమిటీ సభ్యులు, 13 మంది సభ్యులతో కలిసి లొంగిపోయారు. కాగా, ఆజాద్, అప్పాసి నారాయణ, సోమడా పేరిట ఒక్కొక్కరిపై రూ.20లక్షల చొప్పున రివార్డు ఉంది. వీరికి ఈ మొత్తంతోపాటు డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున, మిగిలిన వారికి రూ.25 వేల చొప్పున అందజేస్తున్నట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు రూ.1.41 కోట్లను డీడీ రూపంలో అందజేశారు.

### మూడు డివిజనల్ కమిటీలు ఖాళీ..

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టులు లొంగిపోతున్నారని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. తాజా లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ ఖమ్మం డివిజనల్ కమిటీ, భద్రాద్రి కొత్తగూడెం కమిటీ, సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీలు ఖాళీ అయినట్లేనన్నారు. ఇక కేంద్ర, రాష్ట్ర కమిటీల్లో మిగిలిన



లొంగిపోయిన సందర్భంగా మాట్లాడుతున్న ఆజాద్

ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, రాజిరెడ్డి, తిప్పిరి తిరుపతి, గణేశ్, బడే చొక్కారావు, పవనానంద రెడ్డి, జోడే రత్నాబాయి, లోకేశ్ చందర్, శేఖర్, ముప్పిడి సాంబయ్య, మేకల మనోజ్, కర్రా వెంకట రెడ్డి, గంగిడి సత్యనారాయణ రెడ్డి కూడా లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. వారి భద్రతకు పూర్తి హామీ ఇస్తున్నామన్నారు. లొంగిపోయిన వారికి పునరావాసం, స్వేచ్ఛగా జీవించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఈ ఏడాది 465 మంది మావోయిస్టులు లొంగిపోయారని, ఇంకా రాష్ట్ర కమిటీలో పనిచేస్తున్న 59 మంది కూడా లొంగిపోవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో మిగిలిన 8 మందిలో ఐదుగురు తెలంగాణవారే ఉన్నారని తెలిపారు. వీరిలో ఒకరు తీవ్ర అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్నట్లుగా తమకు సమాచారం ఉందన్నారు.

### సిద్ధాంతపరమైన విభేదాల వల్లే..

మావోయిస్టు పార్టీ సాయుధ దళాల నాయకులు, సభ్యుల సంఖ్య రోజు రోజుకూ క్షీణిస్తోందని డీజీపీ అన్నారు. భద్రతా దళాల నిరంతర ఒత్తిడి వల్ల పార్టీకి చెందిన కీలక నెట్‌వర్క్‌లు నిర్వీర్యమయ్యాయని, ప్రజల నుంచి మద్దతు కరవైన క్రమంలో వారి ముందు లొంగుబాటు అవకాశం మాత్రమే ఉందని స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీలో అంతర్గతంగా సిద్ధాంతపరమైన విభేదాలు రావడంతో భవిష్యత్తు కార్యాచరణపై నాయకత్వ స్థాయి క్యాడర్లలో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందన్నారు. సిద్ధాంతపరమైన భావజాలం, క్షేత్ర స్థాయిలో వాస్తవాల మధ్య ఏర్పడిన అంతరం వల్ల దశాబ్దాలుగా పార్టీలో ఉన్న సీనియర్ సభ్యులు తీవ్ర నిరాశకు గురవుతున్నట్లు అర్థమవుతోందన్నారు. హిడ్మా ఎన్‌కౌంటర్ వెనుక తెలంగాణ ఎస్ఐబీ పాత్ర ఉంద న్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. కాగా, పార్టీ అగ్రనేతల్లో కొందరు లొంగిపోయేందుకు వివిధ మార్గాల ద్వారా పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

### అంతా పిన్న వయస్కులే

లొంగిపోయిన 37 మంది నక్సల్స్‌లో 25 మంది మహిళలే ఉండగా, వీరిలో 22 మంది 20-25 ఏళ్లలోపువారే. వీరిలో చాలా మంది మావోయిస్టు పార్టీలో సప్లయ్, ప్రొటెక్షన్, గార్డు, టైలరింగ్ విధులు నిర్వహించారు. వీరిలో కొంతమందితో మాట్లాడినపుడు.. వచ్చీరాని తెలుగులో మాట్లాడారు. పార్టీ చెప్పిన పనిని తాము చేశామని, ఇప్పుడు భద్రతే ప్రశ్నార్థకంగా మారడంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు వచ్చామని చెప్పారు. ఈ ఆడపిల్లల భవిష్యత్తు గురించి ఏమి చర్యలు తీసుకుంటారని ఎస్ఐబీ ఐజీ సుమతిని ప్రశ్నించగా.. ప్రతి అమ్మాయి బాధ్యతనూ తాము తీసుకుంటామని చెప్పారు.

### మా మధ్య విభేదాల్లేవు: ఆజాద్

మావోయిస్టు పార్టీ నాయకత్వంలో తమ మధ్య విభేదాలు లేవని లొంగిపోయిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆజాద్ అన్నారు. పార్టీకి చెప్పే లొంగిపోవడానికి వచ్చామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలవడమే మంచిదని, మిగతా వారు కూడా బయటకు రావాలని కోరారు. కాగా, మారుతున్న పరిస్థితులు, పనిచేయలేని నిర్బంధం, అడుగడుగునా పోలీసు క్యాంపుల మధ్య పార్టీ కోసం పనిచేయలేని పరిస్థితి ఏర్పడిందని మరో రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమడా అన్నారు. అందుకే లొంగిపోతున్నట్లు చెప్పారు.

### ఆయుధాలతో లొంగిపోతే డబుల్ బొనాంజా

మావోయిస్టులు తమ ఆయుధంతో సహా లొంగిపోతే వారికి డబుల్ బొనాంజా ఆఫర్‌ను పోలీసులు ఇస్తున్నారు. వారిపై ఉన్న రివార్డుతో పాటు ఆయుధానికో రేటును ఖరారు చేశారు. కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా మావోయిస్టులు స్వాధీనం చేసిన ప్రతి ఆయుధానికీ ఒక ప్రోత్సాహక బహుమతి ఇస్తున్నట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఏకే 47 రైఫిల్‌కు రూ.4 లక్షలు, ఎస్ఎల్ఆర్‌కు రూ.2 లక్షలు, 303 రైఫిల్‌కు రూ.లక్ష ఇస్తున్నారు. శనివారం లొంగిపోయిన మావోయిస్టులు అప్పగించిన ఆయుధాలకుగాను వారికి ఇచ్చే రివార్డుకు అదనంగా రూ.13 లక్షలను డీజీపీ అందజేశారు.

## హన్మకొండ జిల్లాలో హిడ్మా ఫ్లెక్సీ కలకలం



వేలేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాకు జోహార్లు తెలుపుతూ హన్మకొండ జిల్లా వేలేరు మండలం సోడాష్‌పల్లి గ్రామంలో ఓ ఫ్లెక్సీ వెలిసింది. గ్రామానికి చెందిన కొయ్యడ సురేశ్, మ్యాక బుచ్చయ్య హిడ్మా మృతిపై సంతాపం తెలుపుతూ గ్రామ కూడలిలోని ఓ గోడకు హిడ్మా ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. విషయం తెలిసిన పోలీసులు సురేశ్, బుచ్చయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీర సురేశ్ తెలిపారు.



భద్రాచలంలో ప్రచార జాత ముగింపు సభలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

## ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరపాలి

- ఆపరేషన్ కగార్ ఓ పచ్చి బూటకం
- సీపీఐ సీనియర్ నేత చాడ వెంకటరెడ్డి ఆరోపణ

భద్రాచలం, కొత్తగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని సీపీఐ సీనియర్ నేత చాడ వెంకటరెడ్డి కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సీపీఐ శతవసంత ఉత్సవాల ప్రచార జాత ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ కగార్ ఓ పచ్చి బూటకమని, ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను పట్టుకొని చిత్రహింసలకు గురి చేసి హతమారుస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు శాంతి చర్చలకు రావాలని ఆహ్వానిస్తూనే మరోవైపు వరుస ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. సభలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, ఘటనపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరుల స్థూపం వద్ద పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన సభ నిర్వహించారు.

### ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలి

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని, దండకారణ్యం క్యాంపుల్లో ఉన్న సాయుధ బలగాలను ఉపసంహరించాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు, సంయుక్త కార్యదర్శి మదన కుమారస్వామిలతో కలిసి ఆయన మాట్లాడారు. హిడ్మాతోపాటు ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని, ఇందులో పాల్గొన్న పోలీసులందరిపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## డిసెంబరు 2 నుంచి పీఎల్‌జీఏ వార్షికోత్సవాలు

- మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలటరీ కమిషన్

హైదరాబాద్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) 25వ వార్షికోత్సవాలను డిసెంబరు 2 నుంచి 8 వరకు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ) పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు, పీఎల్‌జీఏ కమాండర్లు, యూనిట్లు రక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే ఉత్సవాలను నిర్వహించాలని ఇటీవల ఓ ప్రకటనలో సూచించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలని కోరింది.

# బిజినెస్ ప్లస్



## అన్‌క్లెయిమ్డ్ బీమా మొత్తాలు

# క్లెయిమ్ చేసుకోవడం ఎలా?

బీమా పాలసీ తీసుకోవడం ఒక ఎత్తు. అవసరమైనప్పుడు దాన్ని క్లెయిమ్ చేసుకోవడం మరో ఎత్తు. పాలసీ గడువు ముగిసినా పాలసీదారులు మర్చిపోవడం లేదా వారి వారసులు లేదా నామినీలకు తమ వారి పేరున ఒక బీమా పాలసీ ఉందనే విషయమే తెలియక పోవడం ఇందుకు ప్రధాన కారణాలు. అయినా కొద్దిపాటి ప్రయత్నంతో పాలసీదారులు లేదా వారి వారసులు, నామినీలు క్లెయిమ్ చేయని ఈ మొత్తాలను క్లెయిమ్ చేసుకోవచ్చు.




మన దేశంలో బీమా రక్షణ ఉండేది కొద్ది మందికి మాత్రమే. వారి లోనూ చాలా మందికి ముఖ్యంగా పాలసీదారులకు లేదా వారి వారసులకు అవసరమైనప్పుడు పాలసీ మొత్తాన్ని ఎలా క్లెయిమ్ చేసుకోవాలో తెలియదు. దీంతో ప్రస్తుతం దేశంలోని వివిధ బీమా కంపెనీల వద్ద క్లెయిమ్ చేయని మొత్తాలు రూ.65,000 కోట్లకు చేరాయి. పాలసీదారులు లేదా వారి నామినీలు కొద్దిపాటి ప్రయత్నంతో ఈ మొత్తాలను క్లెయిమ్ చేసుకోవచ్చు.

### అన్‌క్లెయిమ్డ్ మొత్తం అంటే?

ఏదైనా ఒక పాలసీ గడువు ముగిసి 12 నెలలైనా, ఆ పాలసీ మొత్తాన్ని పాలసీదారులు క్లెయిమ్ చేసుకోకపోతే దాన్ని అన్‌క్లెయిమ్డ్ మొత్తం అంటారు. పాలసీదారుడి మరణం, హెల్త్ బెనిఫిట్ క్లెయిమ్, మెచ్యూరిటీ క్లెయిమ్, సర్వైవల్ బెనిఫిట్, పాలసీ సరెండర్/ఫోర్‌క్లోజర్, అధికంగా చెల్లించిన ప్రీమియాన్ని రిఫండ్ చేయకపోవడం, డిపాజిట్ చేసిన ప్రీమియం సరిగా సర్దుబాటు కాకపోవడం వంటి రూపాల్లో ఈ అన్‌క్లెయిమ్డ్ మొత్తాలు బీమా కంపెనీల వద్దే ఉండి పోతాయి.

భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) నిర్వచనం ప్రకారం సాధారణ ఇన్సూరెన్స్ కంపెనీలు, ఏకీకృత ఆరోగ్య బీమా కంపెనీలకు పాలసీల ప్రీమియం కింద ముందుగా చెల్లించే ప్రీమియం, డిపాజిట్లు.. పాలసీ కాలపరిమితిలో కేటాయింపులు జరపని ప్రీమియం.. క్లెయిమ్ చేయని మొత్తాల పరిధిలోకి రావు. అయితే ఈ మొత్తాల్ని పాలసీ కాలపరిమితిలోగా ప్రీమియం కింద సర్దుబాటు చేయక పోయినా ఆ మొత్తాన్ని రిఫండ్ చేయకపోయినా అది క్లెయిమ్ చేయని మొత్తమే అవుతుంది.

### చెక్ చేయడం ఎలా?

ఆయా బీమా కంపెనీల వెబ్‌సైట్లు లేదా ఐఆర్‌డీఏఐ నిర్వహణలోని బీమాభరోసా పోర్టల్ ద్వారా ఈ క్లెయిమ్ చేయని పాలసీల వివరాలను పాలసీదారులు, వారి నామినీలు లేదా వారి చట్టబద్ధ వారసులు తేలిగ్గా కనుక్కోవచ్చు. ఇందుకు ఆయా వెబ్‌సైట్లను ఓపెన్ చేసి పుట్టిన తేదీ, పాన్ నంబర్, ఆధార్ నంబర్, పాలసీ నంబర్, పాలసీదారుడి పేరు వంటి వివరాలు సమర్పిస్తే క్లెయిమ్ చేయని పాలసీల వివరాలు తెలిసిపోతాయి. అప్పుడు కేవైసీ వివరాలు పూర్తి చేసి మీ బ్యాంకు ఖాతా నంబర్ ఇస్తే క్లెయిమ్ చేయని మొత్తం ఆయా వ్యక్తుల ఖాతాల్లో వడ్డీతో సహా జమవుతాయి.

### అవసరమయ్యే పత్రాలు

- పాలసీ వివరాలు/పత్రాలు
- బ్యాంకు ఖాతా వివరాలు
- క్లెయిమ్ చేసే వారి ఫొటో
- ఖాతాదారుడి పేరు, బ్యాంకు ఖాతా నంబర్ ఉన్న క్యాన్సిల్ చేసిన చెక్ లేదా బ్యాంకు పాస్‌బుక్/స్టేట్‌మెంట్ జిరాక్స్ కాపీతో కూడిన క్యాన్సిల్ చేసిన చెక్
- గుర్తింపు నిర్ధారణ కోసం కేవైసీ వివరాలు
- చనిపోయిన వ్యక్తుల పాలసీ కోసమైతే అతడితో ఉన్న బంధుత్వాన్ని రుజువు చేసే పత్రాలు, క్లెయిమ్ చేసే వ్యక్తికి సంబంధించిన చిరునామా ధ్రువీకరణ పత్రాలు
- నిర్ణీత పద్ధతిలో పూర్తి చేసిన క్లెయిమ్ ఫారం
- చట్టబద్ధ వారసులైతే వారసత్వ సర్టిఫికెట్
- పాలసీదారుడు చనిపోయి ఉంటే. అతని డెత్ సర్టిఫికెట్
- హాస్పిటల్ రికార్డులు
- పోలీసు రిపోర్టులు/ఫిర్యాదు పత్రాలు
- ఎఫ్ఐఆర్ రిపోర్టులు

ఈ పత్రాలు అన్నీ సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత బీమా కంపెనీలు క్లెయిమ్ చేయని మొత్తాలను ఆయా పాలసీదారులు లేదా వారి నామినీలు లేదా వారసులకు బ్యాంకు ఖాతా ద్వారా జమ చేస్తాయి. చనిపోయిన వ్యక్తుల క్లెయిమ్ చేయని మొత్తాలు జమ చేసేందుకు మాత్రం కొద్దిగా ఎక్కువ సమయం పడుతుంది.

### 10 ఏళ్ల గడువు దాటితే?

ఏదైనా ఒక బీమా పాలసీ గడువు ముగిసి పదేళ్లయినా ఎవరూ క్లెయిమ్ చేయకపోతే.. బీమా కంపెనీ ఆ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ చేస్తుంది.

### ఇబ్బందులెదురైతే..

క్లెయిమ్ చేయని బీమా పాలసీ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకునేటప్పుడు ఇబ్బందులు ఎదురైతే ముందుగా సంబంధిత బీమా కంపెనీ గ్రీవెన్స్ రిడ్రెసల్ అధికారి (జీఆర్ఓ)ని సంప్రదించాలి. ఆయా బీమా కంపెనీల వెబ్‌సైట్లు లేదా ఐఆర్‌డీఏఐ వెబ్‌సైట్ లేదా బీమాభరోసా వెబ్‌సైట్ల ద్వారా వీరి వివరాలు తెలుసుకోవచ్చు. వీటికి తోడు ఐఆర్‌డీఏఐ కాల్‌సెంటర్ హెల్ప్‌లైన్ నంబర్లు 155255/1800 4254 732 ద్వారానూ తెలుసుకోవచ్చు.

### ఇండెమ్నిటీ బాండ్

ఒకవేళ ఒరిజినల్ పాలసీ సర్టిఫికెట్ పోతే, బీమా కంపెనీ క్లెయిమ్ చేసే వారి నుంచి ఇండెమ్నిటీ బాండ్ కోరవచ్చు. అయితే ఇది ఆయా బీమా కంపెనీల అంతర్గత విధానాలపై ఆధారపడి ఉంటుంది.

### ఎన్ఆర్ఐల కోసం కూడా

సాధారణ పౌరుల్లా ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) కూడా బీమాభరోసా, ఆయా బీమా కంపెనీల వెబ్‌సైట్ల ద్వారా మర్చిపోయిన తమ పాలసీల మొత్తాలను, లేదా చనిపోయిన తమ వారి పాలసీ మొత్తాలను వెతికి పట్టుకుని క్లెయిమ్ చేసుకోవచ్చు. కాకపోతే ఇందుకు ఈ కింది వివరాలు పూర్తి చేయాలి.

- కేవైసీ కోసం సెల్ఫ్ అటెస్టేషన్‌తో తమ పాస్‌పోర్టు, వీసా, విదేశాల్లోని చిరునామాను నిర్ధారించే పత్రాలు
- విదేశాల్లోని తమ బ్యాంకు ఖాతా వివరాలు లేదా స్వదేశానికి డబ్బులు పంపేందుకు వినియోగించే ఎన్ఆర్ఈ/ఎన్ఆర్ఓ ఖాతాల వివరాలు.

ఎన్ఆర్ఐలు ఈ పత్రాలను విదేశాల నుంచే డిజిటల్ రూపంలో బీమా కంపెనీలకు సమర్పించవచ్చు.

### ముందు జాగ్రత్తలు

- పాలసీ తీసుకున్నప్పటి నుంచే పాలసీదారుడు తమ చిరునామా, అవసరమైతే సంప్రదించడానికి అవసరమైన ఫోన్ నంబర్లు, నామినీల వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలను ఎప్పటికప్పుడు అప్ టు డేట్‌గా బీమా కంపెనీకి తెలియజేయాలి
- పాలసీలను వారి వారి ఆధార్, పాన్ నంబర్‌తో అనుసంధానం చేయాలి. దీనివల్ల అవసరమైనప్పుడు మీ పాలసీని గుర్తించడం బీమా కంపెనీకి తేలికవుతుంది
- పాలసీల పునరుద్ధరణ, క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ సందేశాల కోసం బీమా కంపెనీలకు తమ ఈ-మెయిల్ అడ్రస్, ఎస్ఎంఎస్ చేయాల్సిన ఫోన్ నంబర్లు ఇస్తే మరీ మంచిది.
- అన్ని బీమా పాలసీల వివరాలను డిజిటల్ రూపంలో డిజీలాకర్ లేదా ఈ-ఇన్సూరెన్స్ ఖాతాలో లేదా డాక్యుమెంట్స్ రూపంలో ఒక ఫ్యామిలీ ఫైల్‌గా భద్ర పరుచుకుంటే పాలసీల క్లెయిమ్ మరింత సులవవుతుంది.





బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,25,840 ▲ | 1,15,350 ▲ | 1,70,000 ▲ |
| విజయవాడ | 1,27,500 ▲ | 1,19,000 ▲ | 1,58,400 ▼ |
| విశాఖపట్నం | 1,25,840 ▲ | 1,15,350 ▲ | 1,72,000 ▲ |
| రాజమండ్రి | 1,25,840 ▲ | 1,15,350 ▲ | 1,57,000 ▲ |
| ప్రొద్దుటూరు | 1,24,800 ▲ | 1,14,820 ▲ | 1,58,400 ▲ |
| ముంబై | 1,23,146 ▲ | 1,12,802 ▲ | 1,51,129 ▼ |

## హైదరాబాద్‌లో ఎస్ఓఎల్ జీసీసీ

మెడికల్ డివైసెస్, హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఎస్ఓఎల్-మిల్లీనియం.. హైదరాబాద్‌లో కొత్తగా ఇండియా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించింది. వ్యూహాత్మక కార్యకలాపాల విస్తరణతో పాటు అంతర్జాతీయంగా సామర్థ్యాలను మరింత పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో ఈ జీసీసీని ప్రారంభించినట్లు కంపెనీ పేర్కొంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 107 | విజయవాడ | 103 |
| వరంగల్ | 107 | గుంటూరు | 108 |
| కరీంనగర్ | 107 | ఒంగోలు | 108 |
| మహబూబ్‌నగర్ | 107 | చిత్తూరు | 106 |
| కర్నూలు | 107 | నెల్లూరు | 111 |
| విశాఖపట్నం | 100 | అనంతపురం | 111 |
| గోదావరి | 103 | | |

## ఏపీలో బిర్లాన్యూ ఫైబర్ సిమెంట్ బోర్డ్ ప్లాంట్

తొలి దశలో రూ.127 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సీకే బిర్లా గ్రూప్ సంస్థ బిర్లాన్యూ.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో కొత్తగా ఫైబర్ సిమెంట్ బోర్డ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. కంపెనీ దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా సరికొత్త టెక్నాలజీతో ఈ ప్లాంట్‌ను నెలకొల్పుతున్నట్లు బిర్లాన్యూ ఎండీ, సీఈఓ అక్షత్ సేథ్ వెల్లడించారు. తొలి దశలో రూ.127 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో తొలిసారిగా భారీ స్థాయి ఫైబర్ సిమెంట్ బోర్డ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 600 మందికి ఉపాధి లభిస్తుందని కంపెనీ తెలిపింది. ఏపీ మార్కెట్‌తో పాటు ప్రాంతీయ, ఎగుమతి మార్కెట్ల అవసరాలను ఈ ప్లాంట్ తీరుస్తుందని పేర్కొంది. కాగా రెండో దశలో పీవీసీ పైపులు, ఫిట్టింగ్స్, కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ కోసం అదనపు యూనిట్లను ఈ ప్లాంట్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు బిర్లాన్యూ తెలిపింది.

## ఐసీఐసీఐ ప్రు చిల్డ్రన్స్ ఫండ్‌తో మెరుగైన రిటర్నులు



చిన్నారుల ఆర్థిక భవిష్యత్ కోసం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ తీసుకువచ్చిన చిల్డ్రన్స్ ఫండ్ అత్యుత్తమ రిటర్నులను అందిస్తోంది. పిల్లల దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఫండ్ ఏటా 15.58 శాతం రిటర్నులు అందిస్తూ వస్తోంది. కనీసం ఐదేళ్ల లాకిన్ కాలపరిమితితో తీసుకువచ్చిన ఈ ఫండ్.. ఈక్విటీ, డెట్ అసెట్స్ సహా బెంచ్‌మార్క్‌కు వెలుపల ఉన్న థీమ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తోంది. 2001 ఆగస్టు 31న ప్రారంభమైన ఈ ఫండ్‌లో రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే ఈ ఏడాది అక్టోబరు 31 నాటికి ఈ మొత్తం రూ.3.3 కోట్లకు చేరుకుంది. అంటే ఈ ఫండ్ ఏటా 15.58 శాతం చొప్పున రిటర్నులు అందించింది. ఇదే సమయంలో బెంచ్‌మార్క్ ఇండెక్స్ ఏటా 13.46 శాతం రిటర్నులు మాత్రమే అందించింది. సిప్ రూపంలో అయితే ప్రతి నెలా రూ.10,000 ఇన్వెస్ట్ చేసి ఉంటే ఆ మొత్తం రూ.29 లక్షలకు చేరుకోగా దాని విలువ రూ.2.2 కోట్లుగా ఉంది.

- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్.. 400 రోజుల్లో 50 వేల ఎంజీ విండ్సర్ కార్లను విక్రయించి రికార్డు సృష్టించింది. ప్రతి గంటకు 5 యూనిట్లు విక్రయించినట్లు వెల్లడించింది. ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహన విభాగంలో కంపెనీ అగ్రస్థానానికి ఇది నిదర్శనమని తెలిపింది.
- భారత్‌లో తొలిసారిగా ఐఐఎం అహ్మదాబాద్.. బిజినెస్ అనలిటిక్స్, ఏఐలో రెండేళ్ల ఎంబీఏ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. వృత్తి నిపుణులు, ఆంత్రప్రెన్యూర్స్ కోసం ఈ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. నాయకత్వ లక్షణాలు, మేనేజ్‌మెంట్ విభాగాల్లో సామర్థ్యాలను మరింతగా పెంచుకునేందుకు ఇది దోహదపడుతుందని ఐఐఎం అహ్మదాబాద్ వెల్లడించింది.
- ఆయుర్వేద హెయిర్‌కేర్ బ్రాండ్ కేశ్ కింగ్ బ్రాండ్‌ను కేశ్ కింగ్ గోల్డ్ గా ఇమామీ లిమిటెడ్ రీబ్రాండింగ్ చేసింది. ఆయుర్వేదం, సైన్స్ సంయుక్తంగా ఈ ఉత్పత్తిని తీసుకువచ్చినట్లు ఇమామీ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 23వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 645 | విజయవాడ | 660 |
| వరంగల్ | 647 | గోదావరి | 645 |
| చిత్తూరు | 673 | విశాఖపట్నం | 635 |
| | | డజను గుడ్లు రూ. 90 | |

# స్పోర్ట్స్

## 28 నుంచి విశాఖ వన్డే టికెట్ల విక్రయం

విశాఖపట్నం (స్పోర్ట్స్): దక్షిణాఫ్రికాతో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా జరిగే ఆఖరి మ్యాచ్‌కు విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ఆతిథ్యం ఇస్తోంది. వచ్చే నెల 6వ తేదీన జరిగే ఈ మ్యాచ్ టిక్కెట్లను ఈనెల 28 నుంచి డిస్ట్రిక్ట్ జొమాటో యాప్‌లో విక్రయించనున్నారు. మొత్తం 22 వేల టిక్కెట్లను విక్రయానికి ఉంచినట్టు ఏసీఏ తెలిపింది. టిక్కెట్ల ప్రారంభ ధర రూ.1,200 కాగా, గరిష్ఠంగా రూ.18 వేలుగా నిర్ణయించారు. వీటితో పాటు రూ. 2,000, 2,500, 3,000, 3,500, 4 వేలు, 5 వేలు, 10 వేలు, 15 వేలు, 18 వేల శ్రేణి టిక్కెట్లు కూడా ఉన్నాయి.

## మహిత్‌కు స్వర్ణం

బధిర ఒలింపిక్స్

న్యూఢిల్లీ: టోక్యోలో జరుగుతున్న బధిర ఒలింపిక్స్‌లో భారత షూటర్ మహిత్ సంధు స్వర్ణం సాధించింది. శనివారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో సంధు 456 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఈ క్రీడల్లో మహిత్‌కు ఇది రెండో బంగారు పతకం కాగా ఓవరాల్‌గా నాలుగో మెడల్.

## ఫైనల్లో లక్ష్యసేన్

ఆస్ట్రేలియన్ ఓపెన్

సిడ్నీ: భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఫైనల్ చేరాడు. సెమీస్‌లో లక్ష్యసేన్ 17-21, 24-22, 21-16తో చౌ తిన్ చెన్ (చైనీస్ తైపీ)ను ఓడించాడు. ఆదివారం జరిగే ఫైనల్లో యుషి తనక (జపాన్)తో లక్ష్యసేన్ తలపడనున్నాడు.

# మనదే కాస్త పైచేయి..

రాణించిన భారత బౌలర్లు

కుల్దీప్‌నకు మూడు వికెట్లు

రెండో టెస్టు

## దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 247/6







గువాహటి: ఈడెన్ గార్డెన్స్ మాదిరి కాకుండా సిరీస్ నిర్ణాయక రెండో టెస్టులో అటు బ్యాటు.. ఇటు బంతి సమతూకంతో నిలిచింది. దీంతో భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న ఈ రెండో టెస్టు తొలి రోజున ఇరువురి ఆధిపత్యం కనిపించింది. కానీ ఆఖరి సెషన్‌లో చకచకా వికెట్లు తీసిన భారత బౌలర్లు కాస్త పైచేయి ప్రదర్శించారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/48)తో పాటు ఇతర బౌలర్లు కూడా ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. ఫలితంగా ఆదివారం ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లలో 247/6 స్కోరుతో నిలిచింది. వెలుతురులేమితో మరో ఎనిమిది ఓవర్లు ఉండగానే మ్యాచ్‌ను ముగించారు. ట్రిస్టన్ స్టబ్స్ (49), కెప్టెన్ బవుమా (41), మార్‌క్రమ్ (38), రికెల్టన్ (35) రాణించారు. ముత్తుస్వామి (25), వెరీన్ (1) క్రీజులో ఉన్నారు.

**శుభారంభంతో..:** టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సఫారీల ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు మార్‌క్రమ్, రికెల్టన్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించారు. ఈడెన్‌తో పోలిస్తే పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో వీరికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. వాస్తవానికి మార్‌క్రమ్ నాలుగు పరుగుల వద్దే వెనుదిరగాల్సింది. బుమ్రా ఓవర్‌లో అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను రెండో స్లిప్‌లో రాహుల్ వదిలేశాడు. అటు రికెల్టన్ అడపాదడపా బౌండరీలతో ఆధిపత్యం చాటుకున్నాడు. కాస్త కుదురుకున్నాక మార్‌క్రమ్ సైతం నితీశ్ ఓవర్‌లో రెండు ఫోర్లతో వేగం పెంచాడు. అయితే విసిగిస్తున్న ఈ జోడీకి చెక్ పెడుతూ.. 27వ ఓవర్‌లో మార్‌క్రమ్‌ను బుమ్రా బౌల్డ్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అదే స్కోరుపై ఆటగాళ్లు టీ బ్రేక్‌కు వెళ్లారు. ఇక రెండోసెషన్ ఆరంభ ఓవర్‌లోనే మరో ఓపెనర్ రికెల్టన్‌ను స్పిన్నర్ కుల్దీప్ అవుట్ చేశాడు. ఈ దశలో స్టబ్స్, బవుమా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దడంతో సఫారీలు 156/2 పటిష్ఠ స్కోరుతో లంచ్ సెషన్‌కు వెళ్లారు.

**బౌలర్ల జోరు:** రెండు సెషన్ల పాటు దక్షిణాఫ్రికా బ్యాటర్లు మెరుగైన ఆటతీరుతో ఆకట్టుకున్నా.. చివరి సెషన్‌లో స్పిన్నర్లు పట్టు బిగించారు. ఆరంభంలోనే బవుమాను జడేజా అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే ప్రమాదకర స్టబ్స్‌ను కుల్దీప్ దెబ్బతీయడంతో పరుగు తేడాతో అతడు అర్ధసెంచరీని కోల్పోయాడు. ఇక సిరాజ్ ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించిన ముల్డర్ (13)ను కూడా కుల్దీప్ వెనక్కి పంపాడు. ఈ దశలో 13 ఓవర్ల పాటు జోర్జి, ముత్తుస్వామి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ముఖ్యంగా జోర్జి భారీ షాట్లతో బౌండరీలు సాధిస్తూ ఒత్తిడి పెంచాడు. కానీ ఆట ఆఖరి ఓవర్‌లో సిరాజ్ అతడిని పెవిలియన్‌కు చేర్చగా.. ఆరో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

### స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బి) బుమ్రా 38, రికెల్టన్ (సి) పంత్ (బి) కుల్దీప్ 35, స్టబ్స్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 49, బవుమా (సి) జైస్వాల్ (బి) జడేజా 41, డి జోర్జి (సి) పంత్ (బి) సిరాజ్ 28, ముల్డర్ (సి) జైస్వాల్ (బి) కుల్దీప్ 13, ముత్తుస్వామి (బ్యాటింగ్) 25, వెరీన్ (బ్యాటింగ్) 1; **ఎక్స్‌ట్రాలు: 17, మొత్తం: 81.5 ఓవర్లలో 247/6. వికెట్ల పతనం:** 1-82, 2-82, 3-166, 4-187, 5-201, 6-246. **బౌలింగ్:** బుమ్రా 17-6-38-1, సిరాజ్ 17.5-3-59-1, నితీశ్ 4-0-21-0, సుందర్ 14-3-36-0, కుల్దీప్ 17-3-48-3, జడేజా 12-1-30-1.

1 ఓ ఇన్నింగ్స్‌లో టాప్-4 బ్యాటర్లు 35+ పరుగులు సాధించినా ఒక్కరూ అర్ధసెంచరీ చేయలేకపోవడం టెస్టు చరిత్రలో ఇదే తొలిసారి.

2 కెప్టెన్‌గా బవుమా 1000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో అత్యంత వేగం (20వ ఇన్నింగ్స్)గా ఈ ఫీట్ సాధించిన రెండో దక్షిణాఫ్రికా సారథిగా డుడ్లే నర్స్ సరసన బవుమా నిలిచాడు.

## వన్డే సిరీస్‌కు గిల్ దూరం!

కెప్టెన్సీ రేసులో రాహుల్, పంత్

గువాహటి: మెడ నొప్పితో బాధపడుతున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు మరింత విశ్రాంతి అవసరమున్నట్టు తెలుస్తోంది. దీంతో దక్షిణాఫ్రికాతో ఈనెల 30 నుంచి ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌కు అతను దూరం కానున్నాడు. అయితే సఫారీలతోనే జరిగే టీ20 సిరీస్‌కల్లా గిల్ బరిలోకి దిగే అవకాశం ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో జట్టు కెప్టెన్సీ రేసులో కేఎల్ రాహుల్‌తో పాటు కీపర్ పంత్ పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెండో టెస్టు సారథిగా వ్యవహరిస్తున్న పంత్ ఏడాది కాలంగా ఒక్క వన్డే మాత్రమే ఆడాడు. ఈ ఫార్మాట్‌లో ప్రధాన కీపర్‌గా రాహుల్‌నే పరిగణిస్తుండడం గమనార్హం. ఓపెనర్లుగా జైస్వాల్, వెటరన్ రోహిత్‌తో పాటు టాపార్డర్‌లో కోహ్లీ ఆడనున్నాడు. హర్షిత్, సిరాజ్, అర్ష్‌దీప్ ప్రధాన పేసర్లుగా ఉండే చాన్సుంది. బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతినివ్వచ్చు. స్పిన్నర్ కుల్దీప్ వ్యక్తిగత కారణాలతో గైర్హాజరు కానుండగా అక్షర్, సుందర్, వరుణ్ జట్టులో ఉంటారు.

# హెడ్..ధనాధన్

రెండు రోజుల్లోనే ముగిసిన యాషెస్ తొలి టెస్టు

ఇంగ్లండ్‌పై ఆసీస్ ఘనవిజయం




పెర్త్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో తొలి టెస్టు సంచలనాత్మక రీతిలో రెండు రోజుల్లోనే ముగిసింది. 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టులో రెండో ఇన్నింగ్స్‌లో స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్సర్లతో 123) తుఫాన్ శతకంతో చెలరేగాడు. దీంతో ఆసీస్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రెండో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 123/9తో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్ 132 పరుగులకు ఆలౌటైంది. స్టోక్స్‌కు 5, కార్స్‌కు 3, ఆర్చర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులకే కుప్పకూలింది. అట్కిన్సన్ (37), పోప్ (33), డకెట్ (28) రాణించారు. బోలాండ్‌కు నాలుగు.. డొగెట్, స్టార్క్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో హెడ్ బాదుడుకు ఆసీస్ టీ20 తరహా ఆటతో చెలరేగి 28.2 ఓవర్లలోనే 205/2 స్కోరు చేసి నెగ్గింది. 36 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన హెడ్, 69 బంతుల్లో శతకం కూడా అందుకున్నాడు. లబుషేన్ (51 నాటౌట్)తో కలిసి రెండో వికెట్‌కు 117 పరుగులు అందించాడు. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేసింది. పది వికెట్లు తీసిన స్టార్క్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టు డిసెంబరు 4న మొదలవనుంది.

1 గత వందేళ్లలో రెండు రోజుల్లోనే ముగిసిన తొలి యాషెస్ టెస్టు ఇది. ఓవరాల్‌గా ఆరోది.

2 యాషెస్ టెస్టుల్లో రెండో వేగవంతమైన (69 బంతుల్లో) శతకం బాదిన హెడ్. గిల్‌క్రిస్ట్ (57 బంతుల్లో) తొలి స్థానంలో ఉన్నాడు. నాలుగో ఇన్నింగ్స్ ఛేదనలో మాత్రం ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ.

3 తక్కువ బంతుల్లో (847)నే ముగిసిన మూడో యాషెస్ టెస్టు ఇదే.





క్రికెటర్ స్మృతీ మంధాన, బాలీవుడ్ సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్ పెళ్లి వేడుకలు జోరుగా సాగుతున్నాయి. శనివారం జరిగిన ఈ జంట మెహందీ వేడుకల్లో సహచర క్రికెటర్లు రాధా యాదవ్, జెమీమా,అరుంధతి, శ్రేయాంక తదితరులు పాల్గొని సందడి చేశారు. స్మృతీ, పలాష్ వివాహం ఆదివారం జరగనుంది.

## క్రీడలతో వికాసం




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన 'స్పిరిట్ ఆఫ్ ద గేమ్' చర్చాగోష్ఠి స్ఫూర్తిదాయకంగా జరిగింది. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, ప్రముఖ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, మాజీ ఫుట్‌బాలర్ బైచుంగ్ భూటియా, మాజీ బాక్సర్ సరితాదేవి వక్తలుగా పాల్గొన్నారు. అమ్మాయిలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకొని రాణిస్తే సమాజంలో వివిధ రకాల అసమానతలు తగ్గడంతో పాటు సాంఘిక వికాసం వైపు అడుగులు పడతాయని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ కార్యదర్శి జయేష్ రంజన్, శాట్ వీసీ-ఎండీ సోనీబాలదేవి పాల్గొన్నారు.

## సెమీస్ ఫలితాలు టైబ్రేక్‌కు

చెస్ వరల్డ్‌కప్

పనాజీ: చెస్ వరల్డ్‌కప్ ఫైనల్లో తలపడే ప్రత్యర్థులు ఎవరనేది ఆదివారం జరిగే టైబ్రేక్‌లో తేలనుంది. సెమీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో క్లాసిక్ గేమ్‌లో కూడా ఉజ్బెకిస్థాన్ జీఎంలు నోడిర్‌బెక్‌తో జవోకిర్ సిందరోవ్, ఆండ్రీ ఎసిపెంకో (రష్యా)తో చైనా జీఎం వి యి పాయింట్ పంచుకొన్నారు. స్కోర్లు 1-1తో సమం కావడంతో ఫలితం టైబ్రేక్‌కు మళ్లింది.

**భారత మహిళల ఓటమి**

మహిళల వరల్డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు షాక్ తగిలింది. క్వార్టర్స్‌లో భారత్ 2-4తో కజకిస్థాన్ చేతిలో ఓడింది. రెండు జట్లూ చెరోగేమ్ నెగ్గడంతో ఫలితం టైబ్రేక్‌కు దారి తీసింది. అయితే, నిర్ణాయక టైబ్రేక్‌లో భారత్ 1.5-2.5తో పరాజయం పాలైంది.

## ఐటీబీపీ సేవలు వెలకట్టలేనివి: సంజయ్



హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంచు పర్వతాల్లో, ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు(ఐటీబీపీ) దేశానికి చేస్తున్న సేవలు, త్యాగాలు వెలకట్టలేనివని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. 3,488 కి.మీ పొడవైన భారత్-చైనా సరిహద్దు రక్షణలో ఐటీబీపీ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని అన్నారు. దీంతో పాటు సామాజిక సేవా కార్యక్రమా(సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్)ల ద్వారా స్థానిక ప్రజలకు స్వయం ఉపాధి శిక్షణనివ్వడం గొప్ప విషయమని అభినందించారు. ఐటీబీపీ 64వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం జమ్మూ కశ్మీర్‌లోని ఉదంపూర్ 15వ ఐటీబీపీ బెటాలియన్‌లో నిర్వహించిన పరేడ్‌కు బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు



కిషన్‌రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కోల్ ఇండియా, రెయిన్ బో చిల్డ్రన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

## 'తలసీమియా బాలలకు' రూ.10 లక్షలు

- ఇప్పటిదాకా 800 మందికి బీఎంటీ చికిత్స: కిషన్‌రెడ్డి
- బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స కోసం కోల్ ఇండియా-రెయిన్ బో ఆస్పత్రి ఒప్పందం

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తలసీమియా బాల సేవా యోజన ద్వారా బాధిత చిన్నారులకు రూ.10 లక్షల సాయం అందజేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పథకం కింద బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్(బీఎంటీ) చికిత్స అందించేందుకు బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కోల్ ఇండియా లిమిటెడ్(సీఐఎల్), రెయిన్ బో చిల్డ్రన్స్ ఫౌండేషన్‌లు శనివారం అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. రెయిన్ బో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దినేష్ చిర్ల, సీఐఎల్ చైర్మన్ సనోజ్ కుమార్ ఝా, డైరెక్టర్(హెచ్‌ఆర్) డాక్టర్ వినయ్ రంజన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు 17 ఆస్పత్రులతో ఒప్పందం చేసుకున్నామని, ఇప్పుడు రెయిన్‌బోతో అవగాహన కుదిరిందని చెప్పారు. ఇప్పటిదాకా దాదాపు 800 మంది పిల్లలకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరిగాయని తెలిపారు.

## హెచ్‌ఐఎల్‌టీపీని వెనక్కి తీసుకోవాలి

- పారిశ్రామిక వాడల్లోని భూములను అమ్మి రూ.వేల కోట్ల దోపిడీకి తెలంగాణ సర్కారు కుట్ర: లక్ష్మణ్



న్యూఢిల్లీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంపదను అప్పనంగా బడా బాబులకు కట్టబెట్టే కుట్రలకు తెలంగాణ ప్రభుత్వం తెరలేపిందని ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల మంత్రివర్గ సమావేశంలో హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ(హెచ్‌ఐఎల్‌టీపీ)కి ఆమోదం తెలపడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఓఆర్‌ఆర్ లోపల ఉన్న పారిశ్రామిక వాడల్లోని భూములను మల్టీ యూజ్ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన హెచ్‌ఐఎల్‌టీపీ వెనుక భారీ కుంభకోణం ఉందని ఆరోపించారు. మంత్రివర్గం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓఆర్‌ఆర్ లోపల దశాబ్దాల కిందట అప్పటి ప్రభుత్వాలు పారిశ్రామిక వాడలకు భూములు కేటాయించాయని అన్నారు. నాచారం, బాలానగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, పటాన్‌చెరు, కాటేదాన్, ఉప్పల్, మల్లాపూర్, చర్లపల్లి, కుషాయిగూడ తదితర పారిశ్రామిక వాడల్లో ఉన్న దాదాపు 10 వేల ఎకరాలను ఏకపక్షంగా మల్టిపుల్ జోన్లుగా మార్చి.. రూ.వేల కోట్లు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని ఆయన ఆరోపించారు.

## స్పీకర్ నిర్ణయాన్ని బట్టి రాజీనామాపై నిర్ణయం

- ఉప ఎన్నిక వచ్చినా ప్రజలు గెలిపించేది నన్నే: కడియం



ధర్మసాగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజీనామా విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని బట్టి తన నిర్ణయం ఉంటుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం (23వ తేదీ) లోపు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులిచ్చారని, అయితే మరింత సమయం కావాలని ఆయన్ను కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి ఎమ్మెల్యే వేలేరు, ధర్మసాగర్ మండలాలకు చెందిన మహిళలకు ఇందిరా మహిళా శక్తి ద్వారా చీరలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కడియం మాట్లాడుతూ.. గత పదేళ్లలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం అధికార పార్టీలో ఉండి కూడా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తున్నట్టు వెల్లడించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరేనని దుయ్యబట్టారు. వాళ్లు చేస్తే సంసారం.. వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా.. అని ఘాటుగా విమర్శించారు. ఒకవేళ ఉప ఎన్నిక వస్తే పోటీ చేసేది తానేనని.. ప్రజలు గెలిపించేది కూడా తననేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## దేవాలయాలకు జీఎస్టీ నోటీసులా?: టీపీసీసీ

హైదరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ కట్టాలంటూ దేవాలయాలకు కేంద్రం నోటీసులు పంపిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చరణ్ కౌశిక్ యాదవ్ ఆరోపించారు. హిందుత్వం పేరుతో ఓట్లు పొందే బీజేపీ.. ఆలయాలపై జీఎస్టీ వేయడం ఆశ్చర్యంగా ఉందని, ఇది కక్ష సాధింపు చర్యేనన్నారు. దీనిపై బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాజా సింగ్ మాట్లాడాలని చరణ్ డిమాండ్ చేశారు.

### దేవాలయాల్లో జీఎస్టీ రద్దు చేయాలి: వీహెచ్‌పీ

రాష్ట్రంలోని దేవాలయాల్లో జీఎస్టీని రద్దు చేయాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం భక్తి ముసుగులో వ్యాపారం చేస్తోందని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, సహ కార్యదర్శి చింతల వెంకన్న ఒక ప్రకటనలో ఆరోపించారు.

## బీసీల రాజకీయ ఎదుగుదలకు జీవో 46 ఉరితాడు: జాజుల

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో జరగబోయే సర్పంచ్ ఎన్నికల కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో 46 బీసీల రాజకీయ ఎదుగుదలకు ఉరితాడు లాంటిదని ఆయన మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక రిజర్వేషన్లు మొత్తం 50 శాతానికి మించకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవో 46ను విడుదల చేయడం కాంగ్రెస్, బీజేపీల కుట్ర ఫలితమేనని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బీసీలను రాజకీయంగా అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జీవో 46ను తక్షణమే రద్దు చేసి, జీవో 9 మాత్రమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా జీవో 46 ప్రతులను దగ్ధం చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిరసన తెలపాలని శ్రీనివాస్ గౌడ్ బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# బీసీ సర్పంచుల రిజర్వేషన్‌కు ఆధారం.. 2024 కులగణనే

(మొదటిపేజీ తరువాయి)

అనుసరించాల్సి వస్తే అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే డ్రా తీస్తారు. ఆదివారం రాత్రికల్లా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఆ వెంటనే ఖరారైన రిజర్వేషన్ల వివరాలను పేర్కొంటూ జిల్లాల వారీగా కలెక్టర్లు ఎక్కడికక్కడ గెజిట్‌లు జారీ చేస్తారని సమాచారం. 2018 నాటి పంచాయతీరాజ్ చట్టం ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించే రిజర్వేషన్ల శాతం ఉంటుంది. మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కూడా పంచాయతీ ఎన్నికలకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటున్నాయి. ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్, మహిళ... వరుసగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల కేటాయింపునకు అనుసరించాల్సిన విధానాన్ని ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.46లో స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు (ఎస్టీ, ఎస్సీ, బీసీ) కలిపి 50 శాతం మించకుండా స్థానాలను ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లలో రొటేషన్ పద్ధతిని కచ్చితంగా అమలు చేయాలంది. అంటే 2019 ఎన్నికల్లో రిజర్వుడుగా ప్రకటించిన వాటిని కాకుండా ఈసారి కొత్త స్థానాలను రిజర్వు చేస్తారు. ఎక్కడైనా ఇలా వీలు కానప్పుడు లాటరీ పద్ధతిన కూడా రిజర్వేషన్లు ఖరారుచేసే వెసులుబాటు పెట్టారు. సర్పంచి స్థానాల రిజర్వేషన్లకు సంబంధించి ఎస్టీ, ఎస్సీలకు 2011 జనాభా లెక్కలు పరిగణనలోకి తీసుకుంటారు. బీసీలకు మాత్రం 2024 కులగణన ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. వార్డు సభ్యుల విషయంలో ఎస్టీ, ఎస్సీ బీసీ వర్గాల మొత్తానికి 2024 కులగణన జనాభాను ఆధారంగా తీసుకుని రిజర్వేషన్లు కేటాయిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు మరింత పారదర్శకంగా, చట్టబద్ధంగా జరుగుతాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ విధంగా రిజర్వేషన్ల అమలుకు వీలుగా పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 9, 17, 146, 147, 175, 176లను సవరించారు.

- సర్పంచుల రిజర్వేషన్లకు ఎస్టీ, ఎస్సీ, రిజర్వేషన్ల కోసం 2011 జనాభా లెక్కలు, బీసీ రిజర్వేషన్ల కోసం 2024 కులగణన జనాభాను ప్రామాణికంగా తీసుకుంటారు.
- వార్డు సభ్యుల రిజర్వేషన్‌కు ఎస్టీ, ఎస్సీ, బీసీ రిజర్వేషన్ల కోసం 2024 కులగణన జనాభాను





ప్రామాణికంగా తీసుకుంటారు.

- షెడ్యూల్డ్ ఏరియాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ఎం(1) ప్రకారం పంచాయతీరాజ్ చట్టంలోని కొన్ని అంశాలు షెడ్యూల్ ప్రాంతాలకు (5వ షెడ్యూల్ ప్రాంతాలు) వర్తించవు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఎస్టీలకు మొత్తం సీట్లల్లో సగం కంటే తక్కువగా రిజర్వేషన్లు ఉండకూడదు. అంతేకాకుండా ఈ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీల సర్పంచి పదవులు తప్పనిసరిగా ఎస్టీలకే రిజర్వ్ చేస్తారు. ఏ గ్రామ పంచాయతీలోనైతే 100 శాతం జనాభా ఎస్టీలే ఉంటారో ఆ గ్రామ పంచాయతీలోని అన్ని వార్డులు, సర్పంచి పదవులు ఎస్టీలకే కేటాయిస్తారు.
- మొదట ఎస్టీ జనాభా నిష్పత్తి అత్యధికంగా ఉన్న గ్రామ పంచాయతీలు/వార్డులను గుర్తించి రిజర్వ్ చేయాల్సిన సంఖ్య మేరకు స్థానాలను కేటాయిస్తారు. ఎస్టీలకు కేటాయించిన స్థానాలకు మినహాయించి, మిగిలిన స్థానాల్లో ఎస్సీ జనాభా నిష్పత్తి అధికంగా ఉన్న స్థానాలను ఆ వర్గానికి కేటాయిస్తారు. ఇక ఎస్టీ, ఎస్సీలకు కేటాయించిన స్థానాలను పక్కనపెట్టి మిగిలిన స్థానాల్లో బీసీ జనాభా అధికంగా ఉన్న స్థానాల్లో ఆ వర్గాలకు కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ కేటగిరీలకు రిజర్వ్ చేసిన తర్వాత మిగిలిన స్థానాలను అన్ రిజర్వ్ కేటగిరీగా పరిగణిస్తారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, అన్-రిజర్వ్‌డ్ కేటగిరీలలోని మొత్తం పదవుల్లో సగం మహిళలకు రిజర్వ్ చేస్తారు. గత ఎన్నికల్లో మహిళలకు రిజర్వ్ చేసిన వార్డులు/గ్రామ పంచాయతీలను ఈసారి సాధ్యమైనంత వరకు అదే కేటగిరీకి రిజర్వ్ చేయకుండా చూస్తారు. మహిళా రిజర్వేషన్ల సంఖ్య లెక్కింపులో 0.5 కంటే తక్కువ ఫ్రాక్షన్‌ను సున్నా (0)గా పరిగణించాలి. ఉదాహరణకు 3.5 అయితే.. 3గా లెక్కించాలి. ఇలా అవరోహణ కేటాయింపులు చేసిన తర్వాత మిగిలిన వార్డులు/గ్రామపంచాయతీలను మహిళలకు కేటాయించడం కోసం లాటరీ పద్ధతిని అనుసరిస్తారు.
- గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించకుండా జాగ్రత్త వహించాలి. ఇక 2019 ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు అయ్యి ఆ పదవులకు ఎన్నికలు జరగని పక్షంలో ఆ రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించవచ్చు.
- తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 9ప్రకారం వార్డు రిజర్వేషన్లపై ఎంపీడీవో నిర్ణయం తీసుకుంటారు.
- ఇక సెక్షన్ 17 ప్రకారం రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో) సర్పంచి పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. వార్డుల మాదిరిగానే జనాభా నిష్పత్తి ప్రకారం గ్రామ పంచాయతీలను అవరోహణ క్రమంలో గుర్తిస్తారు. గత ఎన్నికల్లో రిజర్వ్ అయిన స్థానాలను మినహాయించి ఆయా కేటగిరీ రిజర్వేషన్ల సంఖ్య పూర్తయ్యే వరకు రొటేషన్ పద్ధతిలో కేటాయింపు ఉంటుంది.

### నేడు గెజిట్ నోటిఫికేషన్

నూతన సమగ్ర మార్గదర్శకాలను వెంటనే అమలు చేయాలని డైరెక్టర్, రాష్ట్ర ఎన్నికల అథారిటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అథారిటీలకు(హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా) ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఈ సమగ్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపీడీవోలు, ఆర్డీవోలు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే జిల్లాల వారీగా రిజర్వేషన్ల గెజిట్ నోటిఫికేషన్లను అధికారికంగా విడుదల చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటారు. అయితే.. ఆదివారం సాయంత్రం గెజిట్ విడుదల చేయడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ గెజిట్ విడుదలైన తర్వాతనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మార్గం సుగమం అవుతుంది.

## అదృష్టం తారుమారు!

- సర్పంచ్ రిజర్వేషన్లల్లో మార్పులతో పలువురికి చేజారనున్న పదవులు
- బీసీ స్థానాలు జనరల్ కావడంతో మారుతున్న లెక్కలు

ఖమ్మం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల అంశంలో ప్రతిపాదిత మార్పులు.. ఇన్నాళ్లూ తమకు సర్పంచ్ పదవి ఖాయమనుకున్న కొందరి అదృష్టాన్ని తారుమారు చేస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఖరారు చేసి సెప్టెంబరు 29న ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో పలు గిరిజన తండాల్లో సర్పంచ్ పదవులు బీసీలకు దక్కాయి. దీనిపై ఎస్సీ, ఎస్టీ ఓటర్లు అధికంగా ఉన్న తండాల్లో నిరసనలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే, తాజా ప్రతిపాదనల మేరకు బీసీ రిజర్వేషన్లు తగ్గడంతో పలు తండాల సర్పంచ్ పదవులు జనరల్‌కు మారనున్నాయి. దీంతో పదవిపై ఆశలు పెట్టుకున్న బీసీలకు పోటీకి ఎదురవ్వనుంది. ఇందుకు సంబంధించి ఖమ్మం జిల్లాలో నెలకొన్న పరిస్థితిపై అనధికారిక సమాచారం ఇలా ఉంది.

● ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మంగలితండాలో 829 మంది ఓటర్లు ఉండగా.. అందరూ గిరిజనులే. సెప్టెంబరు 29 నాటి నోటిఫికేషన్ ప్రకారం ఈ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ చేశారు. దీంతో మంగలితండాకు చెందిన గిరిజన యువకుడిని ప్రేమించి పెళ్లాడిన బానోత్ అనిత అనే బీసీ మహిళకు అదృష్టం వరించింది. హైదరాబాద్‌లో రోజువారీ పనులు చేసుకుంటున్న ఆమెను హుటాహుటిన కూసుమంచికి రప్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆమెను కాంగ్రెస్ పార్టీలో చేర్చారు. ఆమెకే పదవి ఖాయమని అంతా అనుకుంటుండగా.. తాజా రిజర్వేషన్లలో మంగలి తండా జనరల్‌గా మారే అవకాశం ఉంది. దాంతో గిరిజనులకు అక్కడ నేరుగా పోటీ చేసే అవకాశం లభించనుంది. అదే జరిగితే సర్పంచ్‌గా బానోత్ అనితకు పోటీ ఎదురుకానుంది. లేదా ఆమె స్థానం గిరిజనులకే దక్కే అవకాశముంది.

● కూసుమంచి మండలంలోని ధర్మాతండాను గత నోటిఫికేషన్‌లో బీసీ జనరల్ చేశారు. ఈ తండాలో కూడా అంతా గిరిజన ఓటర్లే. అయితే, సమీప గ్రామమైన కేశ్వాపురానికి చెందిన కుమ్మరికుంట్ల నాగరాజు తన భార్యతో కలిసి ధర్మాతండాలో నర్సరీ నిర్వహిస్తున్నాడు. నాగరాజు ఒక్కడే బీసీ జనరల్ ఓటరుగా ఉండగా.. ఆయన సర్పంచ్ అవ్వడం ఖాయమని అంతా అనుకున్నారు. నాగరాజుకే టికెట్ ఇవ్వాలని మంత్రి పొంగులేటి ఆయనను పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడు ధర్మాతండా జనరల్ అయ్యే అవకాశం ఉండగా.. తండావాసులే సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం అధికంగా ఉంది.

## రేవంత్‌రెడ్డిది ల్యాండ్ లూటింగ్ పాలసీ

- ఆయన పేరు ఎనుముల కాదు.. అమ్మకాల రేవంత్‌రెడ్డి
- రూ.5 లక్షల కోట్ల భూములు రూ.5 వేల కోట్లకు అమ్మకమా?
- ఇది మీ అయ్య జాగీర్ కాదు:హరీశ్



హైదరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పారిశ్రామిక భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రైవేటు వ్యక్తులకు తెగనమ్ముతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఆయన పేరు ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు, అమ్మకాల రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చింది హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ కాదు.. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నమ్మకాన్ని పెంచిన ప్రభుత్వమయితే, కాంగ్రెస్‌ది అమ్మకాన్ని పెంచిన ప్రభుత్వమని హరీశ్ రావు విమర్శించారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న 9,292 ఎకరాల పారిశ్రామిక పార్కుల భూముల విలువ రూ.5 లక్షల కోట్లు అయితే.. వాటిని రూ.5 వేల కోట్లకే ఎందుకు కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. మిగతా రూ.4.95 లక్షల కోట్లు కుంభకోణం కాదా? దీని వెనుక ఉన్న మతలబు ఏమిటి? అని నిలదీశారు. 9,292 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీలు పోగా 4,740 ఎకరాలే ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు బుకాయిస్తున్నారని విమర్శించారు. ఈ కుంభకోణం రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ కంటే రెండు రెట్లు అధికమని తెలిపారు. ఈ అంశంపై బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు.

### పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు ఒక న్యాయమా?

టీజీఐఐసీ రేటును పక్కనబెట్టి, భూమి ఎస్ఆర్‌వో రేటులో 30 శాతం కడితే చాలు అని రేవంత్ ప్రభుత్వం ఎలా నిర్ణయిస్తుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'హైదరాబాద్‌లో ఎస్ఆర్‌వో ధరలు తక్కువగా ఉన్నాయి.. త్వరలో పెంచుతామని ప్రకటనలు చేసిన రేవంత్ ప్రభుత్వం.. ఇప్పటి వరకు పెంచలేదు. ముందుగా ఓఆర్ఆర్ లోపల, ఆ తర్వాత బయట పెంచుతామన్నారు. అది అమలులోకి రాకముందే ఈ పాలసీని ఎవరి మేలు కోసం తెచ్చారు? పారిశ్రామికవేత్తలకు ఒక విధానం, పేదలకు ఒక విధానమా? సవరించిన భూముల రేట్లు కేవలం పేదలకేనా? పేదవాడు కొన్న భూమికి ఎస్ఆర్‌వోపై 60 - 80 శాతం ఎల్ఆర్ఎస్ వసూలు చేశారు. ఇప్పుడు 30 శాతానికే పారిశ్రామిక భూములను మల్టీపుల్ జోన్‌గా మారుస్తున్నారు. పేదవాడికి ఒక న్యాయం.. పెద్దోడికి ఒక న్యాయం ఉంటదా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. దేశంలో ఇంత పెద్ద కుంభకోణం మరొకటి లేదని, దీనిపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. 'ఇది మీ అయ్య జాగీర్ కాదు. నాలుగు కోట్ల ప్రజల ఆస్తి. మీరు ఇష్టం వచ్చినట్లు అమ్ముతామంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు' అని హెచ్చరించారు.

## దమ్ముంటే ఆధారాలతో నిరూపించు

- మేము ఏ ప్రభుత్వ భూమినీ అమ్మకానికి పెట్టలేదు
- అవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములే
- మీ ఫ్రీహోల్డ్ జీవోల వెనుక ఉన్న రూ.లక్షల కోట్ల మతలబేంటి?
- హరీశ్‌కు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్



హైదరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన విమర్శలను ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తిప్పికొట్టారు. దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని శనివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. 'అబద్ధాలు ప్రచారం చేయడం బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య. వారు పదేపదే చేస్తున్న రూ.5 లక్షల కోట్ల కుంభకోణం ఆరోపణలు పూర్తిగా నిరాధారం, అవాస్తవం. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలి. లేదంటే ఈ ప్రచారం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నదని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

### మీరు తెచ్చిన జీవోల్లో మతలబేంటి?

తిమ్మిని బమ్మిని చేయడంలో కేటీఆర్, హరీశ్‌రావును మించినవారు మరొకరు లేరని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. 'మీరు 2023 ఆగస్టులో తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోల (19, 20, 21) వెనుక ఉన్న రూ.లక్షల కోట్ల మతలబు గురించి ముందు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పండి. పారదర్శకంగా రాష్ట్ర ఖజానాకు రూ.4 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు మేము ప్రయత్నిస్తుంటే.. కుంభకోణాలు అలవాటైన బీఆర్ఎస్ నేతలకు మింగుడు పడటం లేదు. సరిగ్గా గత అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు.. ప్రభుత్వం నుంచి తీసుకున్న లీజు భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు ఇచ్చి 100 - 200 శాతం ఛార్జీలు విధించి మీరు వసూలు చేద్దామనుకున్న రూ.లక్షల కోట్ల సంగతేంటి? ప్రభుత్వంతో సంబంధం లేని సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు నమ్ముతారనే భ్రమ నుంచి ముందు బయటకు రండి' అని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు దక్కకుండా బీఆర్ఎస్ నేతలు అడ్డుకుంటున్నారని విమర్శించారు. వాస్తవాలను దాచిపెట్టి ప్రభుత్వం 9,292 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టిందని తమపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ భూముల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసిన ప్రాంతం (ఫ్రీహోల్డ్ ప్రాపర్టీ) 4,740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములని స్పష్టం చేశారు. మిగిలిన భూములు రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించామని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు నిజనిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

## పత్రికల రిజిస్ట్రేషన్ల బాధ్యత కలెక్టర్లకే

'స్పెసిఫైడ్ అథారిటీస్'గా నియమిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దిన పత్రికలు, పీరియాడికల్స్ రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను 'స్పెసిఫైడ్ అథారిటీస్'గా నియమించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇకపై దిన పత్రికలు, పీరియాడికల్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ పద్ధతిలో 'ప్రెస్ సేవా పోర్టల్' ద్వారా జరుగుతుంది. స్పెసిఫైడ్ అథారిటీస్ అయిన కలెక్టర్లు తమ లాగిన్ వివరాలను ఉపయోగించి, పోర్టల్ ద్వారా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించడం, నిరభ్యంతర పత్రాలు జారీ చేయడం, రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడం వంటి ప్రక్రియలను చేపట్టాల్సి ఉంటుంది.

## ఎంపీహెచ్‌ఎస్ పోస్టుల్లో సర్వీసు వెయిటేజీ పెంపు చెల్లదు

- అసలు నోటిఫికేషన్‌లోని నిబంధనలను పాటించండి
- హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ) పోస్టుల భర్తీలో పాల్గొనే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వెయిటేజీని 20 మార్కుల నుంచి 30 మార్కులకు పెంచడం చెల్లదని హైకోర్టు పేర్కొంది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సర్వీసుల్లో ఉన్న వారికి సర్వీసు వెయిటేజీ కల్పిస్తూ వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీచేసిన జీవో 133ను కొట్టివేసింది. అసలు నోటిఫికేషన్‌లోని నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఎంపీహెచ్ఎస్ (మహిళ) ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టం చేసింది. మధ్యలో సర్వీసు వెయిటేజీని ఏకపక్షంగా పెంచడం అక్రమమని, రాజ్యాంగవిరుద్ధమని పేర్కొంటూ పలువురు సాధారణ అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది చిల్లా రమేశ్ వాదిస్తూ.. సర్వీసు వెయిటేజీ పెంపు గత తీర్పులకు విరుద్ధమని, న్యాయసమీక్షకు నిలబడదని పేర్కొన్నారు. వాదనలు విన్న జస్టిస్ పుల్లా కార్తీక్ ధర్మాసనం.. సర్వీసు వెయిటేజీ పెంపు జీవోను, సవరణ నోటిఫికేషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

## బీసీలకు పట్టం

మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయిన వజ్రేశ్‌కుమార్ యాదవ్, ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి పోటీచేసి ఓడిన ఆత్రం సుగుణను డీసీసీ అధ్యక్షులుగా కాంగ్రెస్ నియమించింది. వీరితోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన లకావత్ ధన్వంతి, తెలంగాణ ఉద్యమకారుడు, ఉస్మానియా విద్యార్థి నేత పున్నా కైలాశ్ నేతకు సైతం డీసీసీ అధ్యక్ష పదవి దక్కింది.

| జిల్లా | అధ్యక్షుడు/ అధ్యక్షురాలు | జిల్లా | అధ్యక్షుడు/ అధ్యక్షురాలు |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | డాక్టర్ నరేష్ జాదవ్ | మంచిర్యాల | పిన్నింటి రఘునాథ్‌రెడ్డి |
| ఆసిఫాబాద్ | ఆత్రం సుగుణ | మెదక్ | శివన్నగారి ఆంజనేయులుగౌడ్ |
| భద్రాద్రికొత్తగూడెం | తోట దేవి ప్రసన్న | మేడ్చల్‌మల్కాజ్‌గిరి | తోటకూర వజ్రేశ్ యాదవ్ |
| భువనగిరి | బీర్ల అయిలయ్య | ములుగు | పైడాకుల అశోక్ |
| గద్వాల్ | ఎం.రాజీవ్‌రెడ్డి | నాగర్‌కర్నూల్ | డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ |
| హన్మకొండ | ఎనగాల వెంకట్‌రాంరెడ్డి | నల్గొండ | పున్నా కైలాష్‌నేత |
| హైదరాబాద్ | సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా | నారాయణపేట | కొల్లుకుదురు ప్రశాంత్‌రెడ్డి |
| జగిత్యాల | గజెంగి నందయ్య | నిర్మల్ | వెడ్మబొజ్జు |
| జనగామ | లకావత్ ధన్వంతి | నిజామాబాద్ | కట్పల్లి నగేష్‌రెడ్డి |
| జయశంకర్‌భూపాల్‌పల్లి | బట్టు కరుణాకర్ | నిజామాబాద్ కార్పొరేషన్ | బొబ్బిలి రామకృష్ణ |
| కామారెడ్డి | మల్లికార్జున్ ఆలె | పెద్దపల్లి | మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ |
| కరీంనగర్ | మేడిపల్లి సత్యం | రాజన్న సిరిసిల్ల | సంగీతం శ్రీనివాస్ |
| కరీంనగర్ కార్పొరేషన్ | వి.అంజన్‌కుమార్ | సికింద్రాబాద్ | కె.దీపక్ జాన్ |
| ఖైరతాబాద్ | మోత రోహిత్ ముదిరాజ్ | సిద్దిపేట | తూంకుంట ఆంక్షారెడ్డి |
| ఖమ్మం | నూతి సత్యనారాయణ | సూర్యాపేట | గుడిపాటి నర్సయ్య |
| ఖమ్మం కార్పొరేషన్ | దీపక్ చౌదరి | వికారాబాద్ | ధారాసింగ్ జాదవ్ |
| మహబూబాబాద్ | డాక్టర్ భూక్యా ఉమ | వనపర్తి | శివసేనారెడ్డి, స్పోర్ట్ అథారిటీ చైర్మన్ |
| మహబూబ్‌నగర్ | ఎ.సంజీవ్‌ముదిరాజ్ | వరంగల్ | మహ్మద్ అయూబ్ |



వైరాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క

## దళారులూ దోపిడీ దారులను దగ్గరికి రానివ్వం

» ప్రజా సంక్షేమానికే తమ సర్కారు అంకితం: భట్టి విక్రమార్క

వైరా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దళారులు, దోపిడీ దారులను దగ్గరికి రానివ్వబోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నిరంతరం అభివృద్ధి వైపు అడుగులేస్తున్న తమ సర్కారు ప్రజా సంక్షేమానికే అంకితమన్నారు. ఖమ్మం జిల్లా వైరా అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రూ.400 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. 2047 నాటికి ప్రపంచంతో పోటీ పడే స్థాయికి తెలంగాణ చేరుకుంటుందన్నారు. తమ సర్కారు పైసా పైసా పోగు చేసి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. విద్యతోనే సామాజిక మార్పు జరగడంతోపాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్న భట్టి .. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉండాలన్నదే తమ సర్కారు లక్ష్యమన్నారు.

## మహిళలకు రైస్‌మిల్లులపై క్యాబినెట్‌లో చర్చిస్తాం: మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రైస్ మిల్లుల ఏర్పాటు చేసే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి క్యాబినెట్‌లో చర్చిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో శనివారం ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు.

## డిసెంబరు 5 కల్లా కాళేశ్వరం బ్యారేజీల.. డిజైన్ కన్సల్టెంట్ ఎంపిక చేయాలి: ఉత్తమ్



హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ కోసం డిజైన్ కన్సల్టెంట్ ఎంపిక ప్రక్రియను డిసెంబరు 5 కల్లా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రాబోయే 6 నెలల నుంచి 36 నెలల కాలంలో కొత్తగా ఆయకట్టును అందుబాటులోకి తెచ్చే ప్రాజెక్టుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఇక నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతి కోసం తగిన చర్యలు చేపట్టాలన్నారు.

## కల్లు గీత కార్మిక సంఘాలకు 45 లక్షల తాటి, ఈత మొక్కలు

» చెర్లగూడెం రిజర్వాయర్‌కు బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టేందుకు కృషి : మంత్రి పొన్నం ప్రభాకర్



బర్కత్‌పుర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కల్లు గీత కార్మిక సంఘాలకు 45 లక్షల తాటి, ఈత మొక్కలను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాటిని నాటేందుకు, పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. మర్రిగూడెం మండలం చెర్లగూడెం రిజర్వాయర్‌కు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టేందుకు కృషి చేస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర సదస్సు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, ఈ విషయమై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతామన్నారు

## మెడికల్ షాపుల్లో క్యూఆర్ కోడ్ తప్పనిసరి

» రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ కీలక ఆదేశాలు

» ఔషధాలతో దుష్ప్రభావాలుంటే క్యూఆర్ కోడ్ లేదా టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు

PvPI Toll Free Number
1800 180 3024

పీవీపీఐ టోల్ ఫ్రీ నంబరు, ప్రత్యేక క్యూఆర్ కోడ్

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపుల్లో ఇకపై పీవీపీఐ ప్రత్యేక క్యూఆర్ కోడ్, టోల్ ఫ్రీ నంబరును తప్పనిసరిగా ప్రదర్శించాలని రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ (డీసీఏ) కీలక ఆదేశాలు జారీ చేసింది. ఔషధాలకు సంబంధించిన ప్రతికూల ప్రభావాలను గుర్తించి నివారించడం (ఫార్మకోవిజిలెన్స్ బలోపేతం), రోగుల భద్రతను పెంచే జాతీయ కార్యక్రమంలో భాగంగానే ఈ నిబంధనలను అమల్లోకి తెచ్చినట్లు వెల్లడించింది. మెడికల్ షాపుల్లో తీసుకునే ఔషధాలకు సంబంధించి దుష్ప్రభావాలు కనిపిస్తే ఆయా షాపుల్లో ప్రదర్శించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. అది సాధ్యం కాకపోతే డీసీఏ టోల్ ఫ్రీ నంబరు 1800-180-3024ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని సూచించింది. ఇలా వచ్చే ఫిర్యాదులన్నీ ఏడీఆర్ఎంఎస్ (అడ్వెర్స్ డ్రగ్ రియాక్షన్ మానిటరింగ్ సిస్టమ్)కు వెళ్తాయని వెల్లడించింది. పీవీపీఐ క్యూఆర్ కోడ్, టోల్ ఫ్రీ నంబరును షాపులో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని స్పష్టం చేసింది.

## 9మంది నాన్ కేడర్ ఎస్పీల బదిలీలు

హైదరాబాద్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 9మంది నాన్ కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(ఇన్‌చార్జి) వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐ బొమ్మ కేసును పరిశోధించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ దార కవితను వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీగా వి.అరవింద బాబును నియమించారు.

## కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగానికి నూతన డైరెక్టర్

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగానికి(సీఎస్ఆర్) నూతన డైరెక్టర్‌గా జయశ్రీ కొప్పురపు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిశ్రమల శాఖ అధీనంలోని సోషల్ ఇంపాక్ట్ గ్రూప్‌నకు ఆమె నాయకత్వం వహిస్తారు.

# నియంతలను తరిమికొట్టిన కళాకారులు



అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ తదితరులు

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'కవి రాసే పెన్నుల మీద మన్నుగప్పితే ఆ పెన్నులు గన్నులై మొలకెత్తి గడీలను కుప్పకూలుస్తాయి' అన్న నినాదాన్ని నిజం చేసినవారు అందెశ్రీ అని కొనియాడారు. కవులు, కళాకారుల్లో అందెశ్రీ కోహినూర్ లాంటివారని అభివర్ణించారు. తనకు ఆయన ఎంతో ఆప్తులని, మనసుకు దగ్గరివారని భావోద్వేగంతో చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సారథ్యంలో శనివారం రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ రాష్ట్రగీత రచయిత అందెశ్రీ సంస్మరణసభకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ హాజరయ్యారు. అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణకు ప్రేరణగా నిలిచిన అందెశ్రీ రాసిన 'జయజయహే తెలంగాణ' గీతం గత పాలకుల నిర్ణయాల వల్ల అప్పట్లో మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గీతం తెలంగాణ గుండెల్లో ప్రతిధ్వనించినంత కాలం గద్దర్, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయరాజ్ తదితర కవులు, కళాకారుల పోరాటం వల్లే రాష్ట్రం సిద్ధించిందన్న భావన నెలకొంటుందనే నాటి సర్కారు కుట్ర చేసిందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు కోట్ల ప్రజలు కోరుకున్న 'జయజయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్రగీతంగా ప్రకటించిందని పేర్కొన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం తన బాధ్యత అని.. అందులో భాగంగా ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం తొలి వార్షికోత్సవం సందదర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన అందెశ్రీ సహా తొమ్మిదిమంది ఉద్యమకారులకు రూ.కోటి నగదు పురస్కారంతో పాటు ఒక్కొక్కరికి 300గజాల ఇంటి స్థలం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తొమ్మిది మంది ఉద్యమకారుల కుటుంబసభ్యులు ఆత్మగౌరవంతో జీవించేలా భారత్ ఫ్యూచర్ సిటీలో వారికి అద్భుతమైన ఇళ్లను నిర్మించి ఇస్తామని, ఆ బాధ్యతను మంత్రి దామోదరకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తనకు దళితుల సమస్యల మీద అవగాహన ఉంది అని రేవంత్ అన్నారు. "మా గ్రామ దళితులు అండగా నిలవడం వల్లే మోతుబరి రైతులుగా సమాజంలో మేము గుర్తింపు పొందగలిగాం. ఇప్పుడు మీరంతా ఆశీర్వదించారు కాబట్టే తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాను" అని సభకు హాజరైన దళితులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మంత్రివర్గంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ముగ్గురుంటే, నలుగురు దళితులున్నారని, స్పీకరు కూడా అదే సామాజిక వర్గం నుంచి వచ్చిన వ్యక్తి అని గుర్తుచేశారు. రాష్ట్రంలో 17% దళిత జనాభా ఉంటే 27శాతం మేర ప్రాతినిధ్యం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కాగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్రలో నిలుస్తారని మాజీ మంత్రి మోత్కుపల్లి పేర్కొన్నారు.

### రెండు రోజుల వేడుకలు..

# రెండేళ్ల విజయోత్సవాలుగా

» తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలి

» అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని, ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తికావస్తున్నందునా... ఆ రెండు రోజుల వేడుకలు రెండేళ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవడంతో పాటు రైజింగ్ డాక్యుమెంట్‌లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాలుపంచుకోవాలని కోరారు. ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించాల్సిన గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శనివారం సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రితో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు చేయనున్నట్లు సీఎం తెలిపారు. అభివృద్ధిలో కీలకమైన రంగాలు, అందులో పాలుపంచుకునే అనుసంధాన విభాగాలన్నింటితో ఒక్కో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేళ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో ఆయా విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. ఈ సమీక్షల్లో వచ్చే మరిన్ని విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలతో డాక్యుమెంట్‌కు తుదిరూపం ఇస్తామని చెప్పారు.

### 9న తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

డిసెంబరు 8న ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాల విజయాలను చాటి చెప్పాలని, డిసెంబరు 9న తెలంగాణ భవిష్యత్తు దార్శనికత, ప్రణాళికలను పొందుపరిచిన 'తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యాలను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ సమావేశాలు కూడా నిర్వహించాలని సూచించారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్ని కళ్లకు కట్టించే ఆడియో, వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని చెప్పారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని, ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడడంతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు.

## నేడు పుట్టపర్తికి సీఎం రేవంత్

సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి

అనంతరం ఫ్యూచర్ సిటీకి.. గ్లోబల్ సమ్మిట్ పనుల పరిశీలన

హైదరాబాద్/రంగారెడ్డి/మక్తల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సత్యసాయిబాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తికి వెళ్లనున్నారు. ఆదివారం ఉదయం ఆయన హైదరాబాద్ నుంచి పుట్టపర్తికి చేరుకుంటారు. సాయికుల్వంత్ హాల్‌లో నిర్వహించనున్న సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం ఆయన ఫ్యూచర్ సిటీకి రానున్నారు. డిసెంబరు 8 నుంచి 11వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో సర్కారు గ్లోబల్ సమ్మిట్-2025 నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆ సదస్సు పనులను పరిశీలించేందుకు సీఎం రేవంత్ మీర్‌ఖాన్‌పేటకు వస్తున్నారు. సీఎం రాక నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబుతోపాటు పలువురు ఉన్నతాధికారులు శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి 1,300 ప్రముఖ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరుకానుండడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సదస్సు నిర్వహణ కోసం మీర్‌ఖాన్ పేట రెవెన్యూ పరిధిలోని దాదాపు 300 ఎకరాలను చదును చేస్తున్నారు. కాగా, జిల్లాల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ డిసెంబరు 1న నారాయణపేట జిల్లా మక్తల్‌కు రానున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజున గోలపల్లి శివారులో హెలిప్యాడ్ నుంచి నేరుగా కాట్రేవ్‌పల్లి రోడ్ వద్దకు సీఎం చేరుకొని నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు చెక్కులు అందజేస్తారని వెల్లడించారు. అనంతరం గోలపల్లి శివారులో రూ.200 కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని వాకిటి పేర్కొన్నారు.

### సీఎం రేవంత్‌ను కలిసిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి

మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలను ఆయనకు తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, క్రీడా యూనివర్సిటీతోపాటు ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను మోహన్ యాదవ్‌కు వివరించారు.

## వైద్య రంగంలో సాంకేతికతే కీలకం

మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్

బంజారాహిల్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో వైద్య రంగంలో సాంకేతికత పరిజ్ఞానం కీలకంగా మారిందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి అన్నారు. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో కామన్వెల్త్ మెడికల్ ఏఐ గ్లోబల్ సమ్మిట్ శనివారం ప్రారంభమైంది. వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, దాని ప్రయోజనాలు-సవాళ్లు, ఆరోగ్య సేవల్లో ఏఐ పాత్రపై వైద్యులు, మెడికల్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం, వివేక్ వెంకట్ స్వామి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ వైద్య రంగ నిపుణులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఆరోగ్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆధునిక వైద్య సాంకేతికత అభివృద్ధి చెందడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా వైద్యసేవల కోసం హైదరాబాద్‌కు వస్తున్నారన్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించేందుకు ఏఐ సమ్మిట్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. భవిష్యత్తు అంతా సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి ఉందన్నారు. వైద్య రంగంలో ఏఐ ఆధారిత చికిత్సల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో అనేక మంది మెరుగైన వైద్యం కోసం నగరానికి వస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

### మహిళలు బహుముఖ ప్రతిభావంతులు

» అన్ని రంగాల్లో ప్రాధాన్యమిస్తున్న సీఎం

» కోటి మందికి చీరల పంపిణీ: వివేక్

సిద్దిపేట/నర్సాపూర్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఇంటా బయటా ఎంత ఒత్తిడి ఉన్నా మహిళలు వివిధ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారని, సమాజంలో బహుముఖ ప్రతిభావంతులుగా రాణిస్తున్నారని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రశంసించారు. మెదక్ జిల్లా నర్సాపూర్, సిద్దిపేట జిల్లా గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటలో శనివారం మహిళా సంఘాల సభ్యులకు ఇందిరా మహిళాశక్తి చీరలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళా శక్తిని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు.

# త్వరలో స్కిల్ సెంటర్లుగా పాలిటెక్నిక్‌లు

» నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు ప్రభుత్వం మద్దతు: మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీని ఏర్పాటు చేసిందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇప్పటికే ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని, త్వరలో పాలిటెక్నిక్‌లనూ స్కిల్ సెంటర్లుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నైపుణ్యాభివృద్ధితోపాటు పరిశోధనలకు మద్దతివ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జేఎన్‌టీయూలో గ్లోబల్ అలుమ్నీ మీట్‌ను శనివారం శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2047నాటికి తెలంగాణను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా మార్చే లక్ష్యంతో "తెలంగాణ రైజింగ్ 2047"విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబరు 8, 9తేదీల్లో ఆవిష్కరిస్తున్నామని, దీనిని మరింత మెరుగ్గా రూపొందించేందుకు సూచనలు ఇవ్వాలని జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థులను కోరారు. ప్రస్తుత విద్యార్థులకు ఆవిష్కరణలు, పరిశోధనలు, బలమైన మార్గదర్శకత్వం వంటి అవసరాలను తీర్చేలా గ్లోబల్ అలుమ్నీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని వర్సిటీ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. 21వ శతాబ్దం విజ్ఞాన విప్లవ కాలం అన్నారు. వనపర్తి, పాలేరు, మహబూబాబాద్, సిరిసిల్లలోని జేఎన్‌టీయూ కళాశాలలకు సొంత భవనాలు, కనీస మౌలిక వసతులు లేకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి మౌలిక సదుపాయాల ప్రమాణాలపరంగా జేఎన్‌టీయూ బ్రాండ్ విలువను తగ్గిస్తున్నాయన్నారు.

### చెరుకు రైతుల సమస్యలపై అధ్యయనం

హైదరాబాద్: చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారాలు సూచించేందుకు ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. సచివాలయంలో ఆయన చెరుకు రైతులు, పరిశ్రమల ప్రతినిధులు, చెరుకు అభివృద్ధి మండళ్ల ఛైర్మన్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో ఏటా చెరుకు సాగు విస్తీర్ణం తగ్గుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన ప్రధాన అంశాలపై అందరితో చర్చించి నివేదిక రూపొందించేందుకు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## తెలియదు.. గుర్తులేదు!

» విచారణలో పోలీసులకు 'ఐబొమ్మ' రవి సమాధానాలివే!

» అతణ్ని విచారించడానికి నేరుగా రంగంలోకి సీపీ సజ్జనార్!

» త్వరలో సీఐడీ దర్యాప్తు!.. వివరాలు ఇవ్వనున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సినిమా పైరసీ, బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్, మనీల్యాండరింగ్ కేసులో అరెస్టయిన ఐ బొమ్మ రవి.. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అడుగుతున్న ప్రశ్నలకు 'తెలియదు.. గుర్తులేదు.. మర్చిపోయా' అని సమాధానాలిస్తున్నట్టు సమాచారం. అతణ్ని ఐదురోజుల కస్టడీకి తీసుకున్న పోలీసులు గత మూడు రోజులుగా విచారిస్తున్నారు. కానీ వారు రవి నుంచి ఆశించిన స్థాయిలో సమాధానాలు రాబట్టలేకపోతున్నట్లు తెలిసింది. అతడి ల్యాప్‌టాప్, మొబైల్‌లో ఉన్న డేటా విశ్లేషించడం కోసం యూజర్ ఐడీ, పాస్‌వర్డులు ఇవ్వాలని అడిగినా ఇదే సమాధానం చెప్తున్నాడని పోలీసు వర్గాలు తెలిపాయి. దీంతో.. ఎథికల్ హ్యాకర్స్ సహకారంతో ఆయా పరికరాల్లోని డేటాను వెలికితీస్తున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. కాగా.. సైబర్ క్రైమ్ పోలీసుల అదుపులో ఉన్న రవిని విచారించడానికి సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేరుగా రంగంలోకి దిగినట్లు తెలిసింది. శనివారం సీసీఎస్‌కు వచ్చిన ఆయన.. ఐబొమ్మ రవితో మాట్లాడి పలు విషయాలు రాబట్టిట్లు సమాచారం. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ మనీల్యాండరింగ్ మీదనే పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. రవిని అరెస్టు చేసిన పోలీసులు అతనికి చెందిన 35 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే. వాటిలోకి ఎక్కడెక్కడి నుంచి డబ్బులు డిపాజిట్ అయ్యాయి.. ఎక్కడెక్కడికి డబ్బులు వెళ్లాయి? వాటిని ఎవరు నిర్వహిస్తున్నారు? వంటి వివరాలను పోలీసులు ఆరాతీస్తున్నారు. ఆయా ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీల వివరాలు అందించాలని పోలీసులు బ్యాంకు అధికారులకు లేఖలు రాసినట్లు తెలిసింది. కాగా.. రవి ఖాతా నుంచి అతని చెల్లెలి ఖాతాలకు, అతని స్నేహితుడు నిఖిల్ ఖాతాలకు డబ్బులు డిపాజిట్ అయినట్టు పోలీసులు గుర్తించారు. నిఖిల్ గురించి ఆరా తీయగా.. ఐ బొమ్మ పోస్టర్ డిజైన్ చేసింది నిఖిలే అని పోలీసుల విచారణలో తేలింది.

### దర్యాప్తు.. సీఐడీకి!

బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన ప్రముఖుల కేసును ప్రస్తుతం సీఐడీ పోలీసులు విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సినీ నటులు విజయ్‌దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, రానా సహా.. పలువురిని సీఐడీ అధికారులు విచారిస్తున్నారు. ఐ బొమ్మ రవి కేసులోనూ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ జరగడం, రూ. కోట్లలో కొల్లగొట్టినట్లు తేలడం, మనీల్యాండరింగ్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సీఐడీ ఈ కేసును టేకప్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు సిటీ పోలీసులు పూర్తి వివరాలు సీఐడీకి ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

## భార్యాబిడ్డల్ని వదిలిస్తే 25లక్షలు

» ఆర్థిక నేరగాడు ఉప్పలపాటి సతీశ్ విచారణలో విస్తుపోయే విషయాలు



సీసీఎస్ పోలీసులకు చిక్కిన సతీశ్ ఉప్పలపాటి, శిల్ప బండ

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు దొరికినట్టే దొరికి.. వారితో బేరం కుదుర్చుకొని భార్యాబిడ్డలతో ఉడాయించిన ఆర్థిక నేరగాడు ఉప్పలపాటి సతీశ్‌కుమార్‌ను బెంగళూరులో అరెస్టు చేసిన పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. అయితే, సతీష్ కుమార్‌ను విచారించిన క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. తన కంపెనీల్లో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో లాభాలు ఇస్తామని నమ్మించి సతీశ్.. పలువురి వద్ద నుంచి రూ.23 కోట్లు వసూళ్లు చేసి పరారయ్యాడు. డాక్టర్ వినయ్‌కుమార్ అనే బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు.. ఈ కేసులో సతీశ్‌తో పాటు అతని భార్య శిల్ప బండ, వారి కుమార్తెకు ప్రమేయం ఉందని గుర్తించారు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులు మహారాష్ట్రలో ఉన్నట్టు గుర్తించగా.. ఓ ఎస్సై నేతృత్వంలోని బృందం వారిని అరెస్టు చేసింది.

### రూ. 25లక్షలు డీల్ కుదిర్చిన రిటైర్డ్ అధికారి

సదరు ఎస్సై నిందితులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. గతంలో ఈడీలో పని చేసి రిటైర్డ్ అయిన ఓ అధికారి రంగంలోకి దిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గతంలో ఈడీ కేసులో సతీష్ అరెస్టు అయినప్పుడు అతనికి పరిచయమైన ఆ రిటైర్డు అధికారి, మరో మధ్యవర్తితో కలిసి పథకం వేశాడు. సతీశ్ కుటుంబాన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్న ఎస్సైతో ఒప్పందం కుదిర్చాడు. సతీష్ భార్య, కుమార్తెను వదిలిస్తే రూ.25 లక్షలు ఇస్తామని బేరం మాట్లాడినట్టు సమాచారం. సతీష్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్నాం కాబట్టి మహిళలను వదిలేసినా ఇబ్బంది ఉండదని భావించిన ఆ ఎస్సై వారి ఒప్పందానికి అంగీకరించాడు. అయితే, సదరు ఎస్సైకు టోకరా వేసిన సతీశ్.. సదాశివపేట వద్ద తన భార్య, కుమార్తెతో కలిసి పరారయ్యాడు. భార్య బిడ్డలను పంపించి వస్తానని కారులో కొద్దిదూరం వెళ్లి అక్కడి నుంచి కారు డ్రైవరుతో సహా పారిపోయాడు. దాంతో ఎస్సై నిర్వాకం వెలుగులోకి వచ్చింది. అప్పట్నించి కొద్దిరోజుల పాటు పరారీలో ఉన్న సతీష్ కుటుంబం ఇటీవల బెంగళూరులో పట్టుబడింది.

## నాన్నా.. రేపు నా విన్యాసాలను చూడు!

**» తండ్రి జగన్నాథ్‌తో పైలట్ నమాంశ్ స్యాల్ చివరిమాటలు**



జగన్నాథ్

న్యూఢిల్లీ, నవంబరు 22: 'నాన్నా.. రేపు యుద్ధవిమానంతో నేను చేసే విన్యాసాలను టీవీలోగానీ, యూట్యూబ్‌లో గానీ చూడు'.. తేజస్‌ను నడిపిన పైలట్ నమాంశ్ స్యాల్ ప్రదర్శనకు ముందురోజు తన తండ్రి జగన్నాథ్‌తో మాట్లాడిన ఆఖరి మాటలివి!! శుక్రవారం సాయంత్రం 4గంటలకు కుమారుడి ప్రదర్శనను తిలకించేందుకు ఆ తండ్రి యూట్యూబ్‌లో వెతుకుతుండగా విమానం కూలిపోయిందన్న వార్త తెలిసింది. కంగారుపడిన ఆయన వెంటనే ఐఏఎఫ్ వింగ్ కమాండర్ అయిన తన కోడలి(నమాంశ్ భార్య)కి ఫోన్ చేశారు. పూర్తి వివరాలు ఇంకా తెలియని గందరగోళ స్థితిలో కొద్దిసేపటికే ఆయన ఇంటికి ఆరుగురు ఐఏఎఫ్ అధికారులు వచ్చారు. దీంతో ఆ తండ్రి మనసు కీడు శంకించింది. వారిద్వారే తన కుమారుడు నమాంశ్ ఇక లేడనే చేదు నిజం జగన్నాథ్‌కు తెలిసింది. ముందురోజే తాను కుమారుడితో ఫోన్లో మాట్లాడినట్లు జగన్నాథ్ చెప్పారు. దుబాయ్ ఎయిర్ షోలో భాగంగా శుక్రవారం ఐఏఎఫ్‌కు చెందిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఎమ్‌కే-1 కూలి పైలట్ నమాంశ్ తీవ్ర గాయాలతో మృతిచెందారు.

## మీ దగ్గర ఓట్లుంటే.. నా దగ్గర నిధులున్నాయ్..

**» ఓటర్లను ఉద్దేశించి బెదిరింపు ధోరణిలో అజిత్ పవార్ వ్యాఖ్యలు**



పుణె, నవంబరు 22: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ఓటర్లను ఉద్దేశించి తాజాగా చేసిన బెదిరింపు ధోరణి వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. బారామతి తహసీల్‌లోని మాలేగావ్ నగర పంచాయతీ ఎన్నికల సందర్భంగా శుక్రవారం పవార్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మీ దగ్గర ఓట్లున్నాయి. నా దగ్గర నిధులున్నాయి. మొత్తం 18 మంది నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అభ్యర్థులను ఎన్నుకుంటే నేను నిధుల కొరత లేకుండా చూస్తా. 18 మందిని ఎన్నుకుంటే నేను హామీ ఇచ్చినవి ఇవ్వడానికి కట్టుబడి ఉన్నా. ఒకవేళ మీరు తిరస్కరిస్తే.. నేను కూడా తిరస్కరిస్తా" అని అన్నారు. ఈ వ్యాఖ్యల పట్ల విపక్ష శివసేన (యూబీటీ) నేత అంబదాస్ దన్వే మండిపడ్డారు. అజిత్ పవార్ ఓటర్లను బెదిరిస్తుంటే ఎన్నికల కమిషన్ ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు.

## ట్రంప్‌తో న్యూయార్క్ మేయర్ మమ్దానీ భేటీ



న్యూయార్క్/వాషింగ్టన్, నవంబరు 22: న్యూయార్క్ నగర ఎన్నికల సందర్భంగా పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకున్న మేయర్ జొహ్రాన్ మమ్దానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య సఖ్యత కుదిరింది. మమ్దానీ స్వయంగా వాషింగ్టన్‌కు వచ్చి అధ్యక్షుడిని కలిశారు. ఆయనకు ట్రంప్ వైట్‌హౌస్‌లోకి సాదర స్వాగతం పలికారు. ఇరువురూ అధ్యక్ష భవనంలో సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమ భేటీ చాలా గొప్పగా జరిగిందని ప్రకటించారు. ఇద్దరి ప్రధాన ఉద్దేశమూ న్యూయార్క్ నగర అభివృద్ధేనని ట్రంప్ అన్నారు. న్యూయార్క్ విషయంలో మమ్దానీ ఆలోచనలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు.

## నైజీరియా పాఠశాలలో 315 మంది కిడ్నాప్

అబూజా, నవంబరు 22 : సాయుధులైన దుండగులు నైజీరియాలోని ఓ క్రైస్తవ మిషనరీ పాఠశాలకు చెందిన 315 మందిని అపహరించారు. ఇందులో 303 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులంతా 10 నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికలే. నైజీరియాలోని నైజర్ రాష్ట్రంలో ఉన్న సెయింట్ మేరీ కేథలిక్ పాఠశాలలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఇప్పటిదాకా ఏ సంస్థ ప్రకటన చేయలేదు. వందల సంఖ్యలో విద్యార్థులు అపహరణకు గురికావడంతో దేశవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.



## అయోధ్య రామ మందిరం పనులు సంపూర్ణం

అయోధ్య, నవంబరు 22: అయోధ్యలో శ్రీరామ మందిరం పనులు సంపూర్ణమయ్యాయి. ఈ నెల 25న ప్రధాని మోదీ ఆలయ శిఖరంపై 191 అడుగుల ఎత్తున్న కాషాయ ధ్వజాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో మందిరం తాజా చిత్రాలను ఆలయ ట్రస్టు విడుదల చేసింది. ధ్వజారోహణ ఉత్సవానికి సంబంధించి ఇంజినీర్లు, పురోహితులు కొన్ని రోజులుగా రిహార్సల్లు జరిపారు. ప్రపంచంలోని కోట్లాది మంది హిందువులకు ఇది ఆధ్యాత్మికంగా అద్భుతమైన సందర్భమని ఆలయ ట్రస్టు పేర్కొంది. గత కొన్నేళ్లుగా అయోధ్య ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా వెలుగొందుతోంది. 2020లో 60లక్షల మంది పర్యాటకులు రాగా, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్యన ఏకంగా 23కోట్ల మంది రావడం విశేషం. డిసెంబరు నాటికి 50కోట్ల మంది వస్తారన్న అంచనాలు ఉన్నాయి.

# సింథటిక్ డ్రగ్స్ మహా ప్రమాదం

## ప్రపంచ ఉగ్రవాదానికి దాంతోనే ఊపిరి

**» వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీయాలి**

**» జీ20 సదస్సులో మోదీ పిలుపు**

జోహాన్నెస్‌బర్గ్, నవంబరు 22: ఉగ్రవాదం-మాదకద్రవ్యాల వెన్ను విరిచేందుకు జీ-20 ఉమ్మడిగా కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఫెంటానిల్ లాంటి సింథటిక్ డ్రగ్స్ సరఫరా, వినియోగం శరవేగంగా విస్తరిస్తోందని, ఉగ్రవాదానికి ఇంధనంగా పనిచేస్తున్న ఈ సమస్యను సత్వరమే అరికట్టాల్సి ఉందని చెప్పారు. ఫెంటానిల్ లాంటి సింథటిక్ డ్రగ్స్ వల్ల ప్రజారోగ్యం దెబ్బతినడమే కాకుండా, సమాజంలో సుస్థిరత ప్రమాదంలో పడుతుందని, ప్రపంచ భద్రతకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఇక్కడ జీ20 సదస్సులో ప్రసంగించారు. ఉగ్రవాదం-మాదకద్రవ్యాల నెట్‌వర్క్ వెన్ను విరిచేందుకు జీ20 దేశాల ఆర్థిక, పాలన, భద్రత వ్యవస్థలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నెట్‌వర్క్ మధ్య నిధుల సరఫరా జరగకుండా చూడాలని, ఉగ్రవాద సంస్థలకు ఫండింగ్ అందకుండా చూడాలని పిలుపునిచ్చారు. ప్రపంచదేశాలన్నీ కలిసి కట్టుగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సదస్సులో మోదీ నాలుగు అంశాలను ప్రతిపాదించారు. అందులో ఉగ్రవాదం-మాదకద్రవ్యాల నెట్‌వర్క్ మొదటి అంశం. ప్రపంచంలోని అన్ని జాతుల జీవన విధానాల్లోని ప్రత్యేకతను కాపాడుకుంటూ తర్వాతి తరాలకు అందించే విషయంలోనూ ప్రపంచ దేశాలు శ్రద్ధ చూపాలన్నారు.



జీ20 సదస్సు కోసం వెళ్లిన ప్రధాని మోదీకి దక్షిణాఫ్రికాలోని సాంస్కృతిక బృందం స్వాగతం

ఆఫ్రికా దేశాల ప్రజల నైపుణ్యాన్ని ప్రపంచ అవసరాలకు తగ్గట్లుగా పెంపొందించే శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. భారత్ పది లక్షల మంది ఆఫ్రికన్ నిపుణులను తయారుచేసే బాధ్యతను తీసుకుంటుందని చెప్పారు. జీ20 దేశాలు ప్రకృతి విపత్తులు, ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధంగా అంతర్జాతీయ ఆరోగ్య రక్షణ వ్యవస్థలను రూపొందించాలని కోరారు. సూడాన్, కాంగో, పాలస్తీనా, ఉక్రెయిన్‌లలో శాంతి కోసం భారతదేశం పని చేస్తుందని ప్రకటించారు. శుక్రవారం రాత్రి ఆయన జోహాన్నెస్‌బర్గ్‌లో ప్రవాస భారతీయులను కలిశారు. శనివారం బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌తో సమావేశం అయ్యారు. ఆస్ట్రేలియా, కెనడా ప్రధాన మంత్రులతో ఒకేసారి సమావేశమయ్యారు.

### అమెరికా అడ్డుకున్నా...

జీ20 దేశాధినేతల సమావేశంలో శనివారం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాన్ని అడ్డుకొనేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అమెరికా జీ20లో సభ్యురాలైనా ఈ సమావేశానికి రాలేదు. దక్షిణాఫ్రికాలోని తెల్లజాతి రైతుల మీద ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అమెరికాకు నచ్చడం లేదు. పైగా జీ20 తీర్మానంలోని భాష అమెరికాకు అభ్యంతరకరంగా ఉంది. ఈ కారణంగా జీ20 సదస్సుకు వెళ్లొద్దని అమెరికా ప్రతినిధులను ట్రంప్ ఆదేశించారు. జీ20 తీర్మానం ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారంగా మారిన కాంగో, పాలస్తీనా, ఉక్రెయిన్ తదితర యుద్ధాలను, అంతర్యుద్ధాలను పరిష్కరించేందుకు జీ20 దేశాలు చొరవ తీసుకుంటాయి. పర్యావరణ సమస్య మీద శాస్త్రీయ డేటా ఉన్నప్పటికీ దాన్ని ట్రంప్ వ్యతిరేకిస్తున్నారు. జీ20 దేశాలు మాత్రం డేటా మీద విశ్వాసాన్ని ఉంచి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాయి. వర్ధమాన దేశాల అప్పుల సమస్య పరిష్కారానికి కూడా మార్గాలను అన్వేషిస్తాయి. వర్ధమాన దేశాలను కేవలం ఖనిజం ఎగుమతి దేశాలుగా మాత్రమే చూడకుండా వెలికితీసే దేశంలోనే విలువను జోడించే ప్రయత్నం చేస్తారు. అంటే, గనుల దగ్గరే అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి సహకరిస్తారు.

## బెంగాల్‌లో 66% పెరిగిన ఓటర్లు

**బంగ్లా సరిహద్దు జిల్లాల్లో భారీ పెరుగుదల**

న్యూఢిల్లీ/కోల్‌కతా, నవంబరు 22: పశ్చిమబెంగాల్‌లో గత 23 ఏళ్లలో ఓటర్ల సంఖ్య 66% పెరిగింది. ఎన్నికల కమిషన్(ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే(సర్) ద్వారా ఈ విషయం వెల్లడైంది. 2002లో పశ్చిమబెంగాల్ మొత్తం ఓటర్ల సంఖ్య 4.58 కోట్లు ఉండగా, అది 2025 నాటికి 7.63 కోట్లకు పెరిగింది. 2002లో ఓటర్ల సవరణ చేపట్టినప్పుడు పశ్చిమబెంగాల్‌లో 18 జిల్లాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 23కు పెరిగింది. ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిన మొదటి పది జిల్లాల్లో 9 బంగ్లాదేశ్ సరిహద్దులోనే ఉండటం గమనార్హం. అక్కడి నుంచి ముస్లింలు భారీగా దేశంలోకి చొరబడ్డారనేందుకు ఇదే ఆధారమని బీజేపీ పేర్కొనగా, అక్కడ హింసను తట్టుకోలేక హిందూ శరణార్థులు సరిహద్దు దాటి వచ్చినదానికి ఇది సంకేతమని అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) తెలిపింది. బంగ్లాదేశ్ సరిహద్దు జిల్లాల్లో ఉత్తర దినాజ్‌పూర్(105.49 శాతం), మాల్దా(94.58), ముర్షీదాబాద్(87.65), దక్షిణ 24 పరగణా(83.30), జల్పాయ్‌గురి(82.3), కూచ్‌బెహార్(76.52), ఉత్తర 24 పరగణా(72.18), నాదియా((71.46), దక్షిణ దినాజ్‌పూర్(70.94 శాతం) ఓటర్లు పెరిగారు. ఇక బంగ్లాదేశ్ సరిహద్దులో లేని బిర్‌భూమ్ జిల్లాలోనూ 73.44 శాతం ఓటర్లు పెరగడం గమనార్హం. ఇది ఆందోళనకరమైన అంశమని బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాహుల్ సిన్హా పేర్కొన్నారు. అయితే, 'బంగ్లాదేశ్‌లో హిందువుల జనాభా 23%(1951లో) నుంచి 8శాతానికి(2022లో) తగ్గింది. వారంతా చైనాకి వెళ్లలేదు. కొంతమంది అసోం, త్రిపురలకు వెళ్లగా, భారీగా పశ్చిమబెంగాల్‌కు వచ్చారు" అని టీఎంసీ అధికార ప్రతినిధి అరూప్ చక్రవర్తి తెలిపారు.

## ఇక ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు

### యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈలు రద్దు

**» రానున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు**

న్యూఢిల్లీ, నవంబరు 22: ఉన్నత విద్యా రంగంలో సమూల మార్పులు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా సమీకృత ఉన్నత విద్య నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయనుంది. డిసెంబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న పది బిల్లుల్లో ఇందుకు సంబంధించిన బిల్లు కూడా ఉండనుంది. ఇంతవరకు ఉన్న యూజీసీ, ఏఐసీటీఈ, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ)లను రద్దు చేసి వాటి స్థానంలో భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్‌ఈసీఐ)ని ఏర్పాటు చేయనుంది. ఇంతవరకు యూజీసీ నాన్ టెక్నికల్ విద్యా రంగాన్ని, ఏఐసీటీఈ సాంకేతిక విద్యా రంగాన్ని, ఎన్‌సీటీఈ ఉపాధ్యాయ విద్యారంగాన్ని చూసుకునేవి. ఇకపై ఈ మూడింటినీ హెచ్‌ఈసీఐ పర్యవేక్షించనుంది. వైద్య విద్య, న్యాయ విద్యలను మాత్రం దీని పరిధిలోకి తీసుకొని రాలేదు. హెచ్‌ఈసీఐకి మూడు ప్రధాన బాధ్యతలను ప్రభుత్వం అప్పగించనుంది. నియంత్రణ, అక్రిడిషన్, వృత్తి ప్రమాణాలను నెలకొల్పడం వంటి కర్తవ్యాలను నిర్వహించనుంది. నాలుగో కర్తవ్యమైన నిధులు సమకూర్చడం హెచ్‌ఈసీఐ పరిధిలో ఉండదు. దీనిని సంబంధిత మంత్రిత్వ శాఖలు చూసుకుంటాయి. సెక్యూరిటీస్ మార్కెట్‌కు సంబంధించిన చట్టాలను ఏకీకృతం చేసి సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు (ఎస్ఎంసీ)ను కూడా కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. సెబీ యాక్ట్-1992, డిపాజిటర్స్ యాక్ట్-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్ రెగ్యులేషన్ యాక్ట్-1956లను సమ్మిళితం చేసి కొత్త కోడ్‌ను రూపొందించనుంది.

# రెండేళ్ల నుంచే ఉగ్ర కుట్ర

**» విచారణలో ఉగ్రవాది ముజమ్మిల్ వాంగ్మూలం.. పాక్ నుంచే ఆదేశాలు వచ్చినట్లు వెల్లడి**



న్యూఢిల్లీ/ హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): దేశంలోని చాలా నగరాల్లో ఏకకాలంలో బాంబు దాడులు చేసేందుకు రెండేళ్ల నుంచే ప్రణాళిక రచించినట్లు ఫరీదాబాద్ ఉగ్ర ముఠాలోని కీలక నిందితుడైన డాక్టర్ ముజమ్మిల్ తెలిపాడు. బాంబుల తయారీ కోసం రెండేళ్ల నుంచి వివిధ ప్రదేశాల నుంచి అమ్మోనియం వంటి ఎరువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసినట్లు ఎన్ఐఏ విచారణలో వాంగ్మూలం ఇచ్చాడు. ఈ ముఠాలోని సభ్యులతో పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన వ్యక్తులు ఎవరెవరు సంప్రదింపులు జరిపారన్నది కూడా బయటపెట్టినట్లు ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. హరియాణాలోని గురుగ్రామ్, నూహ్‌లో ముజమ్మిల్ రూ.3 లక్షలతో 26 క్వింటాళ్ల ఎన్‌పీకే (నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం) ఎరువులను కొనుగోలు చేయగా, వాటితో బాంబుల తయారీ కోసం ప్రాసెస్ చేసే బాధ్యతను ఉమర్ నబీ(ఎర్రకోట ఆత్మాహుతి బాంబర్)కి అప్పగించినట్లు వెల్లడించాడు. ప్రాసెస్ చేసిన పేలుడు పదార్థాలను నిల్వచేసేందుకు ముజమ్మిల్ ఒక డీప్ ఫ్రీజర్‌ను కొనుగోలు చేశాడు. పదార్థాలను కలిపేందుకు ఒక ఎలక్ట్రిక్ గ్రైండర్‌ను, ఫర్నేస్‌ను కొనుగోలుచేసి అల్ ఫలాహ్ వర్సిటీ పక్కనే ఉన్న ఒక కాలనీలో తనకు తెలిసిన క్యాబ్ డ్రైవర్ ఇంట్లో దాచాడు. బాంబుల తయారీ కోసం ఐదుగురు ఉగ్ర డాక్టర్లు స్వయంగా డబ్బు సమకూర్చినట్లు ముజమ్మిల్ వెల్లడించాడు. ఉమర్ రూ.2 లక్షలు, ముజమ్మిల్ రూ.5 లక్షలు, అదీల్ రూ.8 లక్షలు, ముజఫర్ రూ.6 లక్షలు, షాహీన్ సయీద్ రూ.5 లక్షలు తమ వాటాగా ఇచ్చినట్లు తెలిపాడు. ఈ డబ్బులో నుంచే రూ.6.5 లక్షలతో ముజమ్మిల్ ఒక ఏకే-47 తుపాకీని కొనుగోలు చేశాడు. పాకిస్థాన్ నుంచి తమతో ఎవరెవరు మాట్లాడింది కూడా ముజమ్మిల్ వెల్లడించాడు. తనతో మన్సూర్ అనే వ్యక్తి, ఉమర్‌తో హషీమ్ సంప్రదింపులు జరిపేవాడని, వీరిద్దరు ఇబ్రహీం అనే మరో వ్యక్తి కింద పనిచేసేవారని తెలిపాడు. ఇదిలా ఉండగా, హైదరాబాదీ వైద్యుడు మొహియుద్దీన్‌కు ఆఫ్గనిస్థాన్‌లోని ఇస్లామిక్ స్టేట్‌తో సంబంధాలు ఉన్న అబు ఖదీజా అనే వ్యక్తి నుంచి టెలిగ్రామ్ ద్వారా సూచనలు అందేవని, ఆ సూచనల మేరకే తన నివాసంలో రిసిన్ అనే విషం తయారుచేశాడని విచారణలో తేలింది.

## జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణానికి

# 6 దేశాల నుంచి అతిథులు

**» సీజేఐ ప్రమాణ స్వీకారానికి విదేశీ బృందం రావడం ఇదే తొలిసారి**

**» రేపు రాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం**

న్యూఢిల్లీ, నవంబరు 22: భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆరు దేశాల నుంచి విదేశీ ప్రతినిధుల బృందం హాజరుకానుంది. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో నేపాల్, భూటాన్, శ్రీలంక, మారిషస్, కెన్యా దేశాల ప్రధాన న్యాయమూర్తులు పాల్గొననున్నారు. అలాగే మలేసియా నుంచి ఓ బృందం రానుంది. విదేశాలకు చెందిన ఐదుగురు సీజేలు, ఆరుగురు న్యాయమూర్తులతో పాటు వారి కుటుంబ సభ్యులు కలిపి మొత్తం 15 మంది అతిథులు హాజరుకానున్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విదేశీ బృందం రానుండటం ఇదే తొలిసారి. అలాగే వీరంతా భారత రాజ్యాంగ దినోత్సవం(నవంబరు26న) కార్యక్రమంలోనూ పాల్గొంటారు.

**ఇదీ నేపథ్యం..**

జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. హిసార్‌లోని ప్రభుత్వ పీజీ కాలేజీలో డిగ్రీ చదువుకున్నారు. రోహ్‌తక్ లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి 1984లో లా డిగ్రీ అందుకున్నారు. అదే ఏడాది హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన ఆయన న్యాయవాద వృత్తిలో అనతికాలంలోనే రాణించారు. 2000లో 38 ఏళ్ల వయసులో హరియాణా అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. సుప్రీం కోర్టులో పలు రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సమర్థించిన తీర్పుతో సహా పలు ముఖ్యమైన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. కాగా, దేశవ్యాప్తంగా వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న 5కోట్లకు పైగా కేసుల పరిష్కారానికి కృషి చేయడం, వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా 'గేమ్ చేంజర్' మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడానికి సీజేఐగా అత్యంత ప్రాధాన్యం ఇస్తానని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సోమవారం సీజేఐగా ప్రమాణం చేయనున్న నేపథ్యంలో శనివారం ఆయన తన నివాసంలో మీడియాతో ముచ్చటించారు. న్యాయమూర్తులు, తీర్పులపై ఆన్‌లైన్ ట్రోలింగ్ వంటి విషయాలు తనను ఎప్పుడూ కలవరపెట్టలేదన్నారు. సహేతుకమైన విమర్శలు ఎప్పుడూ ఆమోదయోగ్యమని అన్నారు.



### జస్టిస్ గవాయ్ తొలి బౌద్ధ సీజేఐ

పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత సీజేఐ జస్టిస్ గవాయ్ న్యాయమూర్తుల నియామకంలో కీలక పాత్ర పోషించారు. సీజేఐగా దాదాపు తన 6 నెలల పదవీ కాలంలో ఎస్సీ కేటగిరికి చెందిన 10 మందిని, బీసీ కేటగిరి నుంచి 11 మందిని దేశంలోని వివిధ హైకోర్టులకు న్యాయమూర్తులుగా నియమించారు. సీజేఐగా సేవలు అందించినవారిలో జస్టిస్ గవాయ్ తొలి బౌద్ధుడు, రెండో దళితుడు కావడం విశేషం.



# అణుమాత్రం చెదరని దీవి!

**» అణుబాంబులను తట్టుకొని నిలిచే 'కదిలే కృత్రిమ దీవి'ని నిర్మిస్తున్న చైనా**

బీజింగ్, నవంబరు 22: తయారీరంగంలో ప్రపంచానికే కేంద్రంగా మారి.. అమెరికాతో ఆర్థికంగా, సైనికంగా పోటీ పడుతున్న చైనా మరో కొత్త అస్త్రాన్ని సిద్ధం చేస్తోంది. అణుబాంబును కూడా తట్టుకొని నిలిచే కృత్రిమ ద్వీపాన్ని నిర్మిస్తోంది. వివాదాస్పద దక్షిణ చైనా జలాల్లో దీనిని మోహరించే లక్ష్యంతో ఈ భారీ ప్రాజెక్టును చేపట్టినట్లు సమాచారం. సముద్ర గర్భంలో పరిశోధనల కోసమే ఈ 'మెగా సైన్స్ ప్రాజెక్టు' అని చైనా చెబుతున్నప్పటికీ.. సముద్రజలాల్లో సైనికపరమైన ఆధిపత్యం కూడా మరో కారణమై ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గంటకు 15 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించే ఈ కృత్రిమ ద్వీపం పొడవు 138 మీటర్లు, వెడల్పు 85 మీటర్లు, ఎత్తు నీటి మట్టం నుంచి 45 మీటర్లు. బరువు 78 వేల టన్నులు. దీని మీద 238 మంది వ్యక్తులు వరుసగా నాలుగు నెలలపాటు బయటి నుంచి ఎటువంటి సరఫరాలు లేకుండా ఉండవచ్చు. తుపానుల్లోనే అత్యంత తీవ్రమైన 'క్యాటగిరీ 17' తుపాన్లను తట్టుకునేలా దీనిని ట్విన్‌హల్ విధానంలో రూపొందిస్తున్నారు. నీరు నౌకలోకి రాకుండా.. రెండు పొరల లోహంతో (వాటి మధ్య ఖాళీ ఉంచి) నౌకను నిర్మించే విధానాన్ని ట్విన్‌హల్ అంటారు. 2028లో పూర్తి చేసే లక్ష్యంతో ఈ ద్వీపాన్ని నిర్మిస్తున్నారు. దీని డిజైన్‌ను షాంఘై జియో టాంగ్ వర్సిటీ, చైనా ప్రభుత్వ నౌకల తయారీ కార్పొరేషన్ సంయుక్తంగా రూపొందించాయి. నిర్మాణానికి కూడా జియోటాంగ్ వర్సిటీకి చెందిన లిన్ జాంగ్‌క్విన్ అనే శాస్త్రవేత్త సారథ్యం వహిస్తున్నారు. ఆర్థికంగా గత 3-4 దశాబ్దాల కాలంలోనే అప్రతిహత వేగంతో పురోగమించిన చైనా.. ప్రస్తుతం అంతగా వినియోగంలోకి రాని సముద్ర వనరుల (బ్లూ ఎకానమీ- నీలి ఆర్థిక వ్యవస్థ) మీద దృష్టి పెడుతోంది. సముద్ర గర్భంలోని వనరులను వెలికితీయటం, పునరుత్పాదక ఇంధనాన్ని సముద్రం నుంచి ఉత్పత్తి చేయటం వంటి పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తోంది. తద్వారా, ప్రపంచ దేశాలకన్నా ముందే ఈ రంగంలో అడుగుపెట్టి అగ్రస్థానం కైవసం చేసుకోవాలని భావిస్తోంది. దాంట్లో భాగంగానే దక్షిణ చైనా సముద్రంలో మోహరించే లక్ష్యంతో కృత్రిమ ద్వీపాన్ని నిర్మిస్తోంది. దక్షిణ చైనా సముద్ర జలాలపై పూర్తి ఆధిపత్యం కోసం చైనా కొంతకాలంగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో.. ఈ భారీ ప్రాజెక్టు వెనుక సైనిక లక్ష్యాలు కూడా ఉండవచ్చన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar**, Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.